



## ముహూర్తం

శ్రీ వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం
తిథి: చవితి ఉ.7.28 వరకు; నక్షత్రం: రోహిణి సా.5.00 వరకు; రాహుకాలం: ఉ.10.34 నుండి మ. 12.01 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.32 నుండి 9.18, మ.12.24 నుండి 1.10 వరకు; వర్జ్యం: ఉ.8.37 నుండి 10.18 వరకు, రా.10.45 నుండి శనివారం ఉ.0.24 వరకు; యమగండం: మ.2.55 నుండి సా.4.22 వరకు; అమృతకాలం: మ.1.39 నుంచి మ.3.19 వరకు


Estd. 1938

# ఆంధ్రప్రభ

www.prabhanews.com Journalism first!

సంపుటి:58 • సంచిక: 179 • శుక్రవారం 18 అక్టోబర్ 2019 • హైదరాబాద్ * పేజీలు:10+4 • వెల: 5.00 • Published from:Hyderabad | Karimnagar | Nizamabad | Suryapet | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Kurnool | Anantapur | Nellore


# తప్పంతా వారిదే



## హైకోర్టులో బలంగా వాదనలు వినిపించండి

- ఏకపక్షంగా సమ్మెకు.. వద్దన్నా వినలేదు
- పండగ వేళ ప్రజలకు కష్టాలు తెచ్చారు
- ఐనా బస్సులు బాగా నడుపుతున్నాం
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సమ్మెనష్టాలపై కీలక నివేదిక
- అడిగిందానికన్నా ఎక్కువగానే ఫిట్‌మెంట్ ఇచ్చాం
- విలీనంపై ఎప్పుడూ మాటివ్వలేదు.. మేనిఫెస్టోలోనూ పెట్టలేదు
- త్వరలోనే ఎండీ నియామకం.. కసరత్తు మొదలుపెట్టాం
- ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష




**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** ఆర్టీసీ కార్మికుల సమ్మె విషయంలో ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరించిందని, పండగవేళ వద్దన్నా వినకుండా ఏకపక్షంగా కార్మికులు సమ్మెకు వెళ్లారని, అయినా ప్రజాసౌకర్యం కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని, ఇదే విషయాన్ని హైకోర్టులో బలంగా వినిపించాలని అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. సమ్మె విషయంలో తప్పంతా కార్మికులదేనని, ప్రభుత్వం ప్రయాణీకుల కష్టాలు తీర్చేందుకు చేసిన ప్రయత్నాలను సవివరంగా న్యాయస్థానానికి వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. కార్మికుల కోసం ప్రభుత్వం గతంలో చేసిన సానుకూల నిర్ణయాలు, నష్టాలు, కష్టాలు సహా అన్ని విషయాలను ఉదహరించాలని ఆయన సూచించారు. గురువారం మధ్యాహ్నం ప్రగతి భవన్‌లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ, రవాణాశాఖ ఉన్నతాధికారులతో కేసీఆర్ సమావేశమయ్యారు. సమ్మె ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఆర్టీసీ సమ్మెకు సంబంధించిన పిటీషన్లపై శుక్రవారం హైకోర్టు ధర్మాసనం విచారణ చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాలని కేసీఆర్ సమావేశంలో పాల్గొన్న అడ్వకేట్ జనరల్, అదనపు అడ్వకేట్ జనరల్ న్యాయశాఖ కార్యదర్శి ➪ 3వ పేజీలో...

### హుజూర్‌నగర్‌లో వర్ష బీభత్సం



# సీఎం కేసీఆర్ సభ రద్దు

### భారీ వర్షం కారణంగా హెలికాప్టర్‌కు అనుమతివ్వని ఏవియేషన్‌శాఖ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** భారీవర్షం నేపథ్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు హుజూర్‌నగర్ పర్యటన రద్దయింది. గురువారం హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఎన్నికల ప్రచారసభలో సీఎం ప్రసంగించాల్సిఉండగా, అదే సమయానికి అతి భారీ వర్షం కురవడంతో హెలికాప్టర్‌లో ప్రయాణానికి ఏవియేషన్ శాఖ అనుమతివ్వలేదు. హుజూర్‌నగర్‌లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో పాటు మార్గమధ్యలో కూడా ఉరుములు, పిడుగులతో కూడిన భారీవర్షం పడుతుండడంతో పైలట్ల సూచనమేరకు అనుమతి రద్దుచేసినట్లు ఏవియేషన్ ఏవియేషన్ డైరెక్టర్ వీఎన్ భరత్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సభతో హుజూర్‌నగర్ నియోజకవర్గ ఓటర్లలో జోష్ తీసుకురావాలని భావించిన టీఆర్ఎస్ నేతలు దీంతో నిరుత్సాహపడ్డారు. అయితే ముఖ్యమంత్రి సభ రద్దయిన వెంటనే ప్రత్యేకంగా సమావేశమైన మంత్రి జగదీష్‌రెడ్డి, ఉప ఎన్నికల ఇన్‌ఛార్జి డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సైదిరెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలంతా తదుపరి వ్యూహంపై చర్చించారు. సీఎం సభ, సీఎం ఇచ్చే హామీలతో వార్ వన్‌సైడ్‌లా మారుతుందని భావించిన టీఆర్ఎస్ నేతలకు వాతావరణం అనుకోని ఇబ్బందులకు గురిచేసినా గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రెండురోజుల్లో ప్రచారాన్ని మోతెక్కించేలా పకడ్బందీ వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. ఆఖరి అస్త్రాలను బయటకు తీశారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయం నుండి మధ్యాహ్నం 1గంటకు బయల్దేరేవిధంగా షెడ్యూల్ విడుదల చేయడంతో ➪ 2వ పేజీలో...

# బస్సులు పెరుగుతున్నాయ్

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆర్టీసీ, రవాణాశాఖ దృష్టి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఆర్టీసీ కార్మికుల సమ్మె ఒక వైపు కొనసాగుతున్నప్పటికీ ప్రయాణికులకు కావాల్సిన రవాణా సౌకర్యాలపై రవాణా, ఆర్టీసీ అధికారులు దృష్టి కేంద్రీకరించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 100 శాతం బస్సులను తిప్పేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు పరుస్తున్న ➪ 3వ పేజీలో...



# సమ్మెపై ఆరా

- మంత్రి పువ్వాడకు గవర్నర్ తమిళిసై ఫోన్
- రాజ్‌భవన్‌కు సునీల్‌శర్మ
- త్వరలో గవర్నర్‌ను కలవనున్న మంత్రి

5



## విద్యుత్ సంస్థల్లో కొలువుల జాతర

3025 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ

డిసెంబర్ 15, 22న పరీక్షలు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీసంస్థ పరిధిలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. వివిధ కేటగిరీల కింద మొత్తం 3025పోస్టులను భర్తీ చేయనున్నారు. జూనియర్ లైన్‌మెన్ పోస్టులు 2500, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ పోస్టులు 25, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఉన్నాయి. పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన పోస్టులు భర్తీతోపాటు రిజర్వేషన్లను కూడా పాటించనున్నారు. ఆయా కేటగిరీల్లో అభ్యర్థుల వయసు, విద్యార్హతలు తదితర వివరాలు కూడా నోటిఫికేషన్‌లో పొందుపరిచారు. టీఎస్ సదరన్ పవర్ డాట్ కాం ➪ 2వ పేజీలో...

# మేమూ సమ్మె చేస్తాం

- 16 డిమాండ్లతో సీఎస్‌కు వినతి పత్రం
- చర్చలకు పిలవండి • నెలాఖరులోగా స్పందించకుంటే ఆందోళన బాట
- ఆర్టీసీ సమ్మె.. రాష్ట్ర బంద్‌కు మద్దతు
- ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ వెల్లడి

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో తాము కూడా సమ్మె చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. నెలాఖరులోగా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనబాట పడతామని తెలిపాయి. ఈ మేరకు 16 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆయా సంఘాల జేఏసీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశాయి. ఉద్యోగ, ➪ 8వ పేజీలో...



## సికింద్రాబాద్ ప్యారడైజ్‌కు రూ.లక్ష జరిమానా

- బిర్యానీలో వెంట్రుకలు
- వినియోగదారుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ

5



# రాయితీలిచ్చి ఏం లాభం?





## 5 ట్రిలియన్ డాలర్లు అసాధ్యం

9

గాడిన పెట్టాల్సింది పోయి విమర్శలా?

మన్మోహన్ ధ్వజం

- సమన్వయలోపంతో ఆర్థిక శాఖ ఆదేశాలు బేఖాతరు
- క్షేత్రస్థాయికి చేరని ఉపశమన చర్యలు
- ఆర్బీఐ చెప్తేనే చేస్తామంటున్న బ్యాంకులు
- కేంద్రం ఆదేశాలను పట్టించుకోని రాష్ట్రాలు

**(న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి):** కేంద్ర ఆర్థిక శాఖ పాలకులకు, వారి ఆదేశాల్ని అమలుచేసే అధికార యంత్రాంగానికి మధ్య సమన్వయలోపం స్పష్టమౌతోంది. జాతీయస్థాయిలో నెలకొన్న ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ పలు రంగాలకు తాత్కాలిక ఉపశమన చర్యలు ప్రకటించారు. తద్వారా ఆ రంగాన్ని ఆర్థికంగా నిలబెట్టుకునేందుకు సహకరించాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆలోచన. అయితే వీటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అధికార యంత్రాంగానికి వీటిపై కనీసం సమాచారం కూడా లేదు. నిర్దిష్ట విధానంలో ఉత్తర్వులందక పోవడంతో కేంద్ర ఆదేశాల్ని వారు ఖాతరు చేయడంలేదు. దీంతో ప్రభుత్వం ఆశించిన ఉపశమన చర్యలు అందుబాటులోకి రావడంలేదు. వరుసగా మూడు విడతల వాయిదాలు చెల్లించని పక్షంలో సదరు ఖాతాదారు హామీగా ఉంచిన సంపదను నిరర్థక ఆస్తులుగా బ్యాంకులు ప్రకటిస్తాయి. అయితే ప్రస్తుత ఆర్థిక మాంద్యంతో రుణగ్రహీతలు సక్రమంగా వాయిదాల్ని చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారు. అలాగని తమ ఆస్తుల్ని పోగొట్టుకునేందుక్కూడా సిద్ధంగా లేరు. ఒకసారి నిరర్థక ఆస్తుల జాబితాలోకెళ్తే వాటిని తిరిగి పొందడం కష్టం. పైగా సదరు ఖాతాదారుడికి ఎక్కడా అప్పు పుట్టదు. దీంతో ఇతర వ్యాపారాలు, పరిశ్రమలపై కూడా ప్రభావం పడుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ వచ్చే మార్చి నెలాఖరు వరకు వాయిదాల చెల్లింపులో సడలింపులకు అవకాశం కల్పించాలని బ్యాంకులకు సూచించారు. అంతవరకు సక్రమంగా వాయిదాలు చెల్లించని పక్షంలో కూడా హామీగా ఉంచిన సంపదను నిరర్థక ఆస్తులుగా ప్రకటించొద్దని ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఈ ఆదేశాలు అమలుకావడంలేదు. వరుసగా మూడు విడతల వాయిదాల్ని చెల్లించలేక పోయిన బకాయిదార్ల ఆస్తుల్ని బ్యాంకులు యదావిధిగా నిరర్థక జాబితాలోకి నెట్టేస్తున్నాయి. అదేమని అడిగితే సంబంధిత ఆదేశాలు తమకందలేదని పేర్కొంటు న్నాయి. కేంద్రమంత్రి ఆదేశంతో తమకు పనిలేదని ➪ 3వ పేజీలో...

## రామజన్మభూమి

# ఆస్తి కాదు విశ్వాసం



రామజన్మభూమి ప్రాంతాన్ని ఒక ఆస్తిగానో లేక సంపదగానో పరిగణించకూడదు. ఇది హిందువుల మత విశ్వాసాలకు సంబంధించినది. ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్యనీయుడైన రాముడు పుట్టిన ప్రాంతంగా పరిగణించబడుతున్నది. ఈ సెంటిమెంట్‌కు విలువకట్టలేం. రామజన్మభూమిలో మందిర నిర్మాణం ఏ ఒక్క రాజకీయ పార్టీకో దఖలైన హక్కుకాదు.

- హిందువుల వారసత్వ సంపద
- అన్ని మతాల వారికీ పవిత్ర నగరాలు
- అయోధ్య హిందువుల సెంటిమెంట్
- భక్తుల విశ్వాసాలను గౌరవించాలి
- న్యాయస్థానాలు పరిగణనలోకి తీసుకోవాలి
- సామాజిక నిపుణుల సూచనలు

**(న్యూ ఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)** దశాబ్దాల రామజన్మభూమి వివాదానికి నవంబర్ 17న ముగింపు లభించనుంది. వరుస వాదనల అనంతరం భారత సర్వోన్నత న్యాయస్థానం ఇక ఈ వివాదంపై తుది తీర్పు ప్రకటనకు సిద్ధమైంది. రామజన్మభూమి ప్రాంతంలో గొప్ప మందిరాన్ని నిర్మించుకోవాలన్నది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువుల ఆకాంక్ష. ఈ స్థలంపై హక్కు సాధించాలన్నది ముస్లింల పట్టుదల. చారిత్రక ఆధారాల మేరకు రాముడు ఇక్కడే పుట్టాడు. దీన్ని హిందువులంతా పవిత్ర స్థలంగా భావిస్తారు. విష్ణువు 7వ అవతారంలో మనిషిగా జన్మించాడు. ఒక మానవుడు ఏ విధంగా సంస్కృతి, సంప్రదాయాలు, విలువల్తో కూడిన జీవితాన్ని నిర్వర్తించాలో రాముడి రూపంలో ప్రపంచానికి చాటాడు. అందుకే రాముడు మతాలకతీతంగా ఆదర్శ ప్రాయుడయ్యాడు. ఆయన జన్మించిన ప్రాంతాన్ని భవిష్యత్ తరాలకు పవిత్ర ఆలయ రూపంలో వారసత్వ సంపదగా అందించేందుకు హిందువులంతా ఆతృతగా ఉన్నారు. ప్రపంచంలో వివిధ మతాలున్నాయి. మానవ రూపాల్లో సంచరించిన దైవాంశ సంభూతులు జన్మించిన ప్రాంతాలు, నడయాడిన నేలల పట్ల ఆయా మత విశ్వాసకుల్తో పాటు ఇతరుల్లోనూ పవిత్ర భావం తొణికిస లాడుతోంది. మతప్రవక్తల బోధనలు, ఆశయాలు, ఆకాంక్షలే కాదు.. వారి జీవితంలో చోటు చేసుకున్న ప్రతి అంశంపైన సాధారణ ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది. అయోధ్య కూడా ఇలాంటిదే. ప్రస్తుతం వివాదానికి గురైన ప్రాంతంలోనే రాముడు పుట్టాడన్నది చారిత్రక ➪ 3వ పేజీలో...



# హుజూర్ బెట్టింగ్ నగర్



- గెలుపు..మెజారిటీలపై పందేలు
- పొరుగురాష్ట్రాల నుండి దిగిన పందెం రాయుళ్లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఇపుడు బెట్టింగ్‌రాజులకు హాట్‌కేక్‌లా మారింది. ఈ ఉప ఎన్నికలో అభ్యర్థులు పెట్టే ఖర్చును మించి కోట్లల్లో పందేలు సాగుతుండడం విస్మయపరిచే అంశం. హుజూర్‌నగర్ కాంగ్రెస్ సిట్టింగ్ సీటు కాగా, ఇక్కడ టిఆర్ఎస్ ఇంతవరకు గెలవలేదు. అయితే టీఆర్ఎస్ ఉప ఎన్నికల ట్రాక్ రికార్డు, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండడం ఈ రెండు అంశాలను బేరీజు వేసుకున్న బుకీ ఏజెంట్లు ఇటు టీఆర్ఎస్ తరుపున, అటు కాంగ్రెస్‌కు ఉన్న హ్యాట్రిక్ రికార్డు, ఆర్టీసీ సమ్మె పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ తరుపున పోటాపోటీ పందేలు కాస్తున్నట్లు తెలిసింది. కొందరు బెట్టింగ్‌రాయుళ్ళు రాజకీయపార్టీలకంటే అధికంగా, సూక్ష్మంగా నియోజకవర్గాల్లోని పరిస్థితులు అధ్యయనం చేసి పందేలు కాస్తుండడం విశేషం. గెలుపుతో పాటు గెలిచిన పార్టీకి వచ్చే మెజారిటీపై లక్షల్లో పందేలు కాసి మధ్యవర్తుల వద్ద ఉంచినట్లు తెలిసింది. నల్లగొండకు సరిహద్దు జిల్లాలైన ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన కృష్ణా, గుంటూరు జిల్లాల వాసులు భారీపందేలతో రంగంలోకి దిగినట్లు తెలిసింది. హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుండి కూడా భారీగా పందేల రాయుళ్ళు హుజూర్‌నగర్ తరలివెళ్ళి స్థానికంగా హోటళ్ళలో మకాంవేసి పరిస్థితులను తెలుసుకునిపందేల బరిలోకి దూకుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బెట్టింగ్ రాయుళ్ళు తమ వేగులను నియోజకవర్గానికి పంపి, తాము హైదరాబాద్‌లోనే ఉండి పరిస్థితి ఎప్పటికపుడు ఫోన్ల ద్వారా తెలుసుకుంటూ బెట్టింగ్‌లకు దిగుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం 2.36లక్షల ఓటర్లున్న హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం ఎంత నమోదైతే.. ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయో.. ఏ మండలంలో ఎవరికి మెజారిటీ వస్తుంది.. ఏ మండలం ఫలితం నిర్ణయిస్తుంది.. అన్న అంశాలపై నిర్ధారణకు వస్తూ బెట్టింగ్‌లకు సై అంటున్నారు. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే పెరుగుతాయా.. తగ్గుతాయా అన్నదానిపై కూడా భారీగా పందెం కాస్తున్నట్లు సమాచారం. నగదు లక్షల్లో తీసుకొచ్చి మధ్యవర్తుల వద్ద పెడుతుండగా, మరికొందరు కొందరు ప్లాట్ల దస్తావేజులు, పొలాల దస్తావేజులు మధ్యవర్తుల వద్ద ఉంచుతున్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక రాజకీయపార్టీలకు ప్రతిష్టాత్మకం కాగా, బెట్టింగ్ రాయుళ్ళు కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని కోట్ల రూపాయలను చేతులు మారుస్తున్నారు. హైదరాబాద్ ట్రేడ్ వర్గాల్లోనూ హుజూర్‌నగర్ ఫలితంపై ఆసక్తినెలకొంది.



## మర్కటాలకు మరణయాతన

ఎవరెన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, మూగజీవాలపై ఔషధ ప్రయోగాలు వైద్యరంగంలో మామూలే. కానీ అందులో కర్కశత్వం శ్రుతిమించుతుండటం గుండెలను పిండేస్తోంది. జర్మనీలో జరుగుతున్న దారుణాలు చూస్తే ఎవరికైనా హృదయాలు బరువెక్కుతాయి. హంబర్గ్ శివారులోని ప్రైవేటురంగానికి చెందిన లేబరేటరీ ఆఫ్ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీలో మర్కటాలపై ప్రయోగాలు నిర్వహించేందుకు ఇనుపచట్రాలతో కూడిన పరికరాల మధ్య నిలెబెట్టి బంధించడం, అవి మెడకూడా తిప్పలేని స్థితిలో ఉండి నరకయాతన అనుభవిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. ఇక ఎటువంటి గాయాలు లేని కుక్కలను బోనల్లో నిర్దయగా బంధించి ప్రయోగాలు చేస్తూంటే గాయాలు లేకపోయినా తోకలనుండి రక్తం ధారలు కారడం, పిల్లులను పంజరాల్లో బంధించి, రోజుకు 13 ప్రయోగాత్మక ఇంజెక్షన్లు ఇవ్వడం వంటి దారుణాలు అక్కడ కొనసాగుతున్నాయి. జంతు సంరక్షక ఉద్యమకర్త ఒకరు సాధారణ ఉద్యోగిలా అక్కడ చేరి సేకరించిన వివరాలు, సాక్ష్యాలు దిగ్భ్రమ కలిగిస్తున్నాయి. సోకో టయర్షుజ్ అనే జంతువుల పట్ల క్రూరత్వ నిర్మూలన సంస్థకు చెందిన ఈ ఉద్యోగి సేకరించిన చిత్రాలు చూస్తే అక్కడి దారుణాలెలా ఉన్నాయో తెలుస్తుంది.




## సీఎం కేసీఆర్ సభ రద్దు

(మొదటిపేజీ తరువాయి)

పాటు సీఎం కూడా సన్నద్ధతతోనే ఉన్నారు. అయితే వాతావరణం ప్రతికూలంగా ఉండడం సభ రద్దుకు దారితీసింది. ఇప్పటికే మునిసిపల్ శాఖా మంత్రి కేటీఆర్ ఒకరోజు రోడ్‌షో నిర్వహించి వెళ్ళగా, చివరిరోజు ఆర్థికమంత్రి హరీష్‌రావును ప్రచారానికి రప్పించే ప్రయత్నాల్లో నేతలు నిమగ్నమయ్యారు. వ్యయపరిశీలకుల కట్టడి నేతలను కొంత ఇబ్బందులకు గురిచేస్తోంది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం ఏడువేల ఓట్ల తేడాతో శానంపూడి సైదిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఓటమి పాలుకాగా, ఈ దఫా ఎన్నికల్లో ఖచ్చితంగా 20వేల మెజారిటీ సాధిస్తామని టీఆర్ఎస్ నేతలు ధీమాగా చెబుతున్నారు.

## ప్రగతిభవన్‌కు కేకే.. సీఎంతో భేటీ

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెరాస పార్లమెంటరీపార్టీనేత కే.కేశవరావు గురువారం ప్రగతిభవన్‌కు వెళ్ళారు. సీఎం కేసీఆర్‌తో కలిసి హుజూర్‌నగర్ నియోజకవర్గంలో జరిగే ఎన్నికల ప్రచారసభలో పాల్గొనేందుకు ప్రగతిభవన్ వెళ్ళిన ఆయన సిఎంతో భేటీ అయ్యారు. సీఎం ఆర్టీసి సమ్మె, పరిష్కారాలు, ప్రత్యామ్నాయాలపై అధికారయంత్రాంగంతో సుదీర్ఘసమీక్షలు నిర్వహించగా, కేకే ప్రగతిభవన్‌లోనే ఉన్నారు. హుజూర్‌నగర్ సభ అనూహ్యంగా రద్దవడంతో సాయంత్రం వరకు ప్రగతిభవన్‌లో సీఎంతోనే ఉన్నారు. ఆర్టీసి సమ్మె విషయంలో మధ్యవర్తిత్వం వహించేందుకు సిద్దమని కేకే ప్రకటించడంతో ఆర్టీసి కార్మికుల్లో ఆశలు చిగురించగా, అందరూ ప్రభుత్వం తరుపున కేకే చర్చలు జరుపుతారని భావించారు. తర్వాత తాను వ్యక్తిగతంగానే లేఖ రాశానని, ప్రభుత్వం నుండి తనకు అనుమతిలేదని కేకే తెలిపారు. ఆ తర్వాత కూడా కేకేను అనేకమంది కలిసి చర్చలకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో గురువారం కేకే ప్రగతిభవన్‌కు వెళ్ళి సిఎంను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆర్టీసి సమ్మె అంశం, కేకే లేఖపై ఇరువురి నడుమ చర్చ జరిగిందా లేదా అన్న అంశంపై స్పష్టత లేదు.

## ప్రకృతి కూడా పగబట్టింది: దాసోజు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** సీఎం కేసీఆర్ తీరుపైన ప్రకృతి కూడ పగబట్టిందని ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రావణ్‌కుమార్ అన్నారు. హుజూర్‌నగర్ ప్రజలను టీఆర్ఎస్ నుంచి వాన దేవుడు రక్షిస్తున్నాడని ఆయన తెలిపారు. గురువారం ఆయన ఆ పార్టీ నేతలు బెల్లయ్యానాయక్, అద్దంకి దయాకర్ తదితరులతో కలిసి హుజూర్‌నగర్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ నిరంకుశ విధానాలకు ప్రకృతి కూడా సహకరించడలేదన్నారు. అసత్యాలతో చేయనని వాటిని కూడా తామే చేశామంటూ తప్పుడు ప్రచారం టీఆర్ఎస్ నేతలు చేస్తున్నారని ఆయన విమర్శించారు.

## విద్యుత్ సంస్థల్లో కొలువుల జాతర

(మొదటిపేజీ తరువాయి)

లేదా టీఎస్ సదరన్‌పవర్.సీజిజి.జీవోవి.ఇన్‌లో ఉద్యోగాల బర్తీకి సబంధించిన వివరాలు పొందుపరిచారు.

### జూనియర్ లైన్‌మెన్: 2500

ఎస్పీడీసీఎల్ పరిధిలో మొత్తం 2500జూనియర్ లైన్‌మెన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. పదవ తరగతి విద్యార్హతతో ఎలక్ట్రికల్,వైర్‌మెన్ ట్రేడ్‌లలో ఐటీఐ లేదా ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. 18-35ఏళ్ల మధ్య వున్నవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ బీసీలకు ఐదేళ్లు వయోపరిమితి మినహాయింపు ఇచ్చారు. దరఖాస్తు ఫీజు చెల్లింపు ఈనెల 21నుంచి ప్రారంభమై నవంబర్ 10తో ముగియనుంది. దరఖాస్తులను ఈ నెల 22నుంచి నవంబర్ 10వరకూ స్వీకరించనున్నారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ డిసెంబర్ 5నప్రారంభం కానుంది. డిసెంబర్ 15న పరీక్ష నిర్వహించనున్నారు. జూనియర్ పర్సనల్ ఆఫీసర్స్ నియామక ప్రక్రియ కూడా ఇదే ఉన్నప్పటికీ విద్యార్హత మాత్రం ఏదైనా డిగ్రీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. వయస్సు 18నుంచి 34ఏళ్ల మధ్య ఉండాలి.

### జూనియర్ అసిస్టెంట్ కమ్ ఆపరేటర్స్:

జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్స్ పోస్టులకు విద్యార్హత ఏదైనా డిగ్రీ పూర్తి చేసివుండాలి. వయసు 18-34ఏళ్ల మధ్యలో ఉండాలి. ఫీజు చెల్లింపు ఈనెల 30నుంచి ప్రారంబించి నవంబర్20 వరకూ గడువిచ్చారు. దరఖాస్తులను ఈనెల 31నుంచి నవంబర్ 20వరకూ స్వీకరించనున్నారు. హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్ డిసెంబర్ 11నప్రారంభంకానుంది. డిసెంబర్ 22న పరీక్ష నిర్వహించనున్నారు.


తెలంగాణ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఎన్ఐటి నెం.1416/డిసిఇ(ఆర్)/ ఇఇ-ఆర్/డిఇఇ-5/ఎఇఇ-1/2019-20 తేది : 16.10.2019
పనిపేరు :ఆదిలాబాద్ సర్కిల్ క్రింద మూడు బ్రిడ్జి పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. టెండరుదారు టెండరు షెడ్యూల్‌ను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా http://tender.telangana.gov.in నుండి 22.10.2019న సా॥4.00గం॥ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్లు స్వీకరించుటకు చివరి తేది : 29.10.2019న మ॥3.30గం॥ల వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఆర్ & బి), రాష్ట్ర రహదారులు & సిఆర్ఎన్
Ro No.1399/CL/Advt/1/2019-20, Dt. 17.10.2019



తెలంగాణ ప్రభుత్వము
అటవీ శాఖ, సంగారెడ్డి
టెండరు నోటీస్
లేఖ సంఖ్య :28/యన్2/2018 తేది : 16.10.2019
సంగారెడ్డి, జహీరాబాద్ మరియు నారాయణ్‌ఖేడ్ అటవీశాఖ రేంజిలలో అటవీబ్లాక్‌ల చుట్టూ 2 మీ. పై భాగపు వెడల్పు 1.5 మీ. అడుగు భాగం వెడల్పు 2.మీ.లోతు కొలతలతో ఒక సరిహద్దు కందకాలు త్రవ్వుట కొరకు యంత్రాలనుపయోగిస్తూ వేర్వేరు ప్రదేశాలలో అన్ని రకాల మట్టి త్రవ్వకం, త్రవ్విన మట్టిని నీటుగా ఎత్తుట కొరకు నమోదిత కందకాలు రిజిష్టర్ కాంట్రాక్టర్లు లేదా పని అనుభవం గల సంస్థలు మరియు యంత్రములు కలిగి ఉన్న వ్యక్తుల నుండి వైయుక్తిక సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి గల వారు తేది :18.10.2019 నుండి 26.10.2019 ఉ॥10.30గం॥ల నుండి సా॥5.00గం॥లలోపు కార్యాలయ పనివేళల్లో సమర్పించి షెడ్యూలు పొందగలరు. టెండర్ స్వీకరణ చివరి తేది:28.10.2019 మ॥1.00గం॥ల వరకు. టెండర్లు తేది :28.10.2019న మ॥3.00గం॥లకు తెరువబడును. తదుపరి వివరాలకు కార్యాలయ ఫోన్ నెం.08455-276317 సంప్రదించగలరు.
సం/- జిల్లా అటవీశాఖాధికారి, సంగారెడ్డి
Ro No.1404/CL/Advt/1/2019-20, Dt. 17.10.2019


## మన ప్లానింగ్ విధానం
# దేశంలోనే బెస్ట్

- మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం సిద్ధం
- రియల్‌ఎస్టేట్ రంగంలో దేశంలోనే అగ్రగామిగా హైదరాబాద్
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- రియల్, భవన నిర్మాణ సంఘాలతో మంత్రి కేటీఆర్



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** భవన నిర్మాణ అనుమతుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం పారదర్శక విధానాలకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీర్ అన్నారు. భవన నిర్మాణ అనుమతుల్లో తెలంగాణ విధానం దేశంలోని అత్యుత్తమ విధానాల్లో ఒకటని ఆయన తెలిపారు. అనుమతుల విషయంలో ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టి మరింత పాదర్శకంగా ఉండే విధానాన్ని రూపకల్పన చేసినట్లు మంత్రి కేటీఆర్ వివరించారు. రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులు గురువారం మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియను ఈ సందర్భంగా మంత్రి వివరించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న స్పందనను బిల్డర్లు, రియల్ ఎస్టేట్ ప్రతినిధులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. భవన నిర్మాణల అనుమతుల విధానాన్ని మరింత సులభతరం చేసేందుకు మున్సిపల్ శాఖ అధికారుల బృందం మరింత అధ్యయనం చేస్తోందని వివరించారు. బిల్డర్ల సంఘాల నుంచి కూడా ఒకరిద్దరు ప్రతినిధులు అధికారులతో కలిసి చేయాలని మంత్రి కేటీఆర్ సూచించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో విధానాలను అధ్యయనం చేసి.. రాష్ట్రంలో అత్యుత్తమ విధానంగా మార్చేందుకు సూచనలు చేయాలన్నారు.

### మున్సిపాల్టీల్లో ఈ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్

ఈ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్ విధానాన్ని ఇప్పటికే అన్ని మున్సిపాల్టీల్లో ఉపయోగిస్తున్నామని, దీంతో ఫైళ్ల అనుమతులు ఏ దశలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలుస్తుందన్నారు. దీంతో అనుమతులు ఆలస్యమయ్యే అవకాశం లేదని మంత్రి వివరించారు. రియల్‌ఎస్టేట్ రంగంలో దేశంలోనే హైదరాబాద్ నగరం వృద్ధి దశలో కొనసాగుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం అనేక విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. వేలాది మందికి ఉపాధి కల్పించే భవన నిర్మాణానికి, రియల్ ఎస్టేట్ రంగానికి ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. అదేసమయంలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. నగరంలో ఇప్పటికే భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, నిర్మాణ వ్యర్థాలను చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో వేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. భవన నిర్మాణ నిబంధనలు పాటించేలా సంఘాల నేతలు చూడాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వ డ్రాఫ్ట్ టౌన్‌షిప్ పాలసీని బిల్డర్ల సంఘాలన్నింటికీ అందిస్తామని, సలహాలు,సూచనలుఇవ్వాలనిమంత్రి కోరారు.

నగర అభివృద్ధి నలుదిశలా విస్తరించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఇందు కోసం బిల్డర్లు కూడా మద్దతు ఇవ్వాలని సూచించారు. పశ్చిమ హైదరాబాద్ ఇప్పటికే కంపెనీలతో నిండిపోయిందని, జనసాంద్రత పెరిగిన నేపథ్యంతో ఇతర ప్రాంతాలకు కంపెనీలు వచ్చేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మంత్రి వివరించారు.

ఆయా ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. రియల్ ఎస్టేట్ సంఘాలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా జీహెచ్ఎంసీతో కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో క్రెడాయ్ తెలంగాణ, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అలాగైతే.. రాయితీలు రద్దు!

- 'బిల్ట్'ను కొత్త యాజమాన్యానికి అప్పగిస్తాం..
- గడువులోగా పనులు పూర్తి చేయాల్సిందే
- 'బిల్ట్' పునరుద్ధరణపై మంత్రి కేటీఆర్ సీరియస్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** వరంగల్ జిల్లా కమలాపూర్‌లోని బల్లార్ పూర్ ఇండస్ట్రీస్ (బిల్ట్) పునరుద్ధరణ అంశంపై పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ గురువారం సమీక్ష నిర్వహించారు. కంపెనీ పునరుద్ధరణ కోసం చేపట్టిన పనులను మంత్రి కేటీఆర్‌కు చీఫ్ ఆపరేటింగ్ అధికారి నేహార్ అగర్వాల్, సీజీఎం హరిహరణ్ వివరించారు. బిల్ట్ పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి, కావాల్సిన ప్రోత్సాహకాలను కల్పించినా యాజమాన్యం చేపట్టిన పనుల్లో మందగమనంపై మంత్రి కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీ పునరుద్ధరణకు గతంలో ఇచ్చిన గడువు ఇప్పటికే ముగిసిందని, కార్మికుల ప్రయోజనాలు, ఉపాధి విషయంలో ప్రభుత్వం పట్టుదలతో ఉందని



మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా వివరించారు.

### దీపావళి వరకు రూ. 10వేలు అడ్వాన్స్

వేతన బకాయిల చెల్లింపుల కోసం కంపెనీ యాజమాన్యం చేసుకున్న ఒప్పందంపై కూడా మంత్రి సమీక్షించారు. కార్మికుల బకాయిల కోసం ఇప్పటికే ఒప్పందం పూర్తయిందని, దీపావళి వరకు రూ.10వేలు అడ్వాన్స్ ఇచ్చేందుకు ఒప్పుకున్నట్టు మంత్రికి అధికారులు వివరించారు. కంపెనీ తరపున ఏర్పాటు చేసుకున్న కన్సల్టెంట్లు ఒక నివేదికను సిద్ధం చేశారని, మరిన్ని పెట్టుబడుల కోసం బ్యాంకులకు సమర్పించామని అధికారులు వివరించారు. కంపెనీ పునరుద్ధరణలో భాగంగా ఐటీ నెట్ వర్కింగ్ పనులు ప్రారంభమయ్యాయని, ఆగస్టు నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తామని మంత్రికి తెలిపారు. అధికారులు ఇచ్చిన వివరణపై మంత్రి కేటీఆర్ స్పందిస్తూ... ఇప్పటికే గతంలో ఇచ్చిన డెడ్‌లైన్ కంపెనీ మిస్సయిందని, ఇప్పుడు చెబుతున్న గడువులోగా పునరుద్ధరణ చేయకుంటే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు రద్దు చేసి బిల్ట్ యూనిట్‌ను కొత్త యాజమాన్యానికి అప్పగించాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

వెంటనే మిషనరీ పునరుద్ధరణ పనులును ప్రారంభించి కార్మికులను భాగస్వాములను చేయాలన్నారు. ప్రస్తుతం ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి చేస్తామన్న హామీ పత్రాన్ని కంపెనీ నుంచి తీసుకోవాలని, కంపెనీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్‌కు కేటీఆర్ సూచించారు. గతంలో కొన్ని అనివార్య కారణాలతో పనులు కొంత ఆలస్యంగా ప్రారంభం అయ్యాయని, ఇప్పుడలా జరగకుండా గడువులోగా కంపెనీ పునరుద్ధరణ చేస్తామని కంపెనీ సీవోవో నేహార్ అగర్వాల్ మంత్రి కేటీఆర్‌కు హామీ ఇచ్చారు.




## పందులకు పరుగుపందెం

జంతువులకు పరుగు పందాలు నిర్వహించడంలో కొత్త దనం ఏమీ లేదు. ఈ మధ్య తాబేళ్లు వంటి ఉభయ చరాలకూ ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇక శునకాలు, మార్జాలాలకు ఈ పోటీలు కొత్తేమీ కాదు. కానీ పందులకూ ఈ రేస్‌లు నిర్వహించడం, కేవలం పరుగు పందెంతో సరిపెట్టకుండా హర్డిల్స్ పోటీలు పెట్టడం అమెరికాలో కొన్నేళ్లుగా అలవాటే. ప్రస్తుతం లాస్‌ఏంజిల్స్‌లో అలస్కా పిగ్ రేస్ పేరిట ఈ పోటీలు నిర్వహించారు. పందుల పెంపకందార్ల శిక్షణ ఇచ్చిన పందులనే ఈ పోటీలకు అనుమతి ఇవ్వడం పరిపాటి. ఇక ప్రైజులూ, బహుమతులూ మామూలే. ఈ పోటీలో పాల్గొనే పందులు, ఎంచక్కా గుర్రాల్లా కేజ్‌లలోంచి దూసుకొచ్చి, తమకు కేటాయించిన లైన్లలో పరిగెడుతూ హర్డిల్స్ వచ్చినపుడు వాటికి కాళ్లు తగలకుండా గెంతుకుంటూ వెళ్లడం చూస్తే వాటి సమయస్ఫూర్తికి మెచ్చుకోకుండా ఉండలేం.



## చిత్రం... విచిత్రం..!

ఇక్కడ కనిపిస్తున్న రెండు చిత్రాలను చూస్తే కొంత సంశయం... మరికొంత ఆసక్తి కలగడం ఖాయం. గుర్రం తలతో ఉన్న మనిషి, ఓ భారీ మత్స్య పురుషుడిలా కనిపిస్తున్న ఓ స్క్యూబా డైవర్ చిత్రాలు ఇవి. ఫోటోలు తీస్తున్నప్పుడు ఆఖరి క్షణంలో ఈ అతిథుల ముఖారవిందాలు... అసలు వ్యక్తులకు అడ్డంగా రావడంతో ఈ చిత్ర... విచిత్రాలు సాక్షాత్కరించాయి. బ్రిటన్‌లోతను పెంచుతున్న ఓ గుర్రం ముందు నిలుచున్న ఓ యజమాని, దానితో కలసి సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో ఉండగా క్లిక్‌మనిపించే క్షణంలో ఆ గుర్రం తల బయటకు పెట్టడంతో ఈ దృశ్యం ఆవిష్కారమైంది. ఇక ఓ స్క్యూబా డైవర్, ఓ భారీ చేపను అనుసరిస్తూ ఓ సహచర మెరైన్ ఫొటోగ్రాఫర్ సహాయంతో ఫోటో తీయించుకుంటూండగా, ఆ భారీ చేప కెమెరావైపు చటుక్కున తిరగడంతో డైవర్ వెనుక ఉండిపోవడం, చేప మోము ఫొటోలో చిక్కడంతో మత్స్య పురుషుడు అవతరించినట్టయింది. ఫొటోగ్రఫీలో ఇలాంటి చమక్కులు తక్కువేం కాదు.

# 'ఆర్టీసీ'తో అల్లుకుపోదాం

- సమ్మె నేపథ్యంలో కమలం స్కెచ్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** తెలంగాణలో పార్టీని విస్తరించేందుకు బీజేపీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇప్పటికే ఆపరేషన్ ఆకర్ష్‌తో పలు పార్టీల నేతలను చేర్చుకుంది. త్వరలోనే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కొంతమంది బలమైన నేతలకు గాలం వేయాలని జాబితాను సిద్ధం చేసింది. ఇదంతా ఒక ఎత్తయితే, ఇప్పుడు కొన్ని చోట్ల సరికొత్త ప్లాన్‌లను ఆ పార్టీ నేతలు వేస్తున్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయాలన్న సంకల్పంతో ఉన్న బీజేపీ నాయకత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలన్నింటిపై పోరాటం చేస్తోంది. తాజాగా ఆర్టీసీ సమ్మెను కూడా పార్టీ బలోపేతానికి ఉపయోగపడేలా ప్రయత్నం చేస్తోంది. ఆర్టీసీ కార్మిక సంఘాల్లో పట్టుకోసం స్పష్టమవుతోంది. సమ్మె ప్రారంభమైనప్పటి నుంచి బీజేపీ నేతలు కదులుతున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌తో పాటు ఇతర నేతలు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ర్యాలీలు, నిరసన ప్రదర్శనలలో పాల్గొంటున్నారు. తెలంగాణలోని కార్మిక సంఘాల్లో ఇప్పటి వరకు వామపక్షాలు లేదా టీఆర్ఎస్‌కు మాత్రమే పట్టున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వామపక్షాలకు కార్మిక సంఘాల్లో చెక్ పెట్టాలన్నది బీజేపీ ఎత్తుగడగా కనిపిస్తోంది. ఇప్పటికే సింగరేణి కార్మిక సంఘాల్లో కీలక నేత మల్లయ్యను బీజేపీ



చేర్చుకుంది. అక్కడ పార్టీ కార్మిక సంఘాన్ని విస్తరించేందుకు బీజేపీ ముమ్మర ప్రయత్నాలనే చేస్తోంది. ఇటు ఆర్టీసీ కార్మిక సంఘాల్లో సమ్మెను అదునుగా చేసుకుని తమ కార్మిక సంఘాన్ని విస్తరించేందుకు బీజేపీ చర్యలు చేపడుతున్నట్లు సమాచారం. అందులో భాగంగా సమ్మెను ఒక ఆయుధంగా బీజేపీ నేతలు వాడుకుంటున్నారని ఇతర పార్టీల నేతలు అనుమానిస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న ఆందోళనలలో ఎక్కువ వట్టుకు బీజేపీ ఒంటరిగానే పాల్గొంటుంది. అయితే అవన్నీ ఫలిస్తాయా లేదా అన్నది ఎన్నికలు వస్తేగానీ తెలియదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఆ ఎన్నికలు వచ్చేందుకు ఇంకా ఐదేళ్ళ గడువు ఉంది. దీంతో మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ చూపించే ప్రభావాన్ని బట్టి ఆ పార్టీ ఎదుగుదల ఉంటుందని విశ్లేషకుల అంచనాగా ఉన్నట్టు తెలుస్తోంది.

## శతాబ్ది ఉత్సవానికి సిద్ధమైన
# ఐసీఎంఆర్-ఎన్ఐఎన్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార పరిశోధనా సంస్థ(ఎన్ఐఎన్) నూరవ వసంతోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం పోస్టల్ స్టాంప్ ను విడుదల చేసింది. డిల్లీ ఐసిఎంఆర్ లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర వైద్య, శాస్త్ర,సాంకేతిక శాఖ మంత్రి హర్షవర్ధన్ ఈ ప్రత్యేక తపాళా బిళ్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి ప్రొ: బలరామ్ భార్గవ, ఎన్ఐఎన్ డైరెక్టర్ డా: హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా



రూపొందించిన శతాబ్ది ఉత్సవాల లోగోను ఆవిష్కరించారు. ఐసిఎంఆర్- ఎన్ఐఎన్ శతాబ్ది అవార్డును ఇటీవల 101 ఏట మృతి చెందిన ప్రముఖ శాస్త్రవేత్త పద్మభూషణ్ డా:సి,గోపాలన్ కు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆయన మనవడు డా:శరత్ గోపాలన్ ఈ అవార్డును అందుకున్నారు.




# రాయితీలిచ్చి ఏం లాభం?



(మొదటిపేజీ తరువాయి)

తేల్చిచెబుతున్నాయి. తాము ఆర్థిక శాఖ క్రింద పని చేయడంలేదు. రిజర్వ్ బ్యాంక్ అధీనంలోనే విధులు నిర్వహిస్తున్నామంటూ బ్యాంక్ ఉద్యో గులు స్పష్టం చేస్తున్నారు. ఏ ఆదేశాలైనా రిజర్వ్‌బ్యాంక్ నుంచి జారీకావాలని పేర్కొంటున్నారు. దీంతో ఆదేశాల జారీకి ముందు సంబంధిత అధికారులను మంత్రి సంప్రదించలేదన్న సంగతి స్పష్టమవుతోంది. అలాగే సర్వీస్ టాక్స్ బకాయిల చెల్లింపులకు కూడా సీతారామన్ కొన్ని రాయితీలు ప్రకటించారు. దీంతో పలువురు బకాయిల చెల్లింపునకు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. కానీ వారికి అధికారులు ప్రోత్సహించడం లేదు. దీనికూడా వారు పై సమాధానమే చెబుతున్నారు. సంబంధిత అధికారుల నుంచి ఆదేశాలందలేదని పేర్కొంటున్నారు.

ఇలా ప్రభుత్వ శాఖలే కాదు.. ఆఖరకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ఆదేశాల్ని బేఖాతరు చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పుడు సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం పెంపులో భాగంగా ఏర్పాటు చేసిన సౌర, వాయు విద్యుత్ ఉత్పాధక సంస్థల్తో గత ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాల పునఃసమీక్షలు జరుగుతున్నాయి. ఈ ఒప్పందం మేరకు నిర్ణయించిన ధరల్ని తాము చెల్లించేది లేదంటూ పలు రాష్ట్రాలు చేతులెత్తేశాయి. తగ్గించాల్సిందే నని పట్టుబడుతున్నాయి. లేనిపక్షంలో వార్నుంచి కొనుగోలు కూడా నిలిపేశాయి. దీంతో ఆయా ఉత్పాదక సంస్థలు బ్యాంకులు, ఇతర ఆర్థిక వ్యవస్థల్నుంచి తెచ్చిన రుణాల్ని తిరిగి చెల్లించలేక పోతున్నాయి. ఇది తిరిగి బ్యాంకుల ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు ఒప్పందాల పునఃసమీక్షను నిలిపేయాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. యదావిధిగా పాత ధరలకే కొనుగోలు చేయాలని సూచించింది. తద్వారా ఆయా సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకుని బ్యాంకులకు బకాయిల వాయిదాల్ని చెల్లిస్తాయని పేర్కొంది. అయితే ఈ ఆదేశాల్ని రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలైతే కోర్టుకెక్కి స్టేలు కూడా తెచ్చుకున్నాయి. ఆఖరకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ కేంద్ర ఆదేశాలు అమలుకావడంలేదు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కూడా పునఃసమీక్షకే కట్టుబడింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ శాఖలు విధాన నిర్ణయాల ప్రకటనకు ముందే వాటిని అమలు చేసే అధికార యంత్రాంగంతో చర్చలు జరిపి స్పష్టమైన ఆదేశాలివ్వాల్సిన అవసరాన్ని పరిశీలకులు నొక్కి చెబుతున్నారు.

## రూసా నిధులు ఉపయోగించుకోండి

- వర్శిటీ వీసీలకు గవర్నర్ తమిళిసై ఆదేశం

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రీయ ఉత్సతార్ శిక్షా అభియాన్(రూసా) ద్వారా విశ్వవిద్యాలయాలకు వచ్చే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వర్సిటీల వీసీలను ఆదేశించారు. రూసా అధికారులతో గవర్నర్ గురువారం సమావేశం నిర్వహించారు. మార్చి 2020 నాటికి రూసా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వీసీలను ఆదేశించారు. రాష్ట్రంలోని 7 వర్సిటీలు రూసా నిధులకు ఎంపికయ్యాయని వాటిని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూసా నిధుల వినియోగం కోసం ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రం ఇచ్చే రూసా నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ నిధుల విడుదల చేయక పోవడంతో ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, తెలంగాణ, మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యా లయంతోపాటు జేఎన్‌టీయూలకు రూసా నిధులు మంజూరు అయినట్టు తెలిపారు.



# రామజన్మభూమి ఆస్తి కాదు విశ్వాసం

(మొదటిపేజీ తరువాయి)

ఆధారాల్తో కూడిన వాస్తవం. ముస్లింలు మక్కా నగరాన్ని అతిపవిత్రంగా పరిగణిస్తారు. మహ్మద్ ప్రవక్త దైవిక ఉనికితో ఈ నగరం ఆశీర్వదిం చబడి నట్లుగా భావిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లిం లు జీవితంలో ఒక్కసారైనా ఈ నగరాన్ని సందర్శించాలని, అక్కడున్న పవిత్ర మసీదులో ప్రార్థన చేయా లని ఆశిస్తారు. మక్కాలోని కబా మందిరం ముస్లిం హిబ్లాగా పరిగణిస్తారు. దీన్ని ప్రార్థనకు కేంద్రంగా గుర్తిస్తారు. మక్కా నగరం సౌదీ అరేబియాలో ఉంది. ఈ నగరంలో అతి ప్రాచీనమైన మసీదులున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ముస్లింలు హజ్ యాత్రను గొప్ప తీర్ధయాత్రగా భావిస్తారు. మక్కా నుంచి మూ డు కిలోమీటర్ల దూరంలో గల ఒక గుహను ఖురాన్ మొక్క మొట్టమొదటి ద్యోతకం జరిగిన ప్రదేశంగా చూస్తారు. ఈ యాత్రను పూర్తి చేసిన ముస్లీంలను హాజీలుగా, అత్యంత గౌరవ ప్రపత్తుల్తో పిలుస్తారు.

అలాగే మెస్సయ్య (యేసు) జన్మించిన బెత్లహామ్ క్రీస్టియన్లకు పవిత్ర నగరం. జెరూసలేంకు దక్షిణాన ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఈ ప్రదేశముంది. దైవదూత యేసుక్రీస్తుకు ఇక్కడికొచ్చి నివాళులర్పిం చాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రైస్తవులు ఆరాటపడతారు. యేసు జన్మించిన గుహకు నాలుగో శతాబ్ధంలో పైకప్పు నిర్మించారు. ఈ గుహ సందర్శనకు ఏటా కొన్ని మిలియన్ల మంది వస్తారు.

గ్రీకులు కొలిచే దేవుడు జ్యూస్ క్రెటెన్ పర్వతా ల్లోని దక్షిణ మధ్య క్రీక్‌లోగల డిక్టియాన్ కేవ్, ఐడి యా న్ కేవ్ పర్వతాలపై గల ఎత్తయిన ప్రాంతం ఆయన జన్మస్థలంగా పరిగణిస్తారు. ఇది మతప రమైన ప్రత్యేక గుర్తింపు కలిగుంది. అంతేకాక గ్రీకు నాగరిక తలోనూ ఇది కీలకపాత్ర పోషించింది. గ్రీకురాజైన క్రోనస్, రాణి రియాల కుమారుడైన జ్యూస్‌ను గ్రీకు లిప్పటికీ ఆకాశం, ఉరుము, మెరుపు, చట్టం, న్యాయా లకు అధినేతగా ఆరాధిస్తారు. ఆయన జన్మించిన స్థలాన్ని ఏటా మిలియన్ల మంది గ్రీకులు సందర్శిస్తు న్నారు. ఈ ఎత్తయిన ప్రాంతాలకు అత్యాధునిక రవాణా సదుపాయాల్ని కల్పించారు. ఇక్కడ ప్రణాళి కాబద్ధమైన నిర్మాణాలు చేశారు.

విష్ణుడు తొమ్మిదవ అవతారంగా పరిగణించే కృష్ణుడి జన్మ స్థలమైన పురాతన నగరం మధురను కూడా హిందువులు పవిత్రంగా భావిస్తారు. ఈ నగ రంలో కృష్ణుడు జన్మించిన భూగర్భంలోని జైలు, దానికనుసంధానంగా నిర్మించిన దేవాలయాలను ఇప్పటికీ లక్షలాది మంది సందర్శిస్తున్నారు. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్ధంలోనే శూరసేన రాజు పాలన లో కృష్ణుడి జన్మస్థల ప్రతీకల్ని ప్రత్యేకంగా అభివృద్ది పర్చారు.

బౌద్ధమత స్థాపకులు బుద్ధుడు జన్మించిన లుంభిని వనాన్ని బౌద్ధులు పవిత్రంగా ఆరాదిస్తారు. సుందర హిమాలయ పర్వత సానువుల్లోని ఈ వనం మీదుగా బుద్ధుని తల్లి మాయాదేవిని పుట్టింటికి తరలిస్తుండగా ఈ ప్రసవం జరిగింది. ఒకప్పుడు ఈ ప్రాంతం షాఖ్య రాజవంశీకుల రాజధానిగా ఉండేది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధులు లుంభినీ కొస్తున్నారు. ఇక్కడ బౌద్ధ మత చిహ్నాలు, మఠాలు, బౌద్ధవారసత్వ కట్టడాలు అనేకమున్నాయి. ప్రపంచ వారసత్వ ప్రదేశంగా దీన్ని యునెస్కో గుర్తించింది.

సిక్కు మత వ్యవస్థాపకులు గురునానక్ చివరి దశలో దీర్ఘకాలం సేదదీరిన కర్తార్‌పూర్ సందర్శనకు సిక్కులంతా ఆసక్తి ప్రదర్శిస్తారు. దేశ విభజ నానంతరం ఈ ప్రాంతం పాకిస్థాన్‌కు దఖలైంది. దీంతో భారత్‌లోని సిక్కులు కర్తార్‌పూర్ సందర్శన కోసం పలు ఇబ్బందులు పడాల్సొచ్చేది. పాక్ నుంచి వీసాలొచ్చేవికాదు. దీర్ఘకాల చర్చల అనంతరం కర్తార్‌పూర్ కారిడార్ తెరిచేందుకు పాక్ ప్రభుత్వం అంగీకరించింది. అమృత్‌సర్ నుంచి కర్తార్‌పూర్ సందర్శనకు భారతీయులకు ట్రావెల్ వీసాల జారీ ప్రారంభించింది. ఇది ఇరుదేశాల్లోని కోట్లాదిమంది సిక్కులకు అత్యంత సంతోషాన్నిచ్చింది.

రామజన్మభూమి ప్రాంతాన్ని ఒక ఆస్తిగానో లేక సంపదగానో పరిగణించకూడదు. ఇది హిందువుల మత విశ్వాసాలకు సంబంధించినది. ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్యనీయుడైన రాముడు పుట్టిన ప్రాంతంగా పరిగణించబడుతున్నది. ఈ సెంటి మెంట్‌కు విలువకట్టలేం. అలాగే హిందువుల్నుంచి ఈ సెంటిమెంట్‌ను ఎవరూ దూరం చేయలేరు. రామజన్మభూమిలో మందిర నిర్మాణం ఏ ఒక్క రాజకీయ పార్టీకో దఖలైన హక్కుకాదు.

దత్తాత్రేయుడి అవతారంగా భావించే శ్రీపాద శ్రీ వల్లభుడ్ని మరాఠీయులు విశేషంగా ఆరాదిస్తారు. మహరాష్ట్రలో శ్రీవల్లభుడికి గ్రామగ్రామాన ఆలయా లున్నాయి. కొన్నేళ్ళ క్రితం అసలు ఆయన ఎక్కడి వారన్న ఆలోచన కలిగింది.

చారిత్ర క ఆధారాల మేరకు పరిశోధనలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం పట్టణంలో శ్రీపాద శ్రీ వల్లభుడు జన్మించిన్నట్లు గుర్తించారు. ఆయన పుట్టిన ప్రాంతంలోని ఇల్లు చేతులు మారింది. అక్కడ భారీ భవనాలు నిర్మించారు. మహరాష్ట్రకు చెందిన ఆయన భక్తులు పిఠాపురం పట్టణానికొచ్చి ఆయన జన్మించిన స్థలాన్ని నివాసితుల్నుంచి కొనుగోలు చేశారు. అక్కడ పవిత్ర మందిరాన్ని నిర్మించారు. అప్పట్నుంచి ఆయన జన్మభూమి విశేషంగా ప్రాచుర్యం పొందింది. రోజూ మహరాష్ట్ర నుంచి వందల సంఖ్యలో భక్తులు ఇక్కడికొస్తారు. ఆ రాష్ట్రం వెంబడి వేలాది ఆలయాలున్నప్పటికీ అనేక వ్యయప్రయాశలకోర్చి అతి చిన్న పట్టణం పిఠాపురం చేరుకుని తమ ఆరాధ్యనీయుడు పుట్టిన ప్రాంతాన్ని ఎంతో అపురూపంగా సందర్శించుకునెళ్తున్నారు. ఇది తాము భగవంతుడిగా పరిగణించే వారి పట్ల భక్తుల్లో ఉండే విశ్వాసానికి ప్రతీక. ఇలాంటి అంశాల్ని కూడా కోర్టు తీర్పులో పరిగణనలోకి తీసుకోవాలని సామాజిక నిపుణులు కోరుతున్నారు.



హుజూర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, హస్తకళల సంస్థ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, పోలీస్‌హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, అమరవాది లక్ష్మీనారాయణ, టీటీడీ మెంబర్ కొమిరెడ్డి రాములు తదితరులు

# తెరాస వెంటే ఆర్యవైశ్యులు

- సైదిరెడ్డి గెలుపు ఖాయం
- సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష
- హుజూర్‌నగర్ ఉప ఎన్నికల ప్రచారంలో బిగాల గణేష్‌గుప్త, బొల్లం సంపత్‌కుమార్, కోలేటి దామోదర్

**హుజూర్‌నగర్, ప్రభన్యూస్:** తెలంగాణ రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న హుజూ ర్‌నగర్ ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయాన్ని కాంక్షింస్తూ టీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ బొల్లం సంపత్ కుమార్ గురువారం నియోజకవర్గంలో గడప గడపకు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే శానంపూడి సైదిరెడ్డి గెలుపునకు శ్రీరామరక్ష అన్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంగా వ్యాప్తంగా ఆర్యవైశ్యుల నుంచి వస్తున్న స్పందన చూస్తే ఎంతో ఆనందంగా ఉందన్నారు. హుజూర్ నగర్ మరింత అభివృద్ధి చెందాలంటే సైదిరెడ్డికే తమ మద్దతని ఓటర్లు ముందుకు వస్తున్నారన్నారు. టీఆర్‌ఎస్ పార్టీ తరపున ఏ కార్యక్రమాలు చేపట్టినా నియోజకవర్గంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రైతులకు నేను ఉన్నానంటూ కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, ఇన్సూరెన్సు పథకం ఎంతో అద్భుతమైందన్నారు. విద్యావంతుడు, సౌమ్యుడు, స్థానికుడైన శానంపుడి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఓటరు మహాశయులు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి తనను ఆశీర్వదించాలని అభ్యర్థి సైదిరెడ్డి కోరారు. అధికారం లేని పార్టీలకు ఓటు వేసి వృధా చేయవద్దని, హుజూర్‌నగర్ ప్రజలు ఆలోచించి హుజూర్‌నగర్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోలేటి దామోదర్‌గుప్త, అమరవాది లక్ష్మీ నారాయణ, కొమిరెడ్డి రాములు, దిలి రవి, జూలకంటి వాణి తదితరులు పాల్గొన్నారు.



## బస్సులు పెరుగుతున్నాయ్

(మొదటిపేజీ తరువాయి)

అదికార యంత్రాంగం తమ వంతు ప్రయత్నం చేస్తోంది. గడచిన రెండు రోజులుగా బస్సుల శాతాన్ని పరిశీలించే క్రమక్రమంగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. గురువారం74.56 శాతం బస్సులు అంటే 6672 నడిచాయి. ఇందులో ఆర్టీసీ బస్సులు 4705 కాగా, ఆర్టీసీ అద్దె బస్సులు 1967 ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రైవేట్ డ్రైవర్స్ 4705 మంది, ప్రైవేట్ కండక్టర్లు 6672 మంది రోజు వారి విధులను నిర్వహించారు. బస్సుల సంఖ్యతో పాటు టికెట్‌ల జారీ ప్రక్రియను కూడా పెంచారు. 1024 టిమ్స్ మిషన్ల ద్వారా టికెట్లను జారీ చేయగా, 1941 బస్సులను ప్రింటింగ్ టికెట్లను ఇచ్చారు.



## నోబెల్ విజేత అభిజిత్ ఔదార్యం

- ఇద్దరు విద్యార్థులకు చేయూత

**డెహ్రాడూన్:** భారతీయ సంతతికి చెందిన అమెరికా ఆర్థిక వేత్త, నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ తన ఉదాత్తతను చాటుకున్నారు. కబీర్ మెమోరియల్ స్కాలర్‌షిప్‌లో భాగంగా డెహ్రా డూన్‌లోని జోగివాలాకు చెందిన ఇద్దరు విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. వారం క్రితం అభిజిత్ బెనర్జీకి ఎకానామిక్ సైన్స్ విభాగంలో అత్యుత్తమ సేవలు అందించినందుకు నోబెల్ బహుమతికి ఎంపికైన సంగతి తెలిసిందే. ఆర్యన్ థాపా, అమన్ దోబ్రియాల్‌లు డెహ్రాడూన్‌లోని వివేకానంద పాఠశాలలో చదువుకుంటున్నారు. మూడేళ్ల క్రితం బెనర్జీ కుమారుడు చనిపోయాడు. అతని జ్ఞాపకార్థం కబీర్ మెమోరియల్ స్కాలర్‌షిప్‌ను ప్రవేశపెట్టారు. తమ విద్యను నిరాంటకంగా ముందుకు సాగించేందుకు సాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందని, ఇందు కోసం బెనర్జీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని ఆర్యన్ థాపా వివరించారు. అభిజిత్ బెనర్జీని తాను 2015లో కలుసుకోవడం జరిగిందని, నోబెల్ గ్రహీత తనకు సాయం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నా అని అమన్ చెప్పు కొచ్చాడు. నోబెల్ గ్రహీత బెనర్జీ చాలా ఏళ్ల నుంచి వివేకానంద పాఠశాలతో మంచి సంబంధాలు ఉన్నాయి. పాఠశాల వ్యవస్థాపకుల్లో ఒకరైన గౌరీ మజుందార్ కోల్‌కతాలో బెనర్జీకి పాఠాలు బోధించారు. అదేవిధంగా గౌరీ మజుందార్ ఉపాధ్యాయు రాలు, అభిజిత్ తల్లి సహ విద్యార్థిని కావడం గమనార్హం.

# తప్పంతా వారిదే

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే పీకలలోతు నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కార్మిక సంఘాలు అవేవీ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

### కార్మికులకు అండగా ఉన్నా సమ్మె

ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు ఆర్టీసీ బలోపేతానికి తీసుకున్న చర్యలు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఏటా ఆర్టీసీకి కేటాయిస్తున్న నిధులు తదితర అంశాలపై ధర్మాసనానికి నివేదించాలని కేసీఆర్ కోరినట్టు తెలుస్తోంది. దీంతోపాటు గత ఐదేళ్ళుగా ఆర్టీసీకి వస్తున్న నష్టాలను, కొత్త బస్సుల కొనుగోళ్ళకు పెట్టిన ఖర్చు, నియామకాల అంశాలను హైకోర్టుకు సమర్పించాలని ఆయన అడ్వకేట్ జనరల్‌ను కోరినట్టు తెలుస్తోంది. ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులకు 44 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదని ఆర్టీసీ కార్మిక సంఘాలు కోరిన దానికన్నా ఎక్కువగా ఫిట్‌మెంట్‌ను ఇవ్వడంతో పాటు వారి కోరికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం తీరుస్తూ వచ్చిందని అయినా వారు సమ్మెకు దిగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారనే విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్ళాలని ఆయన చెప్పినట్టు సమాచారం.

### ప్రత్యామ్నాయం ఏం చేశామో చెప్పండి

నాలుగు గంటలపాటు సాగిన సమీక్షా సమావేశంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రవాణా, ఆర్టీసీ అధికారులు సీఎంకు వివరించారు. రోజురోజుకు బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు తాత్కాలిక ప్రాతిపదికన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించి దూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి సైతం ఇబ్బంది కలగకుండా చూస్తున్నామని అధికారులు సీఎంకు వివరించినట్టు సమాచారం. ఆర్టీసీకి రెండు రోజుల్లో ఎండీని నియమించాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించిన నేపథ్యంలో ఈ ఎంపికను త్వరితగతిన పూర్తిచేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టామని ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ కోర్టు దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఎండీ నియామకానికి సంబంధించి ప్రభుత్వం నలుగురి పేర్లను పరిశీలించిందన్న విషయాన్ని కూడా ధర్మాసనానికి తెలియజేయాలని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం.

### ఆ డిమాండ్లు అహేతుకం

కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్లు సహేతుకంగా లేవని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న వారి షరతును అంగీకరించలేమని ప్రభుత్వం కోర్టుకు స్పష్టం చేయనుంది. ఆర్టీసీని ప్రైవేట్‌కు అప్పగించాలన్న ఉద్దేశం కూడా ప్రభుత్వానికి లేదని ఆ దిశగా ఎటువంటి ప్రణాళికలు చేపట్టలేదని కోర్టుకు నివేదించాలని ఈ సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలోని కుగ్రామాలకు సైతం ఆర్టీసీ బస్సులను నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తోందని రహదారులు అంతంత మాత్రంగానే ఉన్న లంబాడీ తండాలు, గిరిజనుల గూడెంలకు కూడా బస్సులు నడుపతూ ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని ప్రభుత్వం కోర్టుకు తెలపనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్



జంట నగరాలతో పాటు మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తిరుగుతున్న సిటీ బస్సుల నిర్వహణ బాధ్యతలను జీహెచ్‌ఎంసీకి అప్పగించామని సిటీ బస్సులకు పెడుతున్న ఖర్చును జీహెచ్‌ఎంసీ ద్వారానే ఆర్టీసీకి ఇస్తున్నామని చెప్పనున్నట్టు తెలుస్తోంది.

### నష్టాలు.. ఆస్తులు, లీజులపై స్పష్టత ఇవ్వండి

ఆర్టీసీ నిర్వహణ మోయలేని భారంగా పరిణమించిందని పొరుగు రాష్ట్రాలకన్నా తెలంగాణ రాష్ట్రంలో అత్యంత అధునాతనమైన, అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన బస్సులను కొనుగోలుచేసి నడుపుతున్నామని గుర్తు చేయనున్నట్టు తెలుస్తోంది. ఆర్టీసీ ఆస్తులకు సంబంధించి విపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఎక్కడెక్కడ ఆర్టీసీకి ఆస్తులున్నాయి, మార్కెట్ ధర ప్రకారం వాటి విలువ ఎంత, ఆర్టీసీ స్థలాలను ఎవరెవరికీ ఎంతకాలం లీజులకు ఇచ్చింది ఆ వివరాలతో కూడిన నివేదికను ఆర్టీసీ సంస్థ హైకోర్టు ధర్మాసనానికి అందజేయాలని కేసీఆర్ ఆదేశించినట్టు తెలుస్తోంది. నష్టాల నివేదికతో పాటు ఈ నివేదికను సమగ్రంగా సిద్ధంచేసి గణాంకాలతో అందజేయాలని కేసీఆర్ కోరారు. గత 13 రోజులుగా కార్మికులు సమ్మెకు దిగడంతో ప్రయాణీకులు పడిన ఇబ్బందులను కూడా కోర్టుకు నివేదించనున్నట్టు తెలుస్తోంది. దసరా, బతుకమ్మ పండుగల వేళ సమ్మెకు దిగవద్దని ఎంతగా అభ్యర్థించినా కార్మిక సంఘాలు ప్రభుత్వ విజ్ఞప్తిని బేఖాతరు చేశాయని అయినా ప్రభుత్వం పండుగల సందర్భంగా గ్రామాలకు వెళ్ళే వారికి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని కోర్టుకు చెప్పనున్నట్టు తెలుస్తోంది. డిపోలు, డివిజన్లు, రీజియన్లవారీగా గత 13 రోజులుగా తిప్పుతున్న బస్సుల వివరాలను, తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బందికి సంబంధించిన సమాచారాన్ని కోర్టుకు సమర్పించాలని నిర్ణయించింది. పొడిగించిన దసరా సెలవులు ఈ ఆదివారంతో ముగిసి సోమవారం నుంచి విద్యాసంస్థలు పునః ప్రారంభమవుతున్నందున విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు.

### అద్దెబస్సులు పెంచండి

ప్రస్తుతం నడుస్తున్న అద్దె బస్సులకు తోడు వీలైనన్ని ఎక్కువ బస్సులను తెప్పించి ప్రయాణీకులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని చెప్పారు. రవాణా శాఖ అధికారులు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించి అద్దె బస్సులను తెప్పించే పనిలో నిమగ్నం కావాలని సీఎం కోరినట్టు సమాచారం. ఆర్టీసీ జారీచేసిన బస్‌పాస్‌లను ఆమోదించేలా కండక్టర్లకు ఆదేశాలు ఇవ్వాలని డిపో మేనేజర్లు ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరినట్టు తెలుస్తోంది. పెంచే అద్దె బస్సులకు డ్రైవర్లు, కండక్టర్లను నియమించాలని సూచించారు. ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరపాలని సమ్మె విరమింపజేయాలని హైకోర్టు ధర్మాసనం సూచించిన అంశంపై కూడా ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం.

### గొంతెమ్మ కోర్కెలు తీర్చలేం

గొంతెమ్మ కోర్కెలు కోరుతూ కార్మికసంఘాల నేతలతో చర్చలు ఎలా జరపగలమని, వారు కోరుతున్న విలీనం అంశం సాధ్యంకాదని గతంలోనే స్పష్టంచేసిన విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్ళాలని కేసీఆర్ కోరారు. ఎన్నికల సమయంలోగానీ, మరెప్పుడైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఇవ్వలేదని ఈ విషయాన్ని కార్మిక సంఘాలు పదేపదే చెబుతూ ప్రజలను, రాజకీయ నేతలను తప్పుదారి పట్టిస్తున్నాయన్న విషయాన్ని కోర్టుకు తెలియజేయాలని నిర్ణయించారు. జిల్లాల్లో 90 శాతానికిపైగా బస్సులు నడుపుతున్నామని హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో 40 శాతం బస్సులను అందుబాటులోకి తెచ్చిన విషయాన్ని రవాణా మంత్రి పువ్వాడ అజయ్ సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. హైదరాబాద్‌లోనూ అన్ని బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కేసీఆర్ ఆదేశించారు. అనుభవజ్ఞులైన డ్రైవర్లను నియమించుకుని వారితో బస్సులు నడపాలని ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రమాదాలు జరగడానికి వీల్లేదని ఇలా జరిగితే ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం. ఈ ఏడాది జూన్ వరకు ఆర్టీసీకి రూ.2,445 కోట్లు అప్పులు ఉన్నాయని ఇందులో రూ.1, 595 కోట్లు బ్యాంకుల నుంచి నేరుగా తీసుకున్నవని ఆర్టీసీ అధికారులు సీఎం దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రభుత్వ పూచీకత్తుతో మరో రూ.850 కోట్ల రుణం ఆర్టీసీ తీసుకుందని చెప్పారు. ఇవి కాకుండా కార్మికుల పీఎఫ్, సహకార పరపత్తి సంఘానికి చెల్లించాల్సిన బకాయిలు రూ.1400 కోట్ల వరకు ఉన్నాయని చెప్పారు. ఏదేమైనా ఆర్టీసీ కార్మికుల సమ్మె పూర్తి అప్రజాస్వామికమని ప్రభుత్వాన్ని ఇబ్బందులపాలు చేసేందుకే కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసును ఇచ్చి పండుగల వేళ ఆందోళనకు సిద్ధమయ్యారని ప్రభుత్వం సైతం సమ్మె నివారణకు చివరిదాకా ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయిందన్న విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళాలని బలంగా వాదనలు వినిపించి పైచేయి సాధించాలని కేసీఆర్ ఆదేశించినట్టు తెలుస్తోంది. అవసరమైతే ఢిల్లీ నుంచి న్యాయ కోవిదులను రప్పించైనా సరే ఈ కేసును వాదించి విజయం సాధించాలని కేసీఆర్ చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది.

## పార్లమెంట్ లైబ్రరీ కమిటీ ఛైర్మన్‌గా నామా బాధ్యతల స్వీకరణ

- తొలిరోజే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** పార్లమెంట్ లైబ్రరీ కమిటీ ఛైర్మన్‌గా ఖమ్మం పార్లమెంట్ సభ్యులు, టీఆర్‌ఎస్ లోక్‌సభా పక్ష నేత, కామర్స్ కమిటీ సభ్యులు నామా నాగేశ్వరరావు బాధ్యతలు స్వీక రించారు. ఇటీవలే ఆయనను పార్ల మెంట్ లైబ్రరీ కమిటీ ఛైర్మన్‌గా నియ మిస్తూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉత్త ర్వులు జారీ చేశారు. పార్లమెంట్ భవ నంలో ఇందుకోసం కేటాయించిన ప్రత్యే క కార్యాల యంలో నామా గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు, అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. తొలిరోజే లైబ్రరీ జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్లు, సంబంధిత ఇతర ఉన్నతాధికారులతో నామా నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. లైబ్రరీ నిర్వహణకు సంబంధించేన ప్రాథమిక అంశాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతల నిర్వహణ కోసం నామా నాగేశ్వరరావుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ హాల్‌లో ప్రత్యేక ఛాంబర్‌ను, సిబ్బందిని కేటాయించింది.

## స్పైస్ జెట్‌ను అడ్డుకున్న పాక్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ నుంచి కాబూల్‌కు 120మంది ప్రయాణికులతో వెళుతున్న స్పైస్ జెట్‌ను పాక్ యుద్ధ విమానాలు అడ్డుకున్నాయని అధికారులు తెలిపారు. గత సెప్టెంబర్ 23న ఈ సంఘటన జరిగిందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) వర్గాలు తెలిపాయి. బోయింగ్ 737 విమానం పాకిస్తాన్ గగనతలంలోకి ప్రవేశించగానే ఈ విమానం యుద్ధవిమానంగా పాక్ ఎయిర్‌ఫోర్స్ పొరబడటంతో ఆ దేశానికి చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాలు చుట్టుముట్టాయని తెలిపారు. పాక్ ఫైటర్ పైలట్‌లతో స్పైస్ జెట్ పైలట్‌లు రేడియో ద్వారా సంభాషించి తమది ప్రయాణికుల విమానంగా తెలిపారన్నారు. అనంతరం ఆ విమానాన్ని పాక్-ఆఫ్ఘన్ సరిహద్దులు దాటేవరకు ఎఫ్-16 విమానాలు అనుసరించి వెనుతిరిగాయని డీజీసీఏ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి ప్రతి విమానంపై అది ఏ తరహా విమానమనేది కోడ్ భాషలో రాసి ఉంటుంది. అయితే పాక్ ఎయిర్‌ఫోర్స్ దాన్ని అర్థం చేసుకోలేకపోవడంతో గగనతలంలో ఈ అనూహ్య ఘటన జరిగిందని తెలిపారు. సున్నితమైన ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలిపేందుకు డీజీసీఏ అధికారులు నిరాకరించారు. ఈ సంఘటనపై స్పైస్‌జెట్ స్పందించలేదు. ఫిబ్రవరి 26న బాలాకోట్ దాడుల తరువాత పాక్ తమ గగనతలాన్ని భారత్‌కు మూసివేసింది. అనంతరం జులైలో పాక్షికంగా అంగీకరించింది. గత నెలలో ప్రధాని మోడీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ విదేశీ పర్యటనల సందర్భంగా తమ గగనతలాన్ని ఉపయోగించేందుకు పాక్ అనుమతించలేదు.

## బీహార్ వరద బాధితులకు సహాయం

● ఈశాన్య రాష్ట్రాల భద్రతపై కేంద్ర మంత్రి చర్చలు



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సందేశంతో దేశంలోని యువత స్వచ్ఛభారత్, జల సంరక్షణ, వరద సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. బీహార్ వరద బాధితులకు కేంద్రం తరపున పంపుతున్న సహాయ సామగ్రి పంపిణీ వాహనాన్ని ఆయన గురువారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ - తెలంగాణా భవన్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ... వరద బాధితుల కోసం సహాయ సామగ్రిని సేకరించిన స్వాభిమాన్ సంఘటన్ సంస్థను అభినందించారు. వరద బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బీహార్ వరదల వల్ల కొందరు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్రంగా నష్ట పోయారని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీహార్ వరద బాధితులకు ఈ సహాయం ఎంతో కొంత ఉపయోగపడుతుందని అన్నారు.

*ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటన*

అక్టోబర్ 20 నుంచి మూడు రోజుల పాటు ఈశాన్య రాష్ట్రాల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించనున్నారు. మణిపూర్, మేఘాలయ, అసోం రాష్ట్రాల్లో ఆయన పర్యటిస్తారు. ఈశాన్య రాష్ట్రాల్లోని గవర్నర్లు, భద్రతా దళాల అధికారులతో సమీక్షా సమావేశాల్లో కిషన్ రెడ్డి పాల్గొననున్నారు. ఈశాన్య రాష్ట్రాల భద్రత సహా సీఆర్పీఎఫ్, పారా మిలటరీ బలగాలతో ఆయన చర్చలు జరపబోతున్నారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలి

● మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కాంట్రాక్ట్ లెక్చరర్స్ విజ్ఞప్తి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రతి నెలా వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ కాలేజెస్ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కాంట్రాక్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని విద్య శాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి సంఘం నాయకులు గురువారం విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్, నాయకులు జబేఉల్లా, ప్రవీణ్, శ్రీనివాస్, గోవర్ధన్ తదితరులు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ లెక్చరర్స్‌గా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించేలా సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. తమకు నాలుగు నెలలకు, ఆరునెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారని దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అలా కాకుండా ప్రతి నెలా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. అలాగే క్యాజువల్ లీవ్స్(సీఎల్) పెంచాలని, బదలీలు చేపట్టేలా చూడాలని కోరారు.

## విదేశీ విద్యానిధి లబ్ధిదారుల వివరాలు సేకరించండి



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** అంబేద్కర్ ఓవర్సీస్ విదేశీ విద్యానిధి ద్వారా ఆర్థికసాయం పొంది విదేశాల్లో విద్యను పూర్తిచేసిన లబ్ధిదారుల అనుభవాలను తీసుకోవాలని ఎస్సీ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అధికారులను ఆదేశించారు. ఆర్థిక సాయం పొందిన వారు ఎంత మంది ఉన్నత స్థానాలకు వెళ్లారో వారి వివరాలను కూడా సేకరించాలన్నారు. ఎస్సీ డెవలప్‌మెంట్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి గురువారం సమీక్షనిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాతోపాటు ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్, ఎస్సీ డెవలప్‌మెంట్ డైరక్టర్ కరుణాకర్, మైనారిటీ సంక్షేమ శాఖ డైరక్టర్ షాన్‌వాజ్ ఖాసీం, గురుకుల సొసైటీల కార్యదర్శులు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, షఫీయుల్లా తదితరులు పాల్గొన్నారు. మైనారిటీల సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యావంతులైన నిరుద్యోగ యువతకు నూతన నైపుణ్యాలతో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెరిగేలా చూడాలన్నారు. కార్పొరేషన్ నిధులతో సబ్సిడీ నిధులతో వేలాది మందికి కార్లను అందించామన్నారు. ఇదే విధంగా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు కూడా రుణాలు ఇచ్చేందుకు ప్రణాళికలను రూపొందించాలని సంక్షేమ శాఖల అధికారులను మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బయోమెట్రిక్‌ను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## తెలంగాణకు ఏడుగురు కొత్త ఐఏఎస్‌లు

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** కొత్తగా తెలంగాణకు ఏడుగురు ఐఏఎస్‌లను కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం వెలువరించింది. సివిల్ సర్వీసెస్ 2019 బ్యాచ్‌కు చెందిన పలువురు అభ్యర్థులకు క్యాడర్‌ను కేటాయిస్తూ కేంద్ర శిక్షణా, సిబ్బంది వ్యవహారాల శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారం అందించిన డీఓపిటీ సెక్రటరీ ఎస్‌కె వర్మ ఏప రాష్ట్రాలకు ఎవరెవరిని కేటాయించారు అనే అంశాలను కూడా తేటతెల్లం చేశారు. తెలంగాణకు కర్నాటి వరుణ్‌రెడ్డి, చిత్రా మిశ్రా, పాటిల్ హేమంత్ కేశవ్(మహారాష్ట్ర), గరిమా అగర్వాల్(మధ్యప్రదేశ్), దీపక్ తివారీ(ఉత్తరాఖండ్), అంకిత్ (ఉత్తర్ ప్రదేశ్), ప్రతిమాసింగ్(ఉత్తరాఖండ్)ను కేటాయించగా, ఇతరరాష్ట్రాల కేడర్‌కు ముగ్గురు తెలంగాణ వాళ్లను కేటాయింపులు చేసింది. మహ్మద్ అబ్దుల్ షాహిద్‌ను పశ్చిమ బెంగాల్‌కు, బి వైష్ణవిని త్రిపురకు, నీలం లలితా ఆదిత్యను చత్తీస్‌ఘడ్‌కు కేటాయించారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా 9మంది కొత్త ఐఏఎస్‌లను కేటాయించారు.

## నిఘా నేత్రానికి విశేష స్పందన

**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ సీసీ టీవీ ప్రాజెక్టు, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద వివిధ సంస్థలు, ప్రజలను భాగస్వాములను చేస్తూ సీసీటీవీ కెమెరాల స్థాపనలో పోలీసుల కృషి సత్ఫలితాలనిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం కాగా.. ఇప్పటికే కమ్యూనిటీ సీసీటీవీ ప్రాజెక్టు కింద 52,251 సీసీ కెమెరాలు ఏర్పాటవ్వగా.. నేను సైతం ప్రాజెక్టు కింద 5,16,937 సీసీటీవీ కెమెరాలు సమకూరాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తంగా ఇప్పటివరకు 5,69,188 సీసీ టీవీ కెమెరాలు ఇన్‌స్టాల్ అయ్యాయి. డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి.. హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 100 మంది ఉన్న సంస్థలు, షాపులు తప్పనిసరిగా లోపల, బయట సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆ దిశగా వారిని చైతన్యవంతులను చేసి వారితో సీసీటీవీ కెమెరాల స్థాపనలో సఫలమయ్యారు. మహేందర్‌రెడ్డి డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆ సంస్కరణల అమలుకు కృషి చేస్తున్నారు.

# మాది రైతు ప్రభుత్వం

● ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన మంత్రి హరీష్‌రావు ● రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది

● తెలంగాణ వేద విద్వాన్ మహాసభలు నిర్వహించడం అదృష్టం



**సిద్దిపేట, ప్రభ న్యూస్ :** ధాన్యానికి సరైన మద్దతు ధర ఇస్తాం.. ఇది రైతు ప్రభుత్వం.. రైతే ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. తేమశాతం తగ్గాక వడ్లను ఆరబెట్టి తేవాలని రైతులను ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు కోరారు. సిద్దిపేట జిల్లా నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, వడ్ల కొనుగోలు కేంద్రాలను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్, జడ్పీ చైర్మన్ వేలేటి రోజా రాధాకృష్ణ శర్మ, జిల్లా కలెక్టర్ పి.వెంకట్రామరెడ్డిలతో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని 116 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.1,15,35,416 కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

మంత్రి హరీశ్‌రావు గురువారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో విస్తృతంగా పర్యటించారు. జిల్లా కేంద్రంలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల ప్రారంభించడంతో పాటు, వేద విద్వాన్ మహా సభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి హరీశ్‌రావు తన నివాసంలో పలువురు సందర్శ కులను కలుసుకుని, వారి వినతి పత్రాల ను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేద విద్వాన్ మహా సభ ప్రారం భం సందర్భంగా మంత్రి హరీశ్ రావుతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటి రోజా శర్మ, టీఆర్‌ఎస్ నాయకుడు వేలేటి రాధా కృష్ణ శర్మ, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ సిద్దిపేటలో తెలంగాణ వేద విద్వాన్ మహాసభలు నిర్వహించే అవకాశం ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహాసభలు జరిగే నాలుగు రోజుల పాటు సిద్దిపేట పట్టణం వేదఘోషతో పునీతమవుతుందన్నారు. వేద పరిరక్షణకు శ్రీ జనార్ధనా నంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్టు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అదే విధంగా వేదం నేర్చుకున్న విద్యార్థులకు ఇక్కడే పరీక్షలు నిర్వహించి, పట్టాలు పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. వేద ధర్మాన్ని పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తున్నదన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రి కేసీఆర్ స్వయంగా ధార్మిక సేవా తత్పరుడన్నారు.

**169 కొనుగోలు కేంద్రాలు**

సిద్ధిపేట పత్తి మార్కెట్ యార్డులో వరి ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. క్వింటాలు వరి ధాన్యంకు రూ.1835లు, క్వింటాలు పత్తికి రూ. 5550లు మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. జిల్లాలో 169 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా మని చెప్పారు. పత్తి సీసీఐ ద్వారా జిల్లాలో 32 కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేయడం జరుగుతందని గతంలో ఉన్న ఐకేపీ కేంద్రాలు కొనసాగిస్తా మన్నారు.

**ప్రతి పైసా పేదలకే..**

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ ఖజానా ప్రతిపైసా పేద వారికి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇది మీ హక్కు అని చెప్పారు. రెండవ పంట కోసం పల్లి, శనగ విత్తనాలను 35 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. యాసంగిలో వరి, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు ఇలా ఐదు రకాల విత్త నాలు అందుబాటులో తీసుకొచ్చా మని, వీటి ధర కిలో రూ. 60 ఉంటే, ప్రభుత్వం సబ్సిడీపై రూ. 42కే అందిస్తుందని చెప్పారు. గజ్వేల్ నియోజక వర్గంలో ఆరు తడి పంటలు వేసేలా దృష్టి సారించాలని ఆ దిశగా రైతులను చైతన్య పరుస్తూ ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. పాత రోజుల్లో కూరగాయల పంటలు పండించాలంటే ఇబ్బందులు ఉండే వని, ఇప్పుడు ఆ పరిస్థితికూడా లేదని, ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా ఉందని భరోసాను ఇచ్చారు.

**మొక్కజొన్నకూ కొనుగోలు కేంద్రాలు**

మొక్కజొన్న రైతులకు రూ.1,760 మద్దతు ధర ఉన్నదని, అవసరమైతే త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అన్నిచోట్ల యధావిధిగా వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వడ్ల కొనుగోలుకు రూ. 1,835 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. పత్తి మద్దతు ధర రూ. 5,550, పత్తి రైతులు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందు గజ్వేల్ నియోజకవర్గంలో మూడువేల స్థాయి గోదాములు ఉండేవని, కానీ సీఎం కేసీఆర్ గజ్వేల్ వచ్చాక 50వేల మెట్రిక్ టన్నుల గోదాములు వచ్చాయని చెప్పారు.

**కల్యాణలక్ష్మికి అడ్డుండదు..**

కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ పెండింగ్‌లో ఉండొద్దని సీఎం కేసీఆర్ ఆర్థికశాఖకు ఆదేశాలు ఇచ్చారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పేదింట ఆడపిల్ల పెళ్ళికి రూ.లక్షా 116 అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మంత్రి స్పష్టం చేశారు. గజ్వేల్ నియోజక వర్గంలో బీసీలకు మరో 850 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని మరో నాలుగైదు రోజుల్లో లబ్ధిదారులకు అందజేస్తామని హామీనిచ్చారు. నియోజకవర్గ పరిధిలోని 116 మందికి కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్‌చెక్కులు రూ.1,15,456 కోట్లు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# నేడు లక్కీ డ్రాలు

● సర్వం సిద్ధం ● ముగిసిన దరఖాస్తుల పర్వం ● మొత్తం 48,401 దరఖాస్తులు ● రూ. 968 కోట్ల రాబడి

● 29 మద్యం దుకాణాలకు నేడు నో లాటరీ ● తక్కువ దరఖాస్తులే కారణం

● రంగారెడ్డి, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో అత్యధికం



**హైదరాబాద్, ఆంధ్రప్రభ:** మద్యం దుకాణాలకు భారీ స్పందన వచ్చింది. చివరి రెండు రోజుల్లోనే రికార్డు స్థాయిలో వచ్చిన దరఖాస్తులతో 2216 మద్యం దుకాణాలకుగానూ 48,401 దరఖాస్తులకు చేరాయి. దరఖాస్తు రుసుము రూపంలో ఖజానాకు రూ. 968కోట్ల 2 లక్షల రాబడి సమకూరింది. 2017-18లో ఇది రూ. 411కోట్లేకావడం గమనార్హం. అయితే ఈ దఫా రాష్ట్రవ్యాప్తంగా 2187 మద్యం దుకాణాలకు జిల్లాలవారీగా లాటరీలను నిర్వహించి శుక్రవారం లైసెన్సులను ఖరారు చేస్తారు. లాటరీనిలిపివేసిన మరో 29 మద్యం దుకాణాలకు తరువాత లాటరీ నిర్వహిస్తారు. తక్కువ దరఖాస్తులు రావడమే లాటరీ నిలివేతకు కారణమని ఆబ్కారీ శాఖ అధికారులు చెప్పారు. ఆయా దుకాణాలకు ఒక్కో షాపుకు 4కంటే తక్కువ దరఖాస్తులు రావడంవెనుక కారణాలను విశ్లేషిస్తున్నారు. అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్న ఆబ్కారీ శాఖ ఇక్కడ బెదిరింపులు కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తోంది.

ఈనెల 9న 2216 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. రెండేళ్లపాటు మద్యం దుకాణాల నిర్వహణకు వీలుగా బుధవారం రాత్రి వరకు దరఖాస్తులను స్వీకరించారు. అన్ని జిల్లాల్లో నేడు లాటరీలను కలెక్టర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఈఎస్‌లు, సీఐల నేతృత్వంలో భారీ బందోబస్తు నడుమ లాటరీలను తీయనున్నారు లక్కీ డ్రాలలో వచ్చినవారికి 19నుంచి ప్రొవిజనల్ లైసెన్సులను జారీ చేయనున్నారు. 30లోపు పూర్తిస్థాయి లైసెన్సులను జారీ చేసి నవంబర్ 1నుంచి మద్యం దుకాణాలను ఈ కొత్త యాజమాన్యాలు నిర్వహించేలా ప్రభుత్వం షెడ్యూల్ మేరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంది.

బుధవారం సాయంత్రంతో ముగిసిన దరఖా స్తుల గడువు తర్వాత గురువారం ఉదయం ఎక్సైజ్ యంత్రాంగం ఆయా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించింది. సగటున ఒక్కో దుకాణానికి 21.7 చొప్పున దరఖాస్తులు దాఖలవడంతో ఆబ్కారీ శాఖ సంతృప్తిని వ్యక్తం చేసింది. దరఖాస్తులకు చివరిరోజున 27వేలకు పైగా దరఖాస్తులు దాఖల య్యాయి. రంగారెడ్డి డివిజన్‌లో అత్యధికంగా 422 దుకాణాలకు 8522 దరఖాస్తులురాగా, నిజామాబాద్ డివిజన్‌లో అత్యల్పంగా 131 దుకాణాలకు 1547 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి.

| డివిజన్ | దరఖాస్తులు |
|---|---|
| ఆదిలాబాద్ | 2956 |
| కరీంనగర్ | 4013 |
| ఖమ్మం | 7713 |
| మహబూబ్‌నగర్ | 3382 |
| మెదక్ | 3200 |
| నల్గొండ | 7100 |
| నిజామాబాద్ | 1547 |
| రంగారెడ్డి | 8522 |
| వరంగల్ | 8100 |
| హైదరాబాద్ | 1499 |

# మేమూ సమ్మె చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)



ఉపాధ్యాయ, పెన్షనర్ల జేఏసీ నేతలు గురువారం బీఆర్‌కే భవన్‌లో సీఎస్ డాక్టర్ ఎస్‌కే జోషిని కలిశారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఉద్యోగ జేఏసీ పెద్దగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టలేదు. ఐదేళ్లుగా సహనంతో ఉన్నామని, బంగారు తెలంగాణ సాధనకు శ్రమిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్న ఆవేదనతో వారు ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం, బదలీలను పూర్తిగా నిలిపివేయడం, కొత్త జిల్లాలు, మండలాల్లో ఆర్డర్ టూ సర్వ్ ఇంకా కొనసాగించడం, తమ సమస్యలపై స్పందించ కపోవడం వంటి అంశాలపై వారు అసంతృప్తితో ఉన్నారు. వీటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా ఆయనతో భేటీకి అవకాశం దక్కకపోవడంతో వారు కాస్త కోపంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వరస ఎన్నికలవల్ల ప్రభుత్వం ఏం చేయడానికి అవకాశం లేకపోయిందన్న భావనతో ఇన్నాళ్లూ వేచి చూసిన ఉద్యోగ సంఘాలు ఇప్పుడు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి. మొదట వినతిపత్రం ద్వారా ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లి ఒత్తిడి తేవాలని నిర్ణయించాయి. 2018 జూలై 1నుంచి బకాయిపడిన పీఆర్‌సీ(వేతన సవరణ) 43 శాతం ఫిట్‌మెంట్, బకాయి డీఏ విడుదల, హెల్త్‌కార్డులుసహా అనేక అంశాలతో సీఎస్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాము సీఎంను కలిసిన సందర్భంలో హుజూర్‌నగర్ ఎన్నికల తర్వాత సమావేశమవుదామని చెప్పారని, రెవెన్యూ శాఖలో పలు డిమాండ్లపై ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరుగుతోందని జేఏసీ అభిప్రాయపడింది. సమస్యలపై ప్రభుత్వం స్పందించి ఉద్యోగ సంఘాలనే చర్చలకు పిలవాలని, సరైన సమయంలో స్పందించకపోతే దశలవారీ ఉద్యమం తప్పదని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ కారెం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వి మమత, టీటీవోల జనరల్ సెక్రటరీ ఎ.సత్యనారాయణ, టీఎన్‌జీవోల సంఘం జనరల్ సెక్రటరీ ఎం రాజేందర్, క్లాస్ 4 ఉద్యోగుల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, టీటీయు అధ్యక్షుడు ఎం మణిపాల్ రెడ్డి, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఎ శ్రీనివాస్, ఇంటర్ విద్య జేఏసీ నేత కృష్ణ కుమార్ తదితరులు పేర్కొన్నారు.

**ఇవీ డిమాండ్లు**

♦ 2018 జూలై 1నుండి వేతన సవరణ అమలు. 2019 జనవరి 1నుండి, 2019 జూలై 1నుండి బకాయిపడిన కరవు భత్యం(డీఏ)ను మంజూరు

♦ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులందరినీ స్వరాష్ట్రానికి తీసుకురావాలి.

♦ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు కూడా పాత పెన్షన్ విధాన పునరుద్ధరించాలి.

♦ సర్వీసులో ఉండి మరణించిన ఉద్యోగి కుటుంబానికి కుటుంబ పెన్షన్

♦ పదవీ విరమణ వయసును 58 నుండి 61 సంవత్సరాలకు పెంపు

♦ ఆర్టీసీ కిర్మాకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

♦ తెలంగాణలోని గ్రంథాలయ సంస్థ, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ, విశ్వవిద్యాలయాలు, ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్, పాఠశాలల ఉద్యోగులకు 010 ద్వారా వేతనాలను చెల్లించాలి. వీరికి హెల్త్‌కార్డులను మంజూరు చేయాలి.

♦ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, తెలంగాణలోని విశ్వవిద్యాలయాలలో పనిచేసే ఉద్యోగులకు మినిమం టైం స్కేలు మంజూరు చేయాలి.

♦ ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలను పరిష్కరించి పదోన్నతుల ప్రక్రియ వెంటనే చేపట్టాలి. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ పదోన్నతులను కల్పించాలి. 398 రూపాయలతో పనిచేసిన ఉపాధ్యాయులకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరీ చేయాలి. సింగరేణి పాఠశాలల ను, సిబ్బందిని ప్రభుత్వ యాజమాన్యంలోకి తీసుకురావాలి.

♦ విశ్వవిద్యాలయాల, స్థానిక సంస్థల ఎయిడెడ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను మంజూరీ చేయాలి. ఉద్యోగులు, పెన్షనర్లు అందరికి ఈ పథకానికి నెలవారీ చందాను ప్రభుత్వానికి చెల్లించేందుకు సిద్దంగా ఉన్నారు.

♦ బదలీలపై నిషేదం ఎత్తివేయాలి. సాధారణ ఎన్నికల విధుల్లో పాల్గొన్న తహశీల్దార్లను తిరిగి పాత స్థానాలకు బదలీ చేయాలి. గత 6 సంవత్సరాలుగా రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాల్లో బదలీలు జరగలేదు. ప్రతీ సంవత్సరం తప్పనిసరిగా సాధారణ బదలీలను జూన్, జూలై నెలల్లో చేపట్టాలి.

♦ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 36, 37లలో ఉన్న ఏపీఎన్జీవోల ఇంటి స్థలాలను భాగ్యనగర్ తెలంగాణ ఎన్జీవోల సంఘానికి కేటాయించాలి.

♦ పదోన్నతులు కల్పించడానికి మూడు సంవత్సరాల కనీస సర్వీసు నిబంధనను తొలగించి రెండేళ్లకు పదోన్నతులు వర్తింపజేయాలి.

♦ 70 ఏళ్లకు పైబడిన పెన్షనర్లకు 15శాతం అదనపు పెన్షన్ మంజూరు, పెన్షనర్లకు తెలంగాణ ఇంక్రిమెంట్ ఇవ్వాలి.

♦ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం నేరుగా జీతాలు చెల్లించాలి. సమాన పనికి సమాన వేతనం అందించాలి.

♦ ప్రభుత్వ శాఖలలో ప్రతీ పదిమంది డ్రైవర్ అనుగుణంగా ఒక సీనియర్ గ్రైవర్ పోస్టులు మంజూరు చేయాలి. 2003 ఏప్రిల్ 22నాటి జీవో నెంబర్ 127జీఏడి(సెక్షన్-బి) జీవో అమలు చేయాలి.

**ఆర్టీసీ సమ్మెకు మద్దతు**

పనిలోపనిగా, ఆర్టీసి కార్మికుల సమస్యలపై సీఎస్‌కు వినతిపత్రం అందజేసిన జేఏసీ నేతలు సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశాయి. ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె న్యాయమైనదని, వారికి మద్దతు ఇస్తున్నామని స్పష్టం చేసింది.

## మహిళా యాజమాన్య సంస్థలకు ఆర్థిక చేయూత

● రూ. 15లక్షలు ప్రకటించిన ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్

**హైదరాబాద్,ఆంధ్రప్రభ:** వీ హబ్ కమ్యూనిటీ స్టేట్ యాక్సలరేటర్ ప్రోగ్రామ్ భాగస్వామ్యంతో మహిళల సారథ్యంలో నడుస్తున్న ఐదు సామాజిక ఉత్పాదక సంస్థలకు చెన్నై ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ రూ.30 వేల ఆస్ట్రేలియన్ డాలర్ల ప్రత్యక్ష (రూ.15 లక్షలు) ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. వీహబ్ తో భాగస్వామిగా ఉన్న ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ గురువారం వీహబ్ లో జరిగి ఓ కార్యక్రమంలో ఈ ప్రకటన చేసింది. సైన్ అండ్ టెక్నాలజీ ,ఇంజనీరింగ్ మాథమెటిక్స్ విభాగాల్లో మహిళా సాధికారత ను ప్రోత్సహించేందుకు ఈ సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో బాగంగా గురువారం వీహబ్ లో ఆస్ట్రేలియన్ వైస్ కాన్సూల్ చెన్నై శాఖశాఖ అండ్రూ కోలిస్టర్, ఆస్ట్రేలియా విదేశీ వ్యవహారాలు, వర్తక శాఖ చీఫ్ ఇన్నోవేషన్ అధికారి డా:సారా పియర్సన్, తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, వీహబ్ సిఈఓ దీప్తి రావుల రెడ్డి డిల్లీ ఆస్ట్రేలియా హైకమీషన్ రెండో కార్యదర్శి సారా గ్రీన్‌బౌమ్ సమక్షంలో ప్రత్యక్ష ఆర్థిక సాయానికి ఆయా సంస్థలను ప్రకటించారు. ఊర్వీ,అడిరోలాబ్స్, సెల్లిరైట్ ,క్యాబ్ దోస్తు, అనే ఐదు మహిళా యాజమాన్య సంస్థలు ఈ సహాయ పథకానికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఈసందర్భంగా జయేష్‌రంజన్ మాట్లాడుతూ ఎక్కువ మంది మహిళలను యజమానులుగా ప్రోత్సహించటానికి తెలంగాణ ప్రభుత్వంలో తీవ్ర కృషి జరుగుతుందన్నారు. ఇందుకోసం పలు మార్గాలను అన్వేశిస్తున్నమని,అందులో బాగంగా చెన్నై అస్ట్రేలియా కాన్సూల్ తో ఒప్పందం కుదుర్చుకోవటం జరిగిందన్నారు. స్టార్టప్,స్కేల్అప్, సస్టెయిన్ పద్ధతుల్లో విడివిడిగా వారికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. దీప్తి రావుల రెడ్డి మాట్లాడుతూ మహిళల నేతృత్వంలో సంస్థలను ప్రోత్సహించటం ద్వారా సామాజిక పరివర్తనకు దోహదం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఇద్దరు అటవీ అధికారులపై వేటు

**సిరికొండ, ప్రభన్యూస్ :** ఆదిలాబాద్ జిల్లా, వాయిపేట్ అటవీ ప్రాంతంలోని ఎనిమిది ఎకరాల్లో టేకు చెట్ల నరికివేత సంఘటనలో అటవీ అధికారులు చర్యలు ప్రారంభించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినట్లు నిర్ధారిస్తూ సంబంధిత అటవీ సెక్షన్ అధికారి ప్రేంసింగ్, బీట్ అధికారి సంతోష్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. ఈకేసులో వాయిపేట్‌కు చెందిన పలువురు చెట్లను నరికివేసినట్లు అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేశారు. సిరికొండ మండలంలోని వాయిపేట్ , భీంపూర్ దారిలో ఎనిమిది ఎకరాల మేర దాదాపు 140 టేకు చెట్లను వారం రోజుల కిందట నరికివేశారు. స్పందించిన అధికారులు వెంటనే పోలీసుల సహకారంతో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విచారణ ప్రారంభించి ఇద్దరు అధికారులను బాధ్యులను చేసి వారిని విధుల నుంచి తప్పించారు. నరికివేతకు గురైన చెట్ల గణనలో ఇప్పటికే ఈనష్టం రూ. 13లక్షలకు పైగా ఉన్నట్లు ప్రాథమికంగా అధికారులు నిర్ధారించారు. నష్టం బయటపడటంతో ఈకేసులో అటవీ క్షేత్రాధికారిపై వేటుపడే అవకాశాలున్నట్లు సమాచారం. అటవీ సెక్షన్ అధికారి , బీట్ అధికార్లపై సస్పెన్షన్ వేటు విషయమై టైగర్ జోన్ రేంజ్ అటవీ అధికారి (ఎఫ్ఆర్ఓ) వాహబ్ అహ్మద్ ను వివరణ కోరగా ఇద్దరు అటవీ అధికారులను సస్పెండ్ చేశారు.

## కారుటైర్ పేలి ఇద్దరు మృతి

**డిచ్‌పల్లి, ప్రభన్యూస్ :** నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు ఎస్సై సురేష్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన కానుల గంగవ్వ(75)ను అతని పెద్ద కుమారుడి వద్ద ఉన్న తల్లిని నిజామాబాద్‌లో హనుమాన్‌నగర్‌లో ఉంటున్న చిన్న కుమారుడు భూమయ్య తన షిఫ్ట్ డిజైర్ కారులో తీసుకెళ్తుండగా పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా కారు టైరు పేలి కారు పక్కనే ఉన్న ఇనుప గ్రిల్స్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న 7వ బెటాలియన్ ఇనుప జాలీలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో కానుల గంగవ్వ, వంగాల రవీందర్ అక్కడికక్కడే మృతి చెందారు.

## వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

● పురపాలకశాఖ కార్యదర్శి అరవింద్ కుమార్

**హైదరాబాద్, ఆంధ్రప్రభ :** ఖిల్లా వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అర్వింద్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం వరంగల్ నగర మాజీ డిప్యూటి మేయర్ కట్టె సారయ్యతో కలిసి ఖిలా వరంగల్‌ను సందర్శించారు. శంభునిగుడి, గుండం చెరువు, పార్కు, కాకతీయుల నాటి ఇతర చారిత్రక కట్టడాలను పరిశీలించారు. కుష్మ హాల్, కాకతీయ తోరణాల నిర్మాణశైలి పట్ల అబ్బురపడ్డారు. ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వాకబు చేశారు. ఖిలా వరంగల్‌లో నిర్మిస్తున్న పురావస్తు మ్యూజియం గురించి తెలుసుకున్నారు. గుండం చెరువును భద్రకాళి బండ్ వలె అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ వైభవానికి, చరిత్రకు నిదర్శనంగా నిలిచిన కాకతీయ రాజులైన గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు, రుద్రమదేవి విగ్రహాలను గుండం చెరువు వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పర్యాటకశాఖ సహకారంతో నిధుల మంజూరుకు ప్రయత్నించనున్నట్లు తెలిపారు. గుండం చెరువు పక్కనున్న గుట్ట, చారిత్రక కట్టడాల వద్ద సినిమా షూటింగ్‌లు జరుగుతున్నందున మౌలిక వసతులు విస్తరిస్తే మరింత ప్రాచుర్యతను సంతరించుకుంటుందని అభిప్రాయపడ్డారు.

గుండం చెరువు పరిసరాలలో ఉన్న భూమిని కుడా ఆధ్వర్యంలో సేకరించినట్లు అధికారులు వివరించారు. అలాగే ఖిలా వరంగల్ లోపల ఉన్న ఇండ్ల మధ్యలో చారిత్రక శిలాఫలకాలు, దేవతా విగ్రహాలు ఉన్నాయని, ఆ భూముల ఆక్రమణలో ఉన్నందున గతంలో కొంత పరిహారం చెల్లించి భూమిని సేకరించేందుకు ప్రయత్నం జరిగినట్లు కట్టె సారయ్య వివరించారు. ఈ అంశాన్ని పరిశీలిస్తానని ప్రిన్సిపల్ సెక్రెటరీ అర్వింద్ కుమార్ తెలిపారు. పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్కును పరిశీలించి, దాని నిర్వహణ తీరును తెలుసుకున్నారు. అనంతరం వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.రవికిరణ్ క్యాంపు కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ పాటిల్‌తో కలిసి పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అర్వింద్ కుమార్ మొక్కలు నాటారు.



## సోఫియా బొమ్మ వేసింది..!

ప్రపంచంలో ఒక దేశ పౌరసత్వం పొందిన ఏకైక హ్యూమనాయిడ్ రోబో సోఫియా ఇప్పుడు మరో అరుదైన ఫీట్ చేసింది. న్యూఢిల్లీలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ నిర్వహిస్తున్న రోబోట్ అండ్ హ్యూమన్ ఇంటరాక్టివ్ కమ్యూనికేషన్స్ ప్రదర్శనలో ఈ ఏఐ రోబో తన ప్రత్యేకతను చాటుకుంది. చిత్రాన్ని స్వయంగా గీసి అందరినీ ఆకట్టుకుంది. సోఫియా రోబో మెదడులో ప్రత్యేక న్యూరాన్ల వ్యవస్థతోనే ఇదంతా సాధ్యమవుతోంది. తన ప్రత్యేకతను చాటుతోంది.



## ఈ రోబో గేమ్ ఆడింది..!

రోబోటిక్స్ రంగంలో కృత్రిమ మేథ సృష్టిస్తున్న సంచలనాలు తక్కువేం కాదు. ఇదిగో ఇక్కడ కనిపిస్తున్న ఏఐతో అభివృద్ధి చేసిన ఈ రోబో పేరు 'క్యూ 56'. వీడియో గేమింగ్‌లో దీనిని మించినవారు లేరు. వైద్యం, సేవలు, రక్షణ, వినోద రంగాలలో ఇప్పటికే ఎంతో ప్రతిభ చాటుకున్న రోబోలకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత తోడయ్యేసరికి అద్భుతాలు సృష్టిస్తున్నాయి. జపాన్‌లోని చైబాలో, బందాయ్ నమ్కో హోల్డింగ్స్ సంస్థ సారధ్యంలో నిర్వహిస్తున్న ఆధునిక సాంకేతిక ప్రదర్శనల్లో ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చైనీయులకైతే ఇది భలే నచ్చేసింది.



## పాపం పులి..!

కాలువలో కొట్టుకొస్తున్న ఓ ప్లాస్టిక్ సీసాను చూసి ఓ పులి కొత్తరకం ఆహారం దొరికిందేమోనని తెగ ఆశపడింది. ఆకుపచ్చరంగులో కొట్టుకొస్తున్న ఆ సీసాకోసం ఒడ్డునే కాపుకాసి ఒడుపుగా పట్టి, నోట కరచింది. తీరా అది ప్లాస్టిక్ సీసా కావడంతో దాని ఆకలి తీరలేదు. కానీ ఇలా అడవుల్లో, జంతు సంరక్షణ కేంద్రాలు, పార్కుల్లో ప్లాస్టిక్ వస్తువులు, వ్యర్థాలను ఇలా వదిలేయడాన్ని ప్రకృతి ప్రేమికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బ్రెజిల్‌లోని పంతనల్‌లోని ఓ వన్యప్రాణి సంరక్షణ ప్రాంతంలో ఈ దృశ్యాన్ని పాల్ గోల్డ్‌స్టీన్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్ మనిపించాడు. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి, ప్రపంచం మేల్కోవాలని పిలుపునిస్తున్నాడు.



## సైంటిఫిక్ ప్రపంచ సుందరి

23 ఏళ్ల వయసున్న సూపర్ మోడల్ బెల్లా హదీద్ ఈ ప్రపంచంలోనే అత్యంత అందగత్తె అని గ్రీక్ గణితశాస్త్రం చెబుతోంది. అందమైన మహిళలు ఎవరో తేల్చేందుకు గోల్డెన్ రేసియో ఆఫ్ బ్యూటీ పై స్టాండర్డ్స్ ఫార్ములాను గ్రీక్ స్కాలర్లు రూపొందించారు. ముఖ భాగాల కొలతలను తీసుకుని అందాన్ని లెక్కించారు. క్లాసిక్ గ్రీక్ గణాంకాలకు అనుగుణంగా అందాన్ని నిర్వచించిన ఈ ఫార్ములాకు బెల్లా హదీద్ ముఖం కొలతలు 94.35 శాతం సరిపోలాయి. ఇదే ఫార్ములా ప్రకారం.. పాప్ సింగర్ బెయోన్స్ రెండవ స్థానంలో నిలిచింది.

## వాజ్‌పేయి సంస్కారి..
## మోడీ కఠినాత్ముడు: శరద్ పవార్

**ముంబై:** ప్రధాని నరేంద్ర మోడీపై ఎన్‌సీపీ అధినేత శరద్‌పవార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ ప్రధాని వాజ్‌పేయి వ్యవహారశైలి, మోడీ తీరు భిన్నమని విమర్శించారు. తన నిర్ణయాలు ఇతరులను నొప్పించకుండా ఉండేలా వాజ్‌పేయి జాగ్రత్త వహించేవారు. ఆయనపై అన్నివర్గాల ప్రజలకు గౌరవం ఉండేది. వాజ్‌పేయి మంచి సంస్కారం కలిగిన చురుకైన వ్యక్తి. మోడీ శైలి ఇందుకు విరుద్ధం. మోడీ కఠినాత్ముడు. ఇద్దరు ప్రధానుల పనితీరులోనూ ఎంతో వైవిధ్యం ఉందన్నారు. వాజ్‌పేయి హయాంలో పవార్ విపత్తుల నిర్వహణ సంస్థకు వైస్‌చైర్మన్‌గా వ్యవహరించారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్‌పైనా విమర్శలు చేశారు. రాష్ట్రంలో రైతాంగం, పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టలేక పోయారని, మెరుగైన పనితీరు చూపలేక పోయిన అసమర్థ ముఖ్యమంత్రి అని అన్నారు. వ్యవసాయ సంక్షోభాన్ని బీజేపీ ప్రభుత్వం పరిష్కరించలేక పోయిందని, రాష్ట్రంలోని రైతాంగం అంతా తీవ్ర ఒత్తిడిలో, ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉందని చెప్పారు. పరిశ్రమలు పెద్దసంఖ్యలో మూతబడటం వల్ల, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దెబ్బతిన్నాయని తెలిపారు.

## హర్యానా అసెంబ్లీ బరిలో '1169'

**న్యూఢిల్లీ:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల బరిలో 1169 మంది అభ్యర్థులు నిలిచారు. రాష్ట్రంలోని 90 స్థానాలకు ఈనెల 21న పోలింగ్ జరగనుంది. భారతీయ జనతాపార్టీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బీజేపీ, కాంగ్రెస్ సొంతంగా 90 సీట్లకు పోటీ చేస్తుండగా, బీఎస్పీ 87, ఐఎన్‌ఎల్‌డీ 81 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టాయి. రాజకీయ పార్టీలకు సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు 375 మంది పోటీలో ఉన్నారు. ఎలక్షన్ కమిషన్ సమాచారం ప్రకారం రాష్ట్రంలో 1169 మంది బరిలో నిలవగా, వారిలో 1064 మంది పురుషులు, 104 మంది మహిళలు, ఒకస్థానంలో ట్రాన్స్ జెండర్ ఉన్నారు. హాన్సి నియోజకవర్గంలో గరిష్టంగా 25 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, షాహ్‌బాద్‌లో కనిష్టంగా ఆరుగురు రేసులో నిలిచారు. ఒక నియోజకవర్గంలో మాత్రమే 1.5 లక్షల కంటే తక్కువ ఓటర్లున్నారు. 47 నియోజకవర్గాల్లో 1.5-2 లక్షల మంది, 42 నియోజకవర్గాల్లో 2 లక్షల కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19578 పోలింగ్ కేంద్రాల్లో, 27611 వీవీప్యాట్ యంత్రాలు వినియోగిస్తున్నారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, అసోంలో పౌర నమోదు వంటి అంశాలను గెలుపోటములు ఆధారపడతాయనే విశ్లేషణలున్నాయి.

## వలసదారులను పంపేసిన మెక్సికో

**మెక్సికో సిటీ:** అమెరికా ఒత్తిడితో చట్టవిరుద్ధంగా సరిహద్దులు దాటిన వారిని తనిఖీ చేసే ప్రయత్నంలో 311మంది భారత్ అక్రమ వలసదారులను మెక్సికో తిరిగి పంపేసింది. తొలిసారి మెక్సికో అధికారులు వివిధ ప్రాంతాల నుంచి 311మంది భారతీయులను బహిష్కరించారు. తమ దేశంలో ఉండేందుకు అనుమతి లేని భారతీయ పౌరులను టోలుకా సిటీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బోయింగ్ 747 విమానంలో న్యూఢిల్లీకి పంపించివేశామని నేషనల్ మైగ్రేషన్ ఇనిస్టిట్యూట్ (ఐఎన్ఎం) బుధవారం విడుదలచేసిన పత్రికా ప్రకటనలో తెలిపింది. ఐఎన్ఎం చరిత్రలో ఇంతకుముందెన్నడూ ఈవిధంగా జరగలేదని ప్రకటనలో పేర్కొన్నారు. మెక్సికో సరిహద్దుల ద్వారా అమెరికాలో ప్రవేశించే వ్యక్తులకు చెక్ పెట్టకపోతే మెక్సికన్ దిగుమతులన్నింటిపై సుంకాలను విధిస్తామని ట్రంప్ హెచ్చరించడంతో మెక్సికో దిద్దుబాటు చర్యలకు దిగింది. వలసదారులను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# కాశ్మీర్ వెళ్తారా... ఐతే నాకు చెప్పండి

- మీ పర్యటనకు ఏర్పాట్లు చేస్తా
- మహారాష్ట్ర పౌరులకు ప్రధాని మోడీ ఆఫర్
- బీడ్ ప్రచార సభలో కాంగ్రెస్‌పై ధ్వజం

**ముంబై:** జమ్ము-కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును ఎగతాళి చేసే ప్రతి వ్యక్తిని చరిత్ర గుర్తించుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విపక్షాలకు పరోక్ష హెచ్చరిక చేశారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితులు చక్కబడ్డాయని, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని చెప్పారు. ఎవరైనా కాశ్మీర్ చూడాలని అనుకుంటే నాకు చెప్పండి. అక్కడ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తాను అని ప్రధాని ఆఫర్ ఇచ్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా, గురువారం బీడ్‌లో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 370 అధికరణం రద్దుకు వ్యతిరేకంగా వారు (విపక్షాలు) ఎలాంటి ప్రకటనలు చేశారో మీకు గుర్తుందా? అసలు అది మనదేశ అంతర్గత వ్యవహారమే కాదని ఒక నాయకుడు, ఇలాంటి నిర్ణయాలు దేశాన్ని నాశనం చేస్తాయని ఇంకొక నాయకుడు విమర్శించారు. భారత రాజకీయాలకు బ్లాక్ డే అని ఒకరు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వేరొకరు, జాతీయ భద్రతకు ప్రమాదమని మరొకరు నానా వ్యాఖ్యలు చేశారు. వీళ్లంతా కేవలం వాళ్ల గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు. మన శత్రువులకు వీళ్లు ఐడియాలు ఇస్తున్నారు. మహాత్మాగాంధీ బతికుంటే, కాశ్మీర్ అంశానికి నిరసనగా ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు పాదయాత్ర చేసేవారని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ విమర్శించారు. కానీ, వాస్తవం ఏమిటో మీరు చూస్తున్నారు. వాళ్లు చెప్పినట్లు దేశం నాశనమైందా? మనం కాశ్మీర్‌ను వదులుకోవాలా? ఇలాంటి కామెంట్లు చేసిన వాళ్లను శిక్షించాలా? వద్దా? మీరే చెప్పండి అంటూ ప్రధాని ప్రశ్నించారు. ఒకవేళ కాశ్మీర్ వెళ్లాలంటే నాకు చెప్పండి. అన్ని ఏర్పాట్లుచేస్తాను అని ప్రజలకు పిలుపునిచ్చారు. దిగ్విజయ్ వ్యాఖ్యలను గుర్తుచేశారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్ 370పై నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే, బయటకు వచ్చిన తర్వాత వాళ్ల పార్టీ నాయకులే ఒక్కొక్కరు మద్దతు పలికారని మోడీ



గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల మాదిరిగానే, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్-ఎన్‌సీపీ దారుణ పరాజయాన్ని చవిచూస్తాయని, ప్రజలు వారిని మరొకసారి శిక్షిస్తారని అన్నారు. హర్యానాలోనూ వారికి ఇదే పరిస్థితి ఎదురవుతుందని జోస్యం పలికారు.

### చంద్రుడిపై ప్లాట్లు తప్ప..
### వాళ్ల హామీలకు హద్దేలేదు: ఫడ్నవిస్

కాంగ్రెస్-ఎన్‌సీపీ జాయింట్ ఎన్నికల మేనిఫెస్టోపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ విమర్శలు గుప్పించారు. సాధ్యం కాని హామీలతో ఓటర్లను మోసగించేందుకు విపక్ష కూటమి సిద్ధమైందని ఆరోపించారు. గురువారం నాగపూర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఫడ్నవిస్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఎన్‌సీపీ మేనిఫెస్టోపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వారి ఎన్నికల హామీల్లో రెండే అంశాలు మిగిలాయి. ఒకటి.. ఇంటికొక తాజ్‌మహల్ కట్టించి ఇవ్వడం, రెండవది.. ప్రతి కుటుంబానికి చంద్రమండలంపై ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడం అంటూ చురకలు వేశారు. కొద్ది రోజుల కిందట కాంగ్రెస్-ఎన్‌సీపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో అన్నివర్గాలకు ప్రాధాన్యత ఇచ్చారు. రైతులకు భరోసా ఇచ్చే పథకాలు, నిరుద్యోగులకు నెలకు రూ.5000 అలవెన్స్, అందరికీ వైద్యం, కనీస వేతనాన్ని రూ 21000లకు పెంచడం వంటి హామీలు ఇచ్చారు. ఇంటిపన్ను రద్దు, నరేగా ద్వారా ఏడాదికి 200 రోజులు పనికల్పించడం వంటి వాగ్దానాలు చేసింది. కాగా, బీజేపీ కూడా యువత, రైతులకు ప్రాధాన్యమిచ్చేలా మేనిఫెస్టోను రూపొందించింది. వచ్చే ఐదేళ్లలో కోటి ఉద్యోగాలు కల్పించడం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడం, 2022 నాటికి ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి హామీలు ఇచ్చింది.

### కాంగ్రెస్‌కు మతి పోయింది: రాజ్‌నాథ్

ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నిప్పులు చెరిగారు. గురువారం హర్యానా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన కాశ్మీర్ అంశంపై ప్రతిపక్షాన్ని తూర్పారబట్టారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా దీన్ని అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. వారికి మతి భ్రమించిందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు లండన్‌లో లేబర్ పార్టీ నేత జెరెమి కార్బిన్‌తో భేటీ కావడాన్ని రాజ్‌నాథ్ ప్రస్తావించారు. వీరి సమావేశంలో కాశ్మీర్ అంశం ప్రస్తావించారని, అక్కడ మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని ఆరోపించారని చెప్పారు. మానవ హక్కుల అణచివేత ఎక్కడ జరుగుతుందో కాంగ్రెస్ నేతలు చూపించాలని నిలదీశారు.

సామాన్య పౌరులు, సైనికులపై తీవ్రవాదులు దాడులకు తెగబడినప్పుడు హక్కుల ఉల్లంఘన జరిగింది. అప్పుడు దీనిపై మీరెందుకు మాట్లాడలేదు? అంటూ కాంగ్రెస్‌ను సూటిగా ప్రశ్నించారు. కాశ్మీర్ మన అంతర్గత విషయం. దీనిపై మీరు సరిహద్దులకు అవతల మాట్లాడతారా? విదేశాల్లో దీనిపై చర్చిస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తీవ్రవాద దాడుల కారణంగా కాశ్మీర్‌లో అనేకమంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో ఈ సమస్యను తేలిగ్గా తీసుకోవడం సమస్య జఠిలమైందని మండిపడ్డారు. ఈ దీనావస్థకు కాంగ్రెస్సే కారణమని రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు.

## బీజేపీ-జేడీయూ దోస్తీ



**పాట్నా:** వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో పోటీపై కేంద్ర హోంశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీ(యూ) కూటమిగా పోటీ చేస్తాయని, దీనికి సీఎం నితీష్ కుమారే నాయకత్వ బాధ్యతలు చేపడతారన్నారు. అమిత్ షా ప్రకటనతో బీహార్ అసెంబ్లీ ఎన్నికల పొత్తుపై స్పష్టత వచ్చినట్టయ్యింది. బీహార్‌లో బీజేపీ, జేడీ(యూ) మధ్య ఉన్న మనస్పర్థలు దీంతో తొలిగిపోయాయి. ఓ జాతీయ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక విషయాలు వెల్లడించారు. బీజేపీ-జేడీ(యూ) బంధం విడదీయరాని దని, ఐక్యంగానే ఎన్నికల్లో పోటీ చేస్తాం. నితీష్ సారథ్యంలోనే ఎన్నికలకు వెళ్తాం. ప్రధాని మోడీ నాయకత్వంలో రెండు పార్టీలు పని చేస్తున్నాయన్నారు. 2020 తర్వాత కూడా నితీష్ కుమారే సీఎంగా కొనసాగుతారని షా తేల్చి చెప్పారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల గురించి షా ప్రస్తావించారు. శివసేన లేకుండా బీజేపీ ఒంటరిగా మెజార్టీ సాధించలేదని స్పష్టం చేశారు. కూటమికి మూడో వంతు మెజార్టీ వస్తుందన్నారు.

### సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి

భారత్ దృక్కోణంలో దేశ చరిత్రను ప్రతీ భారతీయుడు తిరిగి రాయాల్సిన అవసరం ఉందని హోంశాఖ మంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. 1857 సిపాయిల తిరుగుబాటును ఆంగ్లేయుల తొలి తిరుగుబాటుగా గుర్తిస్తారు.. కానీ దాన్ని స్వాతంత్ర్య సమరంలో భాగంగా తొలి ఉద్యమ కోణంలో చూడాల్సిన అవసరం ఉందన్నారు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటును వినాయక్ దామోదర్ సావర్కర్ ఓ స్వాతంత్ర్య ఉద్యమ కోణంలోనే చూశారు. సావర్కర్‌కు భారతరత్న ఇవ్వాలి. 1857 సిపాయిల తిరుగుబాటు గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. లేదంటే స్వాతంత్ర్యోద్యమాన్ని సిపాయిల తిరుగుబాటుగానే భావిస్తారని వ్యాఖ్యానించారు. వారణాసిలో బెనారస్ హిందూ యూనివర్సిటీలో 2 రోజుల పాటు జరగనున్న 'గుప్తవంశక్-వీర్ : స్కంద్‌గుప్త విక్రమాదిత్య" అంతర్జాతీయ సెమినార్‌ను అమిత్‌షా ప్రారంభించారు. భారతదేశ కోణంలో చూసి ఎవరినీ కించపర్చకుండా ప్రతీ ఒక్కరు చరిత్రను తిరగారాయాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

## సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

- 35 మంది విదేశీ యాత్రికుల మృతి

**రియాద్:** సౌదీఅరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం మదీనాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేటు బస్సు, భారీ ఎక్స్‌వేటర్ ఢీకొన్నాయి. గురువారం జరిగిన దుర్ఘటనలో మొత్తం 35 మంది విదేశీయులు మృత్యుపడ్డారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రైవేటు చార్టెడ్ బస్సు, భారీ ఎక్స్‌వేటర్ ఢీకొన్నాయి. దీంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల్లోనే భారీగా మంటలు ఎగసిపడడంతో అనేకమంది అగ్నికి ఆహుతయ్యారని పోలీసులు వివరించారు. మృతుల్లో అరబ్, ఆసియాకు చెందిన యాత్రికులు ఉన్నారని వివరించింది. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించాం. ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నామని మదీనా పోలీసులు వివరించారు. ఇదిలావుండగా సౌదీలో జరిగిన దుర్ఘటనపై ప్రధాని మోడీ, విదేశాంగమంత్రి జైశంకర్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. బస్సు ప్రమాదం వార్త విని విచారానికి గురయ్యానని ప్రధాని మోడీ ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.



## 'మధ్యవర్తిత్వం'తో ఇద్దరి గెలుపు

**న్యూఢిల్లీ:** రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదం విషయంలో సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కమిటీని సెప్టెంబర్‌లో ఏర్పాటు చేసిందని, దీనిపై ఆ ప్యానెల్ సూచించిన పరిష్కార మార్గాల ప్రణాళిక అటు హిందువులు, ఇటు ముస్లిముల గెలుపుగానే భావించొచ్చని సున్నీ వక్ఫ్ బోర్డు తరపు న్యాయవాది షాహిద్ రిజ్వీ చెప్పుకొచ్చారు. తమ ఆలోచనలను కూడా మధ్యవర్తిత్వ ప్యానెల్‌కు తెలియజేయడం జరిగిందని, అదేంటో ఇప్పుడు చెప్పలేమని, ఎందుకంటే సెటిల్‌మెంట్ ప్లాన్ ఇప్పుడు కోర్టులో ఉందని తెలిపారు. మంచి విషయాల్లో ఎప్పుడూ ఆలస్యం చేయవద్దని చెప్పుకొచ్చాడు. ప్యానెల్‌లో ప్రస్తావించిన అంశాలు మాత్రం ఇరు వర్గాలకు ఎంతో ఆమోదయోగ్యంగా, సంతోషకరంగా ఉంటాయని మాత్రం చెప్పగలనని రిజ్వీ వివరించారు. వివాదాస్పద ఆలయ-మసీదు స్థలం విషయంలో జరుగుతున్న వాదనల నుండి తప్పుకోవాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. రామ మందిర నిర్మాణం కోసం భూమి ప్రభుత్వం తీసుకోవడంలో బోర్డుకు ఎలాంటి అభ్యంతరం లేదని సమాచారం. ఇదే సుప్రీం కోర్టుకు మధ్యవర్తిత్వ ప్యానెల్ సమర్పించిన నివేదికలో ఉన్నట్టు తెలుస్తోంది. ధ్వంసమైన బాబ్రీ మసీదు ఉన్న స్థలాన్ని వదులుకోవడంతో పాటు అయోధ్యలో ఉన్న మసీదులను ప్రభుత్వమే పునరుద్ధరించాలని వక్ఫ్ బోర్డు కోరినట్టు సమాచారం. ఇంకా ఎక్కడైనా అనువైన ప్రదేశంలో మసీదు నిర్మాణం చేసి ఇస్తే సరిపోతుందనే అభిప్రాయాన్ని సున్నీ వక్ఫ్ బోర్డు ప్యానెల్‌కు తెలియజేసినట్టు తెలుస్తోంది.



# 5 ట్రిలియన్ డాలర్లు అసాధ్యం

- దేశ ఆర్థిక వ్యవస్థపై మన్మోహన్ సింగ్ ఆందోళన
- గాడిన పెట్టాల్సింది పోయి విమర్శలా..?
- మోడీ, నిర్మలా సీతారామన్‌పై ఆగ్రహం
- ఎన్‌డీఏ హయాంలో ఆటో రంగం కుదేలు
- రైతు ఆత్మహత్యలు పెరిగాయ్

**ముంబై:** బ్యాంకుల పరిస్థితి ప్రస్తుతం ఇంతగా దిగజారడానికి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఆర్‌బీఐ గవర్నర్ రఘురామ్ రాజన్‌లే కారణమంటూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై, దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనంపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గురువారం స్పందించారు. ప్రజా ప్రయోగ విధానాలకు తాము వ్యతిరేకం అని నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలను బట్టి తెలుస్తోందని సర్దార్ జీ చెప్పుకొచ్చారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ముంబైలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మన్మోహన్ సింగ్ మాట్లాడారు. యూపీఏ ప్రభుత్వం ఫోన్‌లపై ఇష్టారీతిన వేల కోట్ల రుణాలు ఇచ్చిందంటూ నిర్మలా సీతారామన్ విమర్శించడం సరికాదన్నారు. ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించిన మాత్రానా దేశ ఆర్థిక వ్యవస్థ గాడినపడదని చెప్పుకొచ్చారు. దేశంలోని బ్యాంకుల పరిస్థితి హీనంగా తయారైందని, ఆటో రంగం కుదేలైందని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. ఉద్యోగాల కోసం యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, వీటిని పరిష్కరించాల్సింది పోయి యూపీఏ ప్రభుత్వంపై విరుచుకుపడటం సరికాదని హితవు పలికారు.

### ప్రతీ ఏడాది వృద్ధిరేటు డౌన్

దేశంలో నెలకొన్న ఇలాంటి విపత్కర పరిస్థితుల దృష్ట్యా 2024 నాటికి భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడం అసంభవం అన్నారు. ప్రతీ ఏడాది వృద్ధి రేటు పడిపోతూ వస్తోందని, ఆర్థిక మందగమనాన్ని అడ్డుకుంటేనే వృద్ధి రేటు పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ ప్రజల జీవన విధానం చిన్నాభిన్నం అవుతోంది. మోడీ నిర్ణయాలు రైతులు ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు అవుతున్నాయి. 2018లో తమ దేశ ఆర్థిక వ్యవస్థ 2.7 ట్రిలియన్ డాలర్‌లుగా ఉంది. 2024 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవాలంటే జీడీపీ 10



నుంచి 12 శాతం ఉండాలి. కానీ బీజేపీ పాలనలో ప్రతి ఏటా అభివృద్ధి వ్యతిరేక దిశలో ప్రయాణిస్తోందని మండిపడ్డారు.

### 7.3 నుంచి 6.1 శాతమే సాక్ష్యం

కొన్ని నెలల క్రితం 7.3 శాతం ఉన్న జీడీపీ ఇప్పుడు 6.1 శాతానికి పడిపోయిందని, ఈ విషయాన్ని ఇంటర్‌నేషనల్ మానిటరీ ఫండ్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ స్వయంగా వెల్లడించిందని తెలిపారు. ఆర్థిక మందగమనం ఫలితంగా ముంబైపై తీవ్ర ప్రభావం పడిందని, ఆటో రంగం పూర్తిగా నాశనమైందని, రాష్ట్రంలో ప్రతీ మూడో వ్యక్తి ఉద్యోగం కోసం అలమటిస్తున్నాడని ఆరోపించారు. పెట్టుబడి దారులు కూడా మహారాష్ట్ర విడిచి వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారని, అయినా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు మాత్రం చీమ కుట్టినట్టు కూడా లేదని ధ్వజమెత్తారు. వృద్ధి రేటు 8 నుంచి 8.5 శాతం ఉంటే 2020-21 కల్లా భారత్ 5 ట్రిలియన్ డాలర్ల వ్యవస్థకు చేరుకుం టుందని నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ ప్రకటించారని సింగ్ గుర్తు చేశారు.

మహారాష్ట్రలో రైతులు ఆత్మహత్య చేసుకో వడానికి కారణం మోడీయే అంటూ విమర్శించారు. ప్రతిభావం తులైన అందరినీ మహారాష్ట్ర తనవైపు తిప్పుకునేది అని, కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ఫ్యాక్టరీలు, ఇండస్ట్రీలు మహారాష్ట్ర నుంచి వెళ్లిపోతున్నాయని, వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోందని, దీనికి కారణం ప్రధాని మోడీ తీసుకొచ్చిన ఆర్థిక విధానాలే అని మండిపడ్డారు. కేంద్రంతో పాటు మహారాష్ట్రలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకోవ డానికి ఇష్టపడకపోవడం దురదృష్టకరమని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహారాష్ట్రలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు.

### పీఎంసీను ఆదుకోవాలి

మన్మోహన్ సింగ్ను పంజాబ్ మహారాష్ట్ర సహకార బ్యాంకు (పీఎంసీ) డిపాజిటర్ల బృందం కలిసింది. పీఎంసీ బ్యాంకు విషయంలో జరిగిన పరిణామాలు చాలా దురదృష్టకరమని మన్మోహన్ అన్నారు. దాదాపు 16 లక్షల మంది ఖాతాదారులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించాలని ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను ఆయన కోరారు.

### ప్రధానిగా మీరేం చేశారు..?



ఎన్‌డీఏ ప్రభుత్వ పాలన, మోడీపై మన్మోహన్ వ్యాఖ్యలపై మంత్రి పీయూష్ గోయల్ ఘాటుగా స్పందించారు. యూపీఏ పాలనలో చేసిన తప్పులే ఇప్పుడు దేశాన్ని ఈ పరిస్థితికి తీసుకొచ్చాయి. ప్రధానిగా ఉన్న సమయంలో తీసుకొచ్చిన ఆర్థిక పాలసీల గురించి ముందు మన్మోహన్ తెలుసుకోవాలి. కాంగ్రెస్ తప్పిదాలు మోడీ ప్రభుత్వంపై రుద్దడానికి ప్రయత్నిస్తే ఎవరూ చూసుకుంటూ ఊరుకోరు. సరైన దిశలో మన్మోహన్ దేశ ఆర్థిక వ్యవస్థను తీసుకెళ్లలేదు. బలమైన ఆర్థికపరమైన పాలసీలు తీసుకురాలేదు. నిజాయితీగల ప్రభుత్వ పాలన ఎందుకు అందించలేదు. ఎందుకు నిస్సాహాయ స్థితిలో కొట్టుమిట్టాడరని మన్మోహన్‌ను గోయల్ ప్రశ్నించారు.

దిగ్గజాలను గౌరవించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో యువ క్రీడాకారులకు అన్యాయం జరగడం విస్మరించరాదు. ఇటీవల బాక్సింగ్ క్రీడలో ఈ ధోరణులు మితిమీరుతున్నాయి. మేరీ కోమ్ జగమెరిగిన లేడీ బాక్సర్. అందుకే అంతర్జాతీయ పోటీలకు ట్రయల్స్ లేకుండానే ఆమెను ఎంపిక చేయడం పరిపాటి. అయితే అది ఇతర బాక్సర్ల ఎంపికకు అవరోధంగా మారుతోంది. తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ ఇందుకు తార్కాణం. ఆమెను కాదని మేరీ కోమ్‌ను ప్రపంచ చాంపియన్‌షిప్‌కు ఎంపిక చేశారు. ఇపుడు అదే తరహాలో ఒలింపిక్స్ బెర్త్‌నుకూడా ఆమెకే కేటాయించడంపై నిఖత్ గళం విప్పి న్యాయం అడుగుతోంది. దీనికి క్రీడా పెద్దలు ఏమంటారో...



# ట్రయల్స్ నిర్వహించండి

## కేంద్ర క్రీడా మంత్రికి తెలంగాణ బాక్సర్ నిఖత్ వినతి



**న్యూఢిల్లీ:** భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) మరోసారి తెలంగాణ స్టార్ బాక్సర్, జూనియర్ ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌కు షాకిచ్చింది. ఇటీవల రష్యాలో జరిగిన ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 51 కేజీల విభాగంలో మేరీకోమ్‌ను ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేసిన బీఎఫ్ఐ ఇప్పుడు తాజాగా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లోనూ ఆమెకు సెలక్షన్ ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 51 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించిన మేరీకోమ్‌తో పాటు ఇతర వెయిట్ కేటగిరిల్లో పతకాలు సాధించిన బాక్సర్లను సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించకుండానే ఎంపిక చేస్తున్నామని తాజాగా బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపాడు. దీంతో ఇదే వెయిట్ కేటగిరిలో ఉన్న తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ హతాశురాలైంది. సెలక్షన్ ట్రయల్స్ లేకుండా ఒలింపిక్స్ క్వాలిఫాయింగ్ బెర్త్‌ను మేరీకోమ్‌కు అందించడంపై తెలంగాణ బాక్సర్ అసంతృప్తి వ్యక్తం చేసింది. తన వెయిట్ కెటగిరిలోనూ సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజుకు నిఖత్ లేఖ రాసింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఇంటికే పరిమితమయ్యాను, ఇప్పుడు ఒలింపిక్స్ ట్రయల్స్ నుంచి కూడా తనను దూరం చేయడం సరికాదని నిఖత్ ఆవేదన వ్యక్తంచేసింది. ఒలింపిక్స్ పోటీల కోసం చాలా కష్టపడుతున్నానని, ఇప్పుడు పోటీలేకుండానే మరొకరిని ఎంపిక చేస్తున్నామని చెప్పడం ఎంతవరకు న్యాయమని నిఖత్ ప్రశ్నించింది. ఫెయిర్ ప్లే లేకుండా గత మ్యాచ్‌ల ఆధారంగా ఒకరిని ఎంపిక చేయడం సబబు కాదని, ఇద్దరి మధ్య పోటీ నిర్వహించి ఎవరూ మెరుగైన ప్రదర్శన చేస్తారో వారిని తీసుకోవడం సరైన పద్ధతిగా భావిస్తున్నానని జరీన్ పేర్కొంది. ఇలా యువ క్రీడాకారులను తక్కువ అంచనవేసి వారి మనోభావాలను దెబ్బతీసి వారి భవిష్యత్తుతో ఆడుకోవద్దని ఆమె విన్నవించింది. అమెరికా స్టార్ స్విమ్మర్ మైఖేల్ ఫిలిప్స్ 23 బంగారు పతకాలు సాధించినా ప్రతిసారి సెలక్షన్ ట్రయల్స్‌లో పోటీ పడతాడని జరీన్ తెలిపింది. ఇక తనకు కూడా దిగ్గజ బాక్సర్ మేరీకోమ్‌తో ట్రయల్స్ నిర్వహించాలని జరీన్ డిమాండ్ చేసింది. తనకు మేరీకోమ్‌తో ఎలాంటి విబేధాలు లేవన్నది. చిన్నపటి నుంచి ఆమెను చూస్తూ పెరిగానని, బాక్సింగ్‌లో రావడానికి ఆమెనే తనకు ప్రేరణని, మేరీకోమ్‌లాగా తాను కూడా దేశానికి పతకాలు అందించాలన్నదే తన కోరికని నిఖత్ పేర్కొంది. భారత స్టార్ మేరీకోమ్ అంతర్జాతీయ వేదికలపై తనదైన ముద్ర వేసుకుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అత్యధిక పతకాలు సాధించిన ఏకైక బాక్సర్‌గా ఆమె ప్రపంచ రికార్డు సృష్టించింది. అయితే గతంలో 48 కిలోల విభాగంలో పోటీ చేసిన మేరీకోమ్ ఇప్పుడు 51 కిలోలకు మారింది. టోక్యో ఒలింపిక్స్‌లో 48 కిలోల వెయిట్ కేటగిరి లేకపోవడంతో మేరీకోమ్ 51కిలోల విభాగాన్ని ఎంచుకుంది. అయితే ఈ కేటగిరిలో తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్ కూడా ఉండడంతో సమస్య వచ్చింది. మేటి బాక్సర్ కావడంతో మేరీకోమ్‌కు పెద్ద టోర్నీలలో ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ ట్రయల్స్ లేకుండా బరిలోకి దిగిన మేరీకోమ్ కాంస్య పతకం సాధించింది. దాంతో పాటు ఈ మెగా చాంపియన్‌షిప్‌లో అత్యధికంగా 8 పతకాలు సాధించిన తొలి బాక్సర్‌గా కొత్త చరిత్ర సృష్టించింది. ఇక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చైనా వేదికగా ఒలింపిక్స్ క్వాలిఫాయింగ్ పోటీలు జరగనున్నాయి. అయితే ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన భారత బాక్సర్లకు ట్రయల్స్ లేకుండానే ఎంపిక చేస్తున్నామని భారత సమాఖ్య వెల్లడించింది.

### జరీన్‌కు బింద్రా మద్దతు..

భారత్‌కు ఒలింపిక్స్‌లో వ్యక్తిగత విభాగంలో ఏకైక స్వర్ణ పతకాన్ని అందించిన షూటర్ అభినవ్ బింద్రా తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్‌కు అండగా నిలిచాడు. ఒలింపిక్స్ క్వాలిఫైయర్స్ కోసం మేరీకోమ్‌తో తనకు ట్రయల్స్ బౌట్ నిర్వహించాలని నిఖత్ చేసిన డిమాండ్‌ను బింద్రా సమర్థించాడు. ఏ క్రీడాలోనైన ఫెయిర్ ప్లే అనేది తప్పనిసరని, ఆటగాడి సమార్థ్యాన్ని పరీక్షించడానికి ఇది ఎంతో అవసరమని బింద్రా అన్నాడు. మేరీకోమ్ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని, కానీ ఆమె కూడా ఓ అథ్లెట్‌గా తనను తాను రుజువు చేసుకోవాల్సిన అవసరం ఉందని బింద్రా పేర్కొన్నాడు.

# మోడీ - ఇమ్రాన్‌లను అడగండి

## ఇండో-పాక్ క్రికెట్ సంబంధాలపై గంగూలీ



**కోల్‌కతా :** భారత క్రికెట్ నియంత్రణ (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ నియామకం ఖాయం అయింది. అక్టోబర్ 23న జరిగే బీసీసీఐ సర్వసభ్య సమావేశంలో గంగూలీని అధ్యక్షునిగా ప్రకటించనున్నారు. ఈ సందర్భంలో గంగూలీ ఇండియా-పాక్ క్రికెట్ సంబంధాలపై చొరవ తీసుకునే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు భావిస్తున్నాయి. ఈ మేరకు గంగూలీ గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సమస్యకు పరిష్కారం ఇరు దేశాల ప్రధానుల అమోదంపై ఆధారపడి ఉందన్నాడు. ఆ విషయాన్ని వారే తెలియజేయాలన్నాడు. విలేకరులు గుచ్చిగుచ్చి అడుగగా, విదేశీ పర్యటనలకు ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి అని, అందువల్ల ఇండో-పాక్ క్రికెట్ సంబంధాల పునరుద్ధరణకు సంబంధించిన ప్రశ్నలను మోదీ, ఇమ్రాన్‌లను అడగాలని సూచించాడు. ఈ ప్రశ్నకు తమవద్ద సమాధానం లేదని, ప్రధానులే నిర్ణయం తీసుకోవాలన్నాడు.

ఇరు దేశాలమధ్య ద్వైపాక్షికసిరీస్ చివరిసారిగా 2012లో జరిగింది. పాకిస్తాన్ జట్టు భారత్‌లో పర్యటించిన ఆ సిరీస్‌లో రెండు టి20లు, మూడు వన్డేలు నిర్వహించారు. 1989లో చివరిసారి భారత జట్టు గంగూలీ నేతృత్వంలో పాకిస్తాన్ పర్యటించింది. 1989లో కార్గిల్ వార్, పుల్వామాలో తీవ్రవాదాల దాడులతో ఇరు దేశాలమధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. తటస్థ వేదికలపై అంతర్జాతీయ టోర్నీలు మినహా ద్వైపాక్షిక సిరీస్‌లకు తెరపడింది. బోర్డు స్థానంలో పాలక మండలి(సీఓఏ) నియామకం తరువాత తీవ్రవాదానికి స్వస్తి చెపితేనే ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలు పునరుద్ధరణకు నోచుకోవని తేల్చిచెప్పింది. అంతేగాక ప్రపంచకప్‌నుంచి పాకిస్తాన్‌ను తొలగించాలనికూడా బీసీసీఐ ఐసీసీకి లేఖ రాసింది. అయితే ఇరు దేశాలమధ్య క్రీడా సంబంధాలు మెరుగుపరచుకోవాలని ఐసీసీ పలుమార్లు సూచించింది.

### మైదానంలోకి మళ్లీ మాజీలు..



రోడ్డు భద్రతా ప్రపంచ సిరీస్ టి20 టోర్నీ వివరాలు ప్రకటించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయా దేశాల దిగ్గజ ఆటగాళ్లు జాంటీ రోడ్స్, వీరేంద్ర సెహ్వాగ్, తిలకరత్నె దిల్షన్, సచిన్ టెండూల్కర్, బ్రయాన్ లారా, బ్రెట్ లీ.

## మరో బాక్సర్ మృతి



**చికాగో:** బాక్సింగ్ రింగ్‌లో మరో బాక్సర్ కన్నుమూశాడు. కొన్ని నెలల క్రితమే ఇద్దరు బాక్సర్లు ప్రత్యర్థుల ముష్టిఘాతాలకు కుప్పకూలగా ఇప్పుడు తాజాగా 27 ఏళ్ల అమెరికన్ ప్రొఫెషనల్ బాక్సర్ పాట్రిక్ డే తీవ్రగాయాలపాలై నాలుగు రోజులు మృత్యుతో పొరాడి చివరికి తుది శ్వాస విడిచాడు. శనివారం చికాగోలో జరిగిన జూనియర్ మిడిల్ వెయిట్ చాంపియన్‌షిప్‌లో చార్లస్ కాన్‌వెల్‌తో పాట్రిక్ డే తలపడ్డాడు. అయితే చార్లస్ విసిరిన బలమైన పంచ్‌లను పాట్రిక్ ఎదుర్కొనలేక రింగ్‌లోనే కుప్పకూలాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అతన్ని వెంటనే అసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పాట్రిక్ మెదడులో రక్తం గడ్డ కట్టడంతో అతను కోమాలోకి వెళ్లిపోయాడు. శాస్త్ర చికిత్సలు చేసినా లాభం లేకుండా పోయింది. నాలుగు రోజులు మృత్యుతో పోరాడిన పాట్రిక్ డే చివరికి బుధవారం తుది శ్వాస వదిలాడని అతని ప్రమోటర్ డిబెల్లా తెలిపాడు. ఇటీవల రష్యా బాక్సర్ మాక్సిమ్ దదషెవ్, అర్జెంటీనా బాక్సర్ హూగో సాంతిల్లాన్‌లు కూడా రింగ్‌లో ఇదే తరహాలో గాయపడి మృత్యువాత పడ్డారు. మంచి భవిష్యతు ఉంటుందని ఈ క్రీడను ప్రొఫెషనల్‌గా ఎంచుకుంటున్న బాక్సర్లకు అదే శాపంగా మారుతోంది.

# నిరాశపరిచిన షట్లర్లు

## రెండో రౌండ్‌లోనే ముగిసిన భారత్ పోరాటం

డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్



**ఓడెన్స్:** డెన్మార్క్ ఓపెన్‌లో భారత షట్లర్లు పేలవమైన ఆటతో నిరాశ పరిచారు. ప్రపంచ చాంపియన్ సింధుతో పాటు ఇతర షట్లర్లు సైతం రెండో రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టారు. దీంతో డెన్మార్క్ ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో వరల్డ్ చాంపియన్, ఐదో సీడ్ పీవీ సింధు 14-21, 17-21తో దక్షిణ కోరియా యువ షట్లర్ 17 ఏళ్ల ఆన్సె యంగ్ చేతిలో వరుస గేముల్లో ఓడింది. దీంతో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన సింధు రెండో రౌండ్‌లోనే ఇంటి ముఖం పట్టింది. ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన సింధు ఆ తర్వాత టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనలు చేయలేక పోతుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సింధు టీనేజర్ ప్రత్యర్థి ముందు 40 నిమిషాలు కూడా నిలబడలేక పోయింది. ఇక పురుషుల సింగిల్స్‌లోనూ భారత్‌కు నిరాశే ఎదురైంది. తొలి రౌండ్‌లో దిగ్గజ ఆటగాడు లిన్ డాన్‌ను ఓడించి సంచలనం సృష్టించిన సాయి ప్రణీత్ రెండో రౌండ్‌లో మాత్రం 6-21, 14-21తో ప్రపంచ నెంబర్‌వన్ కెంటో మొమోటా (జపాన్) చేతిలో వరుస గేముల్లో చిత్తయ్యాడు. మరో మ్యాచ్‌లో సమీర్ వర్మ 12-21, 10-21తో చైనా స్టార్ ఐదో సీడ్ చెన్ లాంగ్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

### డబుల్స్‌లోనూ..

డబుల్స్‌లోనూ భారత జోడీలు నిరాశ పరిచాయి. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 16-21, 15-21తో ఆరో సీడ్ చేనా జంట హాన్ చెంగ్ కాయి-జౌ హౌ డాంగ్ చేతిలో ఓడారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ చోప్రా-సిక్కి రెడ్డి ద్వయం 24-26, 21-13, 11-21తో నాలుగో సీడ్ మలేసియా జోడీ చాన్ పెంగ్ సూన్-గో లీ యింగ్ చేతిలో ఓటమితో టోర్నీ నుంచి వైదొలిగింది.

# జట్టులో మార్పులు ఉంటాయా?

(ఆంధ్రప్రభ క్రీడావిభాగం)

టెస్టు క్రికెట్‌లో టీమిండియా అప్రతిహతంగా సాగుతోంది. పాయింట్ల పట్టికలో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. కొన్ని దేశాలమధ్య ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్ ఆరంభం కానప్పటికీ భారత జట్టు ర్యాంకింగ్‌కు ఇప్పుడే వచ్చిన ఢోకా ఏమీలేదు. దక్షిణాఫ్రికాతో స్వదేశంలో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇప్పటికే 2-0తో గెలుచుకుంది. శనివారంనుంచి ఆరంభం కానున్న మూడో టెస్టులోనూ విజయం సాధించి సిరీస్ క్లీన్‌స్వీప్ చేయాలని భావిస్తున్నది. కెప్టెన్ కోహ్లీ జట్టులో మార్పులు చేస్తాడా....లేక గత రెండు టెస్టులలో విజయాలు కట్టబెట్టిన జట్టునే కొనసాగిస్తాడా అన్నది ప్రశ్నార్థంగా మారింది.

జార్ఖండ్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్టేడియంలో ఇప్పటివరకు ఒకే ఒక టెస్టును నిర్వహించారు. 2017 మార్చిలో ఆస్ట్రేలియాపై ఇక్కడ భార జట్టు తలపడింది. ఓటమి కోరల్లో చిక్కిన ఆసీస్ చివరి రోజు రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజాలను కాచుకుని మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ప్రస్తుత సిరీస్ గమనాన్ని పరిశీలిస్తే దక్షిణాఫ్రికాకు ఆ అవకాశం కనిపించడంలేదు. ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన జట్టు చివరి మ్యాచ్‌ను డ్రా చేసుకుంటే గొప్పే. తొలి టెస్టులో....పరుగులు తేడాతో ఓడిన సౌతాఫ్రికా, రెండో టెస్టులో ఘోరంగా ఇన్నింగ్స్ తేడాతో పరాజయం మూటగట్టుకుంది. ఇపుడు చివరి టెస్టులో భారత్ ఎంత తేడాతో గెలుస్తుందనేదే అందరూ ఊహిస్తున్నది.

భారత విజయాలలో బ్యాట్స్‌మెన్, బౌలర్లు సమ పాత్ర వహించారు. ముఖ్యంగా బ్యాట్స్‌మెన్ రెచ్చిపోయి పరుగులు సాధిస్తే, బౌలర్లు తమ వంతుగా ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ పనిబట్టారు. భారత ఆటగాళ్లు విజయవంతమైనచోటే దక్షిణాఫ్రికా ఆటగాళ్లు విఫలమవడం గమనార్హం. ఎంత సొంత మైదానాల్లో ఆడుతున్నా భారత్‌కు ఉన్న అవకాశాలే దక్షిణాఫ్రికాకూ ఉన్నాయి. కానీ ఒకప్పుడు నంబర్‌వన్ స్థాయికి తగ్గ ఆటను ప్రదర్శించడంలో దక్షిణాఫ్రికా విఫలమైంది. భారత బౌలర్లలో స్పిన్నర్లు అశ్విన్ 14, జడేజా 10 వికెట్లతో రాణించగా, షమి 8, ఉమేశ్ 6 వికెట్లతో సహకరించారు. విశాఖపట్నం, పుణె పిచ్‌లు స్పిన్నర్లకు అంత సహాయకారులు కానప్పటికీ మన బౌలర్లు వాటిపై టర్న్ రాబట్టి పైచేయి సాధించారు. ఇక రాంచీలోనూ భారత జట్టు అయిదుగురు బౌలర్ల ఫార్ములాను అనుసరించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. సిరీస్ ఫలితం తేలింది కనుక ఏదైనా అవకాశముంటే అది కుల్‌దీప్ యాదవ్‌కు మాత్రమే. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని టీమ్ మేనేజ్‌మెంట్ చివరి టెస్టులో ఒకటి రెండు మార్పులు చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు.

**జట్టు :** విరాట్ కోహ్లీ(కెప్టెన్), అజింక్య రహానె, మయాంక్ అగర్వాల్, చతేశ్వర్ పుజారా, హనుమ విహారి, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్, వృద్ధిమాన్ సాహా, రిషభ్ పంత్, రవిచంద్రన్ అశ్విన్, ర వీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్, మహ్మద్ షమి, ఉమేశ్ యాదవ్, ఇషాంత్ శర్మ.





## భద్రతా సిబ్బందికి ఉచిత టికెట్లు

**రాంచి :** భద్రతా విధులు నిర్వర్తించే వారికి దాదాపు అయిదువేల టిక్కెట్లను ఉచితంగా అందజేయ నున్నట్టు జార్ఖండ్ క్రికెట్ సంఘం (జేఎస్‌సీఏ) తెలిపింది. సిఆర్‌పీఎఫ్, ఆర్మీ, ఎన్‌సీసీ, ఇతర భద్రతా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఉచితంగా టిక్కెట్లను అందజేయనున్నామని జేఎస్‌సీఏ కార్యదర్శి సంజయ్ సహాయ్ వెల్లడించారు. ఇది భద్రత విధులు నిర్వర్తించే వారి గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. మూడో టెస్టుకోసం మరికొన్ని టిక్కెట్లను విద్యార్థులకు కేటాయించామన్నారు.

## ప్రపంచకప్‌కు దరఖాస్తు

**లాసానె :** పురుషుల హాకీ 2023 ప్రపంచకప్ నిర్వహణకోసం భారత్ దరఖాస్తు చేసినట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య(ఎఫ్ఐహెచ్) తెలిపింది. ఇండియాతోపాటు బెల్జియం, మలేసియాకూడా ఈ పోటీల నిర్వహణకు పోటీపడుతున్నట్టు తెలిఇపంది. కాగా మహిళల ప్రపంచకప్ నిర్వహణకు జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్, మలేసియా దరఖాస్తు చేసుకున్నట్టు ఎఫ్ఐహెచ్ తెలిపింది. తదుపరి ప్రపంచకప్ నిర్వహణకోసం దరఖాస్తు చేసుకున్న మూడు దేశాలలో ఇండియాకూడా ఉందని సమాఖ్య గురువారం వెల్లడించింది. ప్రపంచకప్ హాకీ టోర్నీని ఇప్పటికే మూడుసార్లు నిర్వహించిన ఇండియా 2023లో జనవరి 13-29 తేదీల మధ్య నిర్వహించాలన్న ఆసక్తిని ప్రదర్శిస్తోంది. కాగా బెల్జియం, మలేసియాలు 2022 జులై 1-17 తేదీలలో ఈ టోర్నీ నిర్వహణకు ఆసక్తి చూపినట్టు తెలిసింది.

మహిళల ప్రపంచకప్ నిర్వహణకు ఐదు దేశాలు బిడ్డింగ్ వేశాయి. జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్ 2022 జులూ 1-17 తేదీలలో ప్రపంచకప్ నిర్వహించాలని ఆసక్తి చూపుతుండగా, మలేసియా, న్యూజిలాండ్‌లు ఈ టోర్నీని 2023 జనవరి 13-29 తేదీలలో నిర్వహించాలని యోచిస్తున్నాయి. పలు దేశాలు అతర్జాతీయ టోర్నీల నిర్వహణకు ఆసక్తినిక కనబరచడం సంతోషంగా ఉందని, హాకీ అభివృద్ధికి ఇది శుభపరిణామమని ఎఫ్ఐహెచ్ సీఈవో థియర్రీ వీల్ అన్నారు. వచ్చే నెలలో ఎఫ్ఐహెచ్ టాస్క్ ఫోర్స్ సమావేశమై ఈ బిడ్లన్నింటినీ పరిశీలించి ఎగ్జిక్యూటివ్ బోర్డుకు సిఫారసు చేస్తుందని, త ఎగ్జిక్యూటివ్ బోర్డు నవంబర్ 8న సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటుందన్నారు.

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

epaper.prabhanews.com

lifepage2012@gmail.com



శుక్రవారం 18 అక్టోబర్ 2019

# మసాజ్ మంత్రం ఆరోగ్య తంత్రం ఆక్యుప్రెషర్ యంత్రం

ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చైనా అధ్యక్షుడు జీ-జిన్‌పింగ్‌తో తమిళనాడులోని మామళ్లపురంలో సమావేశమైన సంగతి తెలిసిందే. మామళ్లపురం బీచ్‌లో చెత్తని ఏరివేస్తూ తిరిగిన సమయంలో మోడీ చేతిలో ఒక చిన్న కర్ర లాంటి వస్తువు కనిపించింది. అది మీడియాని బాగా ఆకర్షించింది. దాని గురించి ఆయన తరువాత రోజు ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'నా చేతిలో వస్తువు ఏమిటని చాలామంది ఆసక్తిగా అడుగుతున్నారు. అది ఆక్యుప్రెషర్ రోలర్. నేను తరచుగా దానిని వాడుతుంటాను. అది నాకు చాలా ఉపయోగకరంగా అనిపిస్తోంది' అంటూ మోడీ దాని ప్రాధాన్యతని చెప్పుకొచ్చారు. నరేంద్ర మోడీ వాడిన రోలరే కాదు... మరిన్ని ఆక్యుప్రెషర్ వస్తువులు... మన ఆరోగ్యానికి మేలు చేసేవి.. మార్కెట్‌లో చాలా విరివిగా లభిస్తున్నాయి. ఆక్యుప్రెషర్‌పై అవగాహన పెంచే కొన్ని సంగతులు మీకోసం-

చైనావారి సాంప్రదాయ చికిత్సా విధానం ఆక్యుప్రెషర్. సూదులను శరీరానికి గుచ్చుతూ చేసే ఆక్యుపంక్చర్ లాంటిదే ఇది కూడా. ఏషియన్ బాడీ వర్క్ థెరపీల్లో ఆక్యుప్రెషర్ కూడా ఒకటి. జపాన్‌లో ఈ థెరపీనే షియాత్సు అనే పేరుతో చేస్తారు. మన శరీరంలో శక్తి ప్రవహించే ప్రధాన మార్గాలు 12 ఉంటాయని, వీటి ద్వారా 'చి' అనే ప్రాణశక్తి ప్రవహిస్తుందని సంప్రదాయ చైనా వైద్య విధానం చెబుతుంది. ఈ మార్గాలను మెరిడియన్స్ అంటారు. ఈ 12 మార్గాలు కొన్ని అవయవా లను



అనుసంధానం చేస్తాయని, ఈ మార్గాల వల్లనే శరీరమంతటిని అనుసంధానం చేసే ఒక కమ్యునికేషన్ వ్యవస్థ పనిచేస్తుందని అంటారు. ఈ మెరిడియన్స్ మన వేళ్ల కొసల నుండి మొదలై మెదడుకి, తరువాత ఆ మెరిడియన్‌కి చెందిన అవయవానికి కూడా అనుసంధానమై ఉంటాయి. ఈ మెరిడియన్లల్లో ఏదైనా మూసుకుపోయినా, బ్యాలన్స్ తప్పినా మనకు అనారోగ్యం కలుగుతుందని చైనావారి సంప్రదాయ వైద్య విధానం అంటుంది. ఆక్యుపంక్చర్ కానీ ఆక్యుప్రెషర్ కానీ...తిరిగి ఆ శక్తి ప్రవహించే చానల్‌ని బ్యాలన్స్ చేస్తాయి.

## 'చి' ప్రాణ శక్తిని ప్రవహించచేసి....

మామూలుగా అయితే ఆక్యుప్రెషర్ థెరపిస్టులు తమ బొటనవేళ్లు, ఇతర వేళ్లు, మోచేతులు, అరచేతులు, పాదాలు...కొన్నిరకాల పరికరాలు లాంటివి వాడుతూ...చికిత్స తీసుకునేవారి శరీరంపై భిన్న ప్రదేశాల్లో ఒత్తిడిని కలిగిస్తారు. థెరపిస్టులు...మసాజ్ చేసేటప్పుడు చేతులను వేళ్లను కదిలించడంలో ఒత్తిడిని రకరకాలుగా, కొన్ని రిథమ్స్‌లో కలిగిస్తారు. ఇలా శరీరంలోని కొన్ని పాయింట్ల వద్ద ఒత్తిడిని కలిగించడం ద్వారా...శరీరంలోని 'చి'....ప్రాణ శక్తి నిరంతరాయంగా ప్రవహిస్తుందని అంటారు. 'చి' ప్రాణశక్తి శరీరంలోని కొన్ని భాగాల్లో ఆగిపోవటం వలన ఆరోగ్యసమస్యలు వస్తాయని...ఆక్యుప్రెషర్ మసాజ్ అనే సహజమైన ప్రక్రియతో దానిని తిరిగి సవ్యంగా ప్రవహింపచేయటం వలన ఆరోగ్య సమస్యలు తొలగుతాయనేది ఈ చికి త్స ఉద్దేశ్యం. కొన్ని పాయింట్లపై ఒత్తిడిని కలిగించడమే కాకుండా, శరీరాన్ని సాగదీసే స్ట్రెచింగ్, ఆక్యుప్రెషర్ మసాజ్‌లను సైతం ఇందులో భాగంగా వాడుతుం టారు. ఆక్యుప్రెషర్ థెరపీలో భాగంగా థెరపిస్టు ఆక్యుప్రెషర్ పాయింట్లను సున్నితంగా నొక్కతాడు. ఒక్కో సెషన్ దాదాపు ఒక గంటపాటు ఉంటుంది. మరింత మంచి ఫలితం రావాలంటే కొన్ని సెషన్లపాటు హాజరు కావాల్సి ఉంటుంది. శరీరంలోని ఇన్ అనే నెగెటివ్ శక్తిని, యాంగ్ అనే పాజిటివ్ శక్తిని క్రమబద్ధీకరించడం ఆక్యుప్రెషర్‌తో సాధ్యమవుతుంది. ఈ మొత్తం ప్రక్రియతో శరీరంలో ప్రాణశక్తి మార్గాలకు చికిత్స జరగడమే కాకుండా ఆలోచనలు, ఎమోషన్లకు సంబంధించిన సమస్యలు సైతం తగ్గుతాయంటారు. శరీరానికి వెలుపల ఉండే ఒకరి ప్రాణశక్తి చి...ని మరొకరికి పంపవచ్చని కూడా కొందరు భావిస్తుంటారు. అయితే పాశ్చాత్య దేశాల వైద్యులు మాత్రం...ప్రాణశక్తి ఛానల్లను నమ్మటం లేదు. మసాజ్ కారణంగా కండరాల్లో టెన్షన్ తగ్గటం, రక్త ప్రసారం పెరగటం, ఆనందాన్నిచ్చే ఎండార్ఫిన్లు విడుదలై నొప్పి తగ్గటం మాత్రమే జరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## మసాజ్ ...ఆరోగ్యానికి ఎంతో మంచిది...

మనదేశంలో స్పాలలో శరీర ఆరోగ్యాన్ని స్వస్థతని పెంచే పలురకాల మసాజ్‌లు అందుబాటులో ఉంటున్నాయి. అలాగే ఆయుర్వేద వైద్యంలో శరీర మర్దనాకు అధిక ప్రాధాన్యత ఉంది. తలకు కాళ్లకు పాదాలకు వీపుకి...ఔషధ నూనెలతో మర్దనా చేయటం ఆయుర్వేద వైద్యంలో ప్రధాన ప్రక్రియగా ఉంది. అయితే స్పాకు వెళ్లి మసాజ్ చేయించుకునే అవసరం లేకుండా ఎవరికి వారు మసాజ్ చేసుకునేందుకు వీలుగా పలురకాల మసాజ్ చేసే వస్తువులు ఆన్‌లైన్‌లో లభిస్తున్నాయి. అలాగే ఆక్యుప్రెషర్ కోసం కూడా పలురకాల వస్తువులు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆక్యుప్రెషన్ ఫింగర్ కేర్ మసాజర్, సుజోక్ రింగ్స్, పవర్ బాల్స్, పవర్ థంబ్స్, ఉడెన్ ఫీట్ మసాజర్.. ఆక్యు ప్లాస్టిక్ కంప్లీట్ బాడీ బ్లడ్ సర్క్యులేషన్ స్ప్రింగ్ మేగ్నటిక్ స్లిప్పర్స్, ఒత్తిడిని తగ్గించే బాల్స్, కరేలా, డబుల్ ఫుట్ రోలర్, 30, 30 సెంటీమీటర్ల పొడవు వెడల్పులతో ప్లాస్టిక్ ఆక్యుప్రెషర్ పవర్ మ్యాట్, చెవి రిగులు, ఇలా ఆక్యుప్రెషర్‌ని ఇచ్చే పరికరాలు విస్తృతంగా లభిస్తున్నాయి. ఈ పరికరాలు అన్నీ భిన్నమైన ప్రయోజనాలను ఇస్తాయని వీటి తయారీ దారులు చెబుతున్నారు.

ఉదాహరణకి...ఎనర్జీబాల్‌ని అరచేతి మధ్య భాగం, వేళ్ల రిలాక్సేషన్ కోసం వాడవచ్చు. పాయింటెడ్ బాల్ అయితే...జీర్ణవ్యవస్థని చక్కబరుస్తుంది. అలాగే అరచేతి చెమటలను తగ్గిస్తుంది. మినీ రోలర్..డీలక్స్ అనే పరికరం జాయింట్ల నొప్పికి, సర్వికల్ స్పాండిలైటిస్‌కి, మొత్తం బాడీ మసాజ్‌కి, రిలాక్సేషన్‌కి పనిచేస్తుంది. ఫింగర్ మసాజెర్ రక్త ప్రసారాన్ని పెంచుతుంది. ప్లాస్టిక్ కరేలా అనే పరికరం చేతులకు అనుకూలంగా పనిచేస్తుంది. చేతులపై ఐదునుండి పదినిముషాలపాటు దీనిని తిప్పటం వలన ఆక్యుప్రెషర్ పాయింట్లు ఉత్తేజితం అవుతాయి. రక్తప్రసారం పెరుగుతుంది. అలసట తగ్గుతుంది. మొత్తం ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. బయో మేగ్నిటిక్ పవర్ ఫుట్ మ్యాట్...పైన మూడు నుండి అయిదు నిముషాలపాటు జాగింగ్ చేయటం వలన కాళ్ల నొప్పులు, సయాటికా, మోకాళ్ల నొప్పులు. పైల్స్, మైగ్రేన్, సైనస్, నిద్రలేమి, మలబద్ధకం, గ్యాస్, మధుమేహం, అజీర్తి మొదలైన సమస్యలు తగ్గుతాయి. మొత్తంగా ఆక్యుప్రెషర్‌తో ఒత్తిడి టెన్షన్ ఆందోళన తగ్గుతాయి. నిద్ర బాగా పడుతుంది. కండరాలు, జాయింట్లు రిలాక్స్ అవుతాయి. గాయాల నొప్పులనుండి ఉపశమనం కలుగుతుంది. అజీర్తి, తలనొప్పులు తగ్గుతాయి. శరీరంలో అన్ని వ్యవస్థలు సరిగ్గా పనిచేస్తాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.





### ప్రధాని మోడీ వాడుతున్న రోలర్ వలన...

ప్రధాని మోడీ వాడుతున్న రోలర్... చెక్కతో తయారైన ట్యూబ్ ఆకారంలో ఉన్న పరికరం. దీని పైభాగం మొనలుగా తేలి ఉంది. దీనిని కాళ్లకు చేతులకు కూడా వాడవచ్చు. దీని వినియోగంతో ఒత్తిడి తగ్గడమే కాకుండా రోగనిరోధకశక్తి పెరుగుతుంది. టెన్షన్ తొలగిపోతుంది. కండరాల నొప్పి, బిగదీయటం తగ్గుతాయి. నొప్పిగా ఉన్న కండరాలపై మసాజ్ చేయటం వలన మంచి ఫలితం ఉంటుంది. రక్త ప్రసరణ పెరుగుతుంది. పాదం మధ్యలో దీనితో మసాజ్ చేయటం వలన గ్యాస్ సమస్యలు నెమ్మదిస్తాయి. రోజూ దీనిని వాడటం వలన కడుపులో ఇన్‌ఫెక్షన్లు త్వరగా తగ్గుతాయి. పాదాలకు దీంతో మసాజ్ చేయటం వలన ఇన్సులిన్ ఉత్పత్తి పెరిగి మధుమేహం నియంత్రణలో ఉంటుంది. నరాలను శాంతపరచి, శరీరంలోని విషాలను ఒత్తిడిని, నెగెటివ్ ఎనర్జీని బయటకు పంపి, మంచి నిద్ర బాగా పట్టేలా చేస్తుంది.

# ఇంటిదీపాలు... ఫ్యాషన్ వెలుగులు!



కుటుంబ సభ్యులు ఒకేలాంటి బట్టలు ధరించడం ఒక వేడుక. చూడచక్కగా కన్నుల పండుగ్గా ఉంటుంది. ఇక అమ్మలు, చిన్నపాపలు అలా ధరిస్తే మరింత అందంగా... ఇలా ఉంటుంది. ఈ దీపావళికి ఇంటిదీపాలైన తల్లికూతుళ్లు ఇలాంటి ఒకేరకమైన దుస్తులు ధరిస్తే...ఇంటిముందు పెట్టే దీపాల వెలుగులకు దీటుగా ఉంటారు. చిన్నారిని అచ్చం అమ్మలా చూపించే ఈ తరహా డ్రస్‌లు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. లేదా తమకు నచ్చిన మోడల్ ఏదైనా ఎంపిక చేసుకుని కుట్టించుకోవచ్చు.





# నెలసరి అలా ఆగటం...సరి కాదు!

## ప్రీమెచ్యూర్ మెనోపాజ్‌తో గుండె ఆరోగ్య సమస్యలు

సాధారణంగా మహిళలు యాభైఏళ్లకు కాస్త అటు ఇటుగా మెనోపాజ్ దశకు చేరుకుంటూ ఉంటారు. అయితే కొంతమంది చాలా చిన్నవయసులో అంటే నలభై కంటే తక్కువ వయసులోనే ఈదశకు చేరుకోవటం జరుగుతుంటుంది.

ఇలా మెనోపాజ్ వయసుకంటే చాలా ముందే ఈ దశకు చేరే మహిళల్లో గుండెవ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని పరిశోధకులు అంటున్నారు. నలభై ఏళ్ల కంటే తక్కువ వయసులో ప్రీమెచ్యూర్ మెనోపాజ్‌కి గురయిన మహిళలు ప్రాణాంతకం కాని గుండె సంబంధమైన సమస్యలకు గురయ్యే



అవకాశం...50-51 మధ్య మెనోపాజ్‌కి గురయినవారితో పోల్చినప్పుడు రెండింతలు ఎక్కువగా ఉంటుందని.. ఆస్ట్రేలియాలోని క్వీన్‌ల్యాండ్ ప్రొఫెసర్ గీతా మిశ్రా వెల్లడించారు. ఈ అధ్యయనాన్ని లాన్సెట్ పబ్లిక్ హెల్త్ జర్నల్‌లో ప్రచురించారు. 40-45 ఏళ్ల మధ్య వయసు లోనే మెనోపాజ్‌కి చేరినవారిలో 40శాతం మంది గుండెసంబం ధిత సమస్యలకు గురయ్యే అవకాశం ఉందని ఈ ప్రచురణ చెబుతోంది. పొగతాగటం, అధికబరువు, చదువు లేకపో వటం లాంటి సమస్యలు సైతం ఉన్నపుడు చిన్న వయసులో మెనోపాజ్‌కి గురయిన మహిళలు గుండె సంబంధిత సమస్యలకు లోను కావటం మరింత ఎక్కువ కావచ్చని గీతా మిశ్రా అభిప్రాయపడుతున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 15 అధ్యయనాల ద్వారా సేకరించిన మూడు లక్షలమంది తాలూకా ఆరోగ్యవివరాలను విశ్లేషించారు. క్వీన్ ల్యాండ్ యూనివర్శిటీ స్కూల్ పబ్లిక్ హెల్త్ పిహెచ్‌డి స్కాలర్ డాంగ్‌షాన్ ఝూ...ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. చక్కని జీవనశైలి, ఆరోగ్యకరమైన అలవాట్లతో పాటు...గుండె ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఝూ అంటున్నారు.

# దినఫలాలు

**మేష రాశి**
సన్నిహితులతో మాటపట్టింపులు. వ్యయప్రయాసలు. అనారోగ్య సూచనలు. కుటుంబంలో ఒత్తిడులు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొద్దిపాటి చికాకులు.

**వృషభ రాశి**
పనుల్లో విజయం. ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. సంఘంలో గౌరవం. వస్తు, వస్త్రలాభాలు. సోదరులతో సఖ్యత నెలకొంటుంది. వ్యాపారాలలో అనుకూలత. ఉద్యోగాలలో పురోగతి.

**మిథున రాశి**
శ్రమ తప్పదు. పనుల్లో ఆటంకాలు. బంధువులు, మిత్రులతో వివాదాలు. దూరప్రయాణాలు. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు. ఆలయ దర్శనాలు.

**కర్కాటక రాశి**
నూతన ఉద్యోగయోగం. పనుల్లో మరింత పురోగతి. ఇంటాబయటా అనుకూలం. ప్రముఖులతో పరిచయాలు. వ్యాపారాలు ఉత్సాహంగా ఉంటాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

**సింహ రాశి**
ఆర్థికపరిస్థితి కొంత నిరుత్సాహపరుస్తుంది. శ్రమాధిక్యం. పనుల్లో స్వల్ప ఆటంకాలు. ధనవ్యయం. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు.

**కన్యా రాశి**
కొత్త వ్యక్తుల పరిచయం. సంఘంలో గౌరవం. విలువైన వస్తువులు సేకరిస్తారు. ఆధ్యాత్మిక చింతన. వ్యాపార లావాదేవీలు మరింత పుంజుకుంటాయి. ఉద్యోగాలలో చిక్కులు తొలగుతాయి.

**తుల రాశి**
చిన్ననాటి మిత్రుల కలయిక. విందు వినోదాలు. ఆస్తి వివాదాల పరిష్కారం. శుభకార్యాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. వ్యాపారాలు సంతృప్తినిస్తాయి. ఉద్యోగాలలో మరింత ప్రోత్సాహం.

**వృశ్చిక రాశి**
పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. కొత్త రుణాలు చేస్తారు. ఆలోచనలు నిలకడగా ఉండవు. వ్యాపారాలు అంతంత మాత్రమే. ఉద్యోగాలలో కొన్ని మార్పులు. అనారోగ్యం. ఆకస్మిక ప్రయాణాలు.

**ధనూ రాశి**
కుటుంబంలో ఒత్తిడులు. కొన్ని పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగాలలో చికాకులు. నిరుద్యోగులకు గందరగోళం.

**మకర రాశి**
కొత్తమిత్రుల పరిచయం. శుభవార్తలు. ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల నుంచి ధనలాభం. పనుల్లో విజయం. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. ఉద్యోగాలలో ఒత్తిడుల నుంచి విముక్తి.

**కుంభ రాశి**
ఉత్సాహంగా వ్యవహారాలు పూర్తిచేస్తారు. ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు. విందు వినోదాలు. వ్యాపారాలలో ముందడుగు వేస్తారు. ఉద్యోగాలలో కొత్త ఆశలు. దైవదర్శనాలు.

**మీన రాశి**
వ్యయప్రయాసలు ఉండవచ్చు. ధనవ్యయం. పనుల్లో ఆటంకాలు. ఆలయ దర్శనాలు. వ్యాపారాలు అంతగా అనుకూలించవు. ఉద్యోగాలలో మరిన్ని బాధ్యతలు. విద్యార్థులకు ఒత్తిడులు.



శ్రీ గుదిమెళ్ళ యతీంద్ర ప్రవణాచార్య సిద్ధాంతి

## గో గీత

**నమో బ్రహ్మణ్య దేవాయ**
**గో బ్రాహ్మణ హితాయచ**
**జగద్ధితాయ కృష్ణాయ**
**గోవిందాయ నమోనమః**
**(సంధ్యావందనం)**

బ్రహ్మజ్ఞానం కలవాడు, గోబ్రాహ్మణులకు హితము చేయువాడు, జగత్కళ్యాణకారకుడు అయిన గోవిందునకు నమస్కారం. (గోవులను పోషించి రక్షించేవాడు శ్రీకృష్ణుడు)



- లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

# చింతన



**మనసు కూడా కప్ప వలె గెంతులు వేస్తూ, అలుపెరుగకుండానే, అలసిపోతుంటుంది కనుక, మనసును నియంత్రించి, నిగ్రహించే మార్గం ధ్యానమేనని బోధిస్తూ, మాండూక్యోపనిషత్ సాధకుణ్ణి ఆత్మ సాక్షాత్కారం వైపు నడిపిస్తుంది.**

# అవస్థాత్రయం...

**జా**గ్రత్, నిద్ర, సుషుప్తి అనే మూడు అవస్థలలోనూ ఉన్న 'నేను', మనసు ద్వారా కప్పగెంతుల వంటి సంచరించే స్థితిని చూపేదే మాండూక్యం!

అత్యంత విలువైన కాలాన్ని తపో భూమికలో గడిపి, తాను పొందిన ఆత్మానుభవాన్ని నిరపేక్షంగా ఈ ప్రపంచానికి అందించే జ్ఞానవరదాన విధానాన్ని **'మాండూక్యోపనిషత్'** మనకు సుబోధకంగా వివరిస్తుంది.

జీవుడు, జగత్తు, జగదీశ్వరుడూ భిన్నం కావని చెపుతూనే, జీవుడు దేహధారి కనుక పుట్టటం, పెరగటం, ఒరగటం తప్పించుకోలేని స్థితులు.

'జ' అంటే పుట్టేది, 'గత' అంటే పోయేది. ఋతువు వెంట ఋతువు. కాలగమనంలో నిరంతరం మార్పు చెందుతూనే, మరణ స్థితిని పొందుతూనే ఈ ప్రకృతి, ప్రపంచం, జగత్తుగా అనుభవంలోకి వస్తున్నది. కనుక జీవ - జగత్తులు అస్థిరమై, అశాశ్వతమై, కంటికి కనిపిస్తూ ఉన్నయ్. ఈ రెండిటి స్థితి ఒకటే!

కానీ జీవజగత్తుల కార్యకలాపాలకు కారణము, ప్రేరణము అయిన జగదీశ్వర తత్త్వం నిత్య, సత్య, శాశ్వత స్థితిలో నిలకడచెంది ఉన్నది.

రూప, నామ భేదం వలన జీవుల మూలసూత్రం కంటికి కనిపించక, మనసుకు అనిపించక గందరగోళం ఏర్పడుతుంది. అవస్థలు మూడుగా ఉన్నా, అందులో స్థిమితంగా ఉన్న సద్వస్తువు ఒకటే!

జీవ, జగత్, జగదీశ్వరులు భిన్న రూపాలలో సంచరిస్తున్నా నిజానికి ఈ మూడూ ఒకటే! అటువంటి స్పృహే 'ఎరుక'!

ఈ ఎరుకను సాధించే మార్గాన్ని 'మాండూక్యోపనిషత్' సూచిస్తున్నది, మనసు కూడా కప్ప వలె గెంతులు వేస్తూ, అలుపెరుగకుండానే, అలసిపోతుంటుంది కనుక, మనసును నియంత్రించి, నిగ్రహించే మార్గం ధ్యానమేనని బోధిస్తూ, మాండూక్యోప నిషత్ సాధకుణ్ణి ఆత్మ సాక్షాత్కారం వైపు నడిపిస్తుంది. అకార, ఉకార, మకారములతో కూడి ఉండి, ఒకే అక్షర స్వరూపాన్ని ధరించిన శబ్దమే, 'ఓం!'. అది నాశమెరుగని ఆత్మకు సంకేతం! అదే ప్రణవం! అదే నిజమైన జ్ఞాన మార్గం.

మూడు అవస్థలలోనూ 'నేను, నేను' అని శబ్దించే శబ్ద బ్రహ్మము. అది జీవుడి హృద్గుహలో నినదించే అనాహతనాదం! దానిపై నిలిపే ధ్యానమే ఆత్మానుసంధానానికి దారి తీయిస్తుంది. ప్రకృతికి నాదరూపమైన 'ఓం', పరమాత్మ కంటె భిన్నం కాదు. ఏకం అనేకం కావటం, మళ్ళీ 'అనేకం' ఏకం కావటం సృష్టి లక్షణమే.

అప్పుడే పుట్టిన కాలం వర్తమానమై, అది నెమ్మదిగా భవిష్యత్‌గా మారి, తిరిగి భూతకాలంగా రూపుదాల్చటమూ ఇటువంటిదే. జాగ్రదవస్థలో విశ్వుడుగా, స్వప్నావస్థలో తేజసుడుగా, సుషుప్తిలో ప్రాజ్ఞుడుగా ఉండటమూ ఇటువంటిదే!

దేహంలోనే పధ్నాలుగు లోకాలు ఉన్నయ్. శిరస్సు, రెండు కళ్ళు, నాసికారంధ్రాలు, చెవులు, నోరు, కరచరణాది అవయవాలు, పొట్ట... వీటన్నిటితో పాటు స్పర్శ... ఇదంతా సర్వలోకాల సమష్టి వ్యవస్థ. స్థూలంగా కేవల శరీరంగా కనబడుతున్న ఒక కార్యక్షేత్రం!

జీవుడు జాగ్రదవస్థలో శరీరంగా లోకానుభవాన్ని పొందుతూ, స్వప్నావస్థలో మానసికంగా విషయాలను నెమరువేసుకుంటూ, సుషుప్తిలో మనోబుద్ధులు అణగి, అనిర్వచనీయ ఆనందానుభూతిని పొందుతాడు!

అయితే ఇది సుఖ, సంతోష, నానాఆనందాలను దాటిన స్థితే!

సమాధి స్థితి కలిగించే ఆనందం అంత్యం, శాశ్వతం.

అది ఇంకా బహుదూరంలో ఉన్నది.

ఈ మూడు అవస్థలను దాటిన తరువాత 'తురీయం' ఉన్నది. దానిని అందరూ తురీయ స్థితిగా భావిస్తే శంకర భగవత్పాదులు దానిని తురీయతల్పమన్నారు. అంటే తురీయానికి అతీతమైన స్థితి ఉన్నదని సూచిస్తూ, తురీయం దగ్గర విశ్రమించిన అనంతరం, పరమ చరమ స్థితిని అందుకోమని బోధిస్తున్నారు...



వి.యస్.ఆర్.మూర్తి
9440603499



## అన్నదాన మహిమ

**అ**న్నదానం అనేది భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలకు కూడలి వంటిదని, భక్తికి పరాకాష్ఠగా ఉప్పుగూడలో భట్‌జీ బాపూ మహరాజ్ ఆశ్రమంలోని ఒక ఉదంతం తెలుసుకున్నాం. ఇక కర్మ మార్గానికి సంబంధించిన ఒక ఉదంతం తెలుసుకుందాము.

నిత్యాన్నదానం చేసేవాడు జలారాం బాపా. ఒకసారి ఆయన వద్దకు గుర్రంపై స్వారీ చేసుకుంటూ ఒక వ్యక్తి వచ్చాడు. అతడు చాలా అలసిపోయి ఉన్నాడు. బాపాజీయే అతనిని మెల్లగా దింపి, మంచంపై పడుకోబెట్టి, లడ్డూను నోటిలో పెట్టి తినిపించారు. వెంటనే ఆ వ్యక్తి నిద్రలోకి జారుకున్నాడు. ఇక బాపాజీ, గుర్రం వద్దకు వెళ్ళి, 'నీ మీద స్వారీ చేసిన వ్యక్తే అంత అలసిపోతే, నీ వెంత అలసిపోయావో' అని ఆ గుర్రానికి కూడా దాణా వేసి, దాని కాళ్ళకు కాపడం పెట్టి, కొంతసేపు ఒత్తారు. యజమానిలోను, గుర్రంలోను ఉన్నది రాముడే కదా! ఇదే రాముని సేవించే విధానం!

### అందరిలోనూ ఉపాస్యదేవత

ఒక ఆశ్రమంలో శౌనకుడు, అభిప్రాతరి అనే ఋషులుండేవారు. వారు నిత్య కర్మలను ముగించి, వాయుదేవతోపాసన చేసి ఆహారాన్ని స్వీకరించేవారు. ఒకనాడు వారిద్దరు ఆహారం స్వీకరిద్దామనుకుంటుండగా **'నారాయణ హరి'** అనే కేక వారి గుమ్మం ముందు వినబడింది. భిక్షార్థి అయిన బ్రహ్మచారి కేక అది.

ముంగిటికి వచ్చిన అతిథిని వట్టి చేతులతో పంపకూడదు. కాని ఆ రోజు ఋషులిద్దరు, **'ఈ వేళలో ఇక్కడ భోజనం లభించదు వెళ్ళిరా'** అన్నారు. వచ్చిన బ్రహ్మచారి వారింకా అజ్ఞానంలోనే ఉన్నారని గ్రహించాడు. 'అది సరే' అని బ్రహ్మచారి వారిని కొన్ని ప్రశ్నలడిగాడు. ఆ సంభాషణ ఇలా సాగింది.

**బ్రహ్మచారి:** మీరు ఏ దేవతా ఉపాసకులు?

**ఋషులు:** వాయుదేవోపాసకులం, అంటే ప్రాణదేవోపాసకులం.

**బ్ర:** వాయుదేవత సర్వవ్యాపి కదా?

**ఋ:** అవును

**బ్ర:** నాలోనూ, మీలోనూ కూడా వ్యాపించి ఉన్నది కదా?

**ఋ:** అవును

**బ్ర:** నాలో ఉన్న వాయువునకు మీరు భోజనం పెట్టకుండా తిరస్కరించడం, ఆ వాయుదేవతను తిరస్కరించినట్లు కాదా?

ఋషులు తమ అజ్ఞానాన్ని తెలుసుకున్నారు. బ్రహ్మచారిని లోనికి ఆహ్వానించారు. భోజనం పెట్టారు.

అతనిలో వారి ఉపాస్యదేవత అయిన వాయుదేవునే చూశారు. ఆ దేవతే భోజనం చేస్తున్నట్టు భావించారు. నరుడే నారాయణుడని, అతడిని సంతృప్తిపరచటం తమ ఉపాస్య దేవతను తృప్తిపరచడమేనని, అదే నిజమైన ఉపాసన అని గ్రహించారు.

### ఆకలితో ఉన్న ఎవరికి పెట్టినా నాకే

సాయి భక్తులకు సాయి ఉపాస్య దేవత. సాయి తమ వద్దకు వచ్చే రామచంద్ర ఆత్మారాం తర్కడ్ భార్య, లక్ష్మీబాయి షిండే మొదలైన వారెందరికో ఎన్నో సార్లు చెప్పేవారు **'ఆకలితో ఉన్న వారికి అన్నం పెడితే నాకు పెట్టినట్లే. అది పరమ సత్యం'** అని. ఆకలి తీర్చడం జ్ఞానానికి మొదటి మెట్టు.

వినగలిగే చెవులకు, చూడగలిగే కండ్లకు, పనులు చేసే చేతులకు, ఆలోచించే మనస్సుకు అన్నదానం ఒక ఆధ్యాత్మిక ఖజానా. అన్నదానపరంగా చెప్పాలంటే ముక్కల పులుసును ఒకరికి, నీళ్ళ పులుసును మరొకరికి పోయకపోవటమే సమత్వం. కూరగాయలను ఉడికించేటప్పుడు మూతలను ఉంచాలి. అలా చేస్తే అవి సువాసనలు కోల్పోకుండా ఉంటాయి, ఇది మనసుకూ వర్తిస్తుంది. మనసుపై ఒక మూతను ఉంచి బాహ్యంలోకి పోకుండా చూసుకోవాలి.

రమణులు వంట చేసేవారు తమ ఆశ్రమంలో. సాయిబాబా కూడా అంతే, అయితే వారు శాకాహారమే కాదు మాంసాహారం కూడా వండేవారు. తనను ఆశ్రయించిన వారి మనస్సులలోని అహంకారాన్ని చంపి ఆ దైవానికి సమర్పణ చేసేవారు.

భౌతికం నుంచి ఆధ్యాత్మికంలోనికి అన్నదానం ద్వారా పయనిద్దాం.

# అన్నిటా రాముడే!

ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్



# పురుషార్థాల్లో ధనం స్థానం

**(గత సంచిక తరువాయి భాగం)**

**దా**నం చేసేటపుడు దాన గ్రహీత పాత్రతనెరిగి దానం చేయాలి. అపాత్రదానం చేయకూడదు. సత్పాత్రదానం చేయకుంటే కలిగే పరిణామం ఇలా ఉంటుందంటారు.

**అదాన దోషేణ భవేద్దరిద్రో**
**దరిద్రదోషేణ కరోతి పాపం**
**పాపాదవశ్యం నరకం ప్రయాతి**
**పునర్దరిద్రః పునరేవ పాపీ**

పాత్రనెరిగి దానం చేయకపోతే మరుజన్మలో దరిద్రుడిగా పుడతాడు. దారిద్ర్యం వలన తన జీవనం కోసం పాపం చేస్తాడు. ఆ పాప కారణంగా నరకానికి పోతాడు. అందువలన మరల దరిద్రునిగా, పాపిగానే పుడుతుంటాడు.

ప్రఖ్యాత ఆంగ్ల రచయిత షేక్స్పియర్ 'హామ్లెట్' అనే నాటకంలో పొలోనియస్ అనే పాత్ర చేత ఇలా పలికిస్తాడు. 'అప్పు ఇవ్వవద్దు, తీసుకోవద్దు. ఎందుకంటే ఋణం తీసుకున్నా, ఇచ్చినా, ఆ డబ్బును, స్నేహితుడిని కోల్పోవలసి ఉంటుంది. అలాగే కొత్తగా పరిచయం కలిగి స్నేహితుడైనవాని సంతోషం, వినోదం కోసం ధనాన్ని దుర్వినియోగం చేయవద్దు' అని కూడా అనిపిస్తాడు.

మల్లాది లక్ష్మీనరసింహశాస్త్రిగారి సుభాషితం ప్రకారం

**కరమున నిత్యదానము, ముఖంబున**
**సూనృతవాణి యౌదలం**
**గురుచరణాభివాదన**
**మకుంఠిత**
**వీర్యము దోర్యుగంబునన్**
**వర హృదయంబునన్ విశద వర్తన మంచిత విద్య వీనులన్**
**సురుచిర భూషణంబులివి సూరులకున్ సిరిలేని యప్పుడున్**

చేతులతో సదా దానం చేయుట, ఎప్పుడూ సత్యమునే పలుకుట, గురు పాదాలకు శిరస్సు తాకించి నమస్కరించుట, భుజములలో బలం కలిగి ఉండుట, నిర్మల మనస్వియై ఉండుట, చెవులతో శాస్త్ర శ్రవణం చేయుట ఇవన్నీ ధనం లేకపోయినా సత్పురుషులకు గొప్ప అలంకారమవుతాయి. కనుక న్యాయార్జితమైన ధనంతో, ధర్మబద్ధంగా జీవిస్తే మనం ద్వితీయ పురుషార్థాన్ని సాధించిన వారమవుతాము.

డాక్టర్ గొల్లాపిన్ని సీతారామ శాస్త్రి
9440781236

# రోడ్డు ప్రయాణాల్లో... ఈ జాగ్రత్తలు తీసుకోండి



రహదారి పర్యటనలు అన్నివేళలా సరదాగా ఉంటాయి. గమ్యం చేరుకోవడం కన్నా.. ఆ దారిలో మీకు కలిగే అనుభూతులు... మీ జ్ఞాపకాల దొంతరలో చేరి ఎనలేని ఆనందాలను మిగలిస్తాయి. దారిపొడవునా కనిపంచే సుందర దృశ్యాలు మిమ్మల్ని ఆనంద డోలికలలో ఊగిస్తాయి. ఎప్పుడు ఆగాలి.. ఎక్కడ ఆగాలి అనేవి మీరే నిర్ణయించుకుంటారు. రోడ్డుపక్కనున్న హోటళ్లలో స్థానిక రుచులను తనివితీరా ఆస్వాదిస్తారు. కాలంతో పోటీపడాల్సిన అవసరం ఉండదు. అయితే, రోడ్డు ట్రిప్పులు ఎంత ఆనందంగా ఉంటాయో... కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకోకపోతే... అన్ని ప్రతిబంధకాలను సృష్టిస్తాయి. రహదారి యాత్రను పూర్తిగా ఆస్వాదిం చడానికి మీ ప్రయాణంలో ఊహించని సంఘటలను నివారించడానికి మీకు సహాయపడే కొన్ని బీమా కవర్లను చూద్దాం..

## మోటారు బీమా

మీరు ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందే మీ వాహనానికి సర్వీసు చేయించడం మరిచిపోవద్దు. అయినప్పటికీ... ఏదైనా ప్రమాదం/ నష్టం జరిగితే ఆ ఆర్థిక భారం నుండి మిమ్మల్ని రక్షించడానికి అన్ని బీమా కవర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలి. సమగ్ర మోటారు బీమా కవర్ మీ వాహ నానికి సంపూర్ణ కవరేజిని అందిస్తుంది. మీ వాహనం ధ్వంసం కావడం, ఫ్లాట్ టైర్ లేదా రహదారి మధ్యలో బ్యాటరీ సమస్యలు ఉంటే 24/7 రోడ్ సైడ్ సాయం కవర్‌లో ఉంటుంది. దీని ద్వారా చిన్న మరమ్మతులు మీకు అందుబాటులోకి వస్తాయి. బ్రేక్ ఇన్ కారణంగా ఏదైనా నష్టం జరిగితే లేదా దొంగతనం జరిగితే వాహన ఉపకరణాల కోసం అదనపు కవర్ కూడా కొనుగోలు చేయవచ్చు. కొన్ని బీమా సంస్థలు వ్యక్తిగత సామాను కోల్పోవడాన్ని కూడా కవర్ చేస్తున్నాయి.

## గృహ బీమా

రోడ్డు ట్రిప్పుకు బయల్దేరినందున మీ ఇంటికి వెనకనుంచి తాళం వెయ్యం డి. మీరు లేనప్పుడు ఏదైనా దొంగతనం లేదా నష్టం జరిగితే మీ ఇల్లు, ఇంటిలోని విలువైన సామ గ్రికి బీమా కవర్ ఉండడం చాలా అవసరం. మీరు ఇన్‌స్టాల్ చేసిన భద్రతా పరికరాలతో పాటు, గృహ బీమా తప్పనిసరి. తద్వారా మీరు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రయా ణించవచ్చు. మీ ల్యాప్ టాప్, స్మార్ట్ ఫోన్, వాలెట్‌లను కూడా గృహ బీమాలో చేర్చాలి.



అప్పుడే.. అవి ప్రయాణంలో పోయినా... బీమా పరిహారం లభిస్తుంది. అవి ఇంట్లో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా మీ వెంట ఉన్నప్పుడు కూడా బీమా కవరేజీ వర్తిస్తుంది.

## వ్యక్తిగత ప్రమాద బీమా

ప్రతి వాహన యజమాని తప్పనిసరిగా తీసుకోవల్సిన థర్డ్ పార్టీ బీమాతో పాటు, ఐఆర్‌డిఎఐ నిర్దేశించిన ఓనర్ కమ్ డ్రైవర్‌కు 15 లక్షల ప్రమాద బీమా తప్పనిసరిగా తీసుకోవాలి. ఇదే కాకుండా మీతో పాటు ప్రయాణించే ప్రయాణికులకు కూడా వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోవాలి. డ్రైవర్‌ను పెట్టుకుంటే అతనికి కూడా వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకోవాలి. వ్యక్తిగత ప్రమాద బీమా అనేది ఏదైనా దురదృష్టకర సంఘటన జరిగితే మరణం, శాశ్వత లేదా తాత్కాలిక వైకల్యం వంటివి సంభవిస్తే పాలసీదారుడికి లేదా అతని మీద ఆధారపడినవారికి పరిహారం లభిస్తుంది. ఒకవేళ మీరు మీ ప్రయాణ సమయంలో సాహస క్రీడలను ఎంచుకుంటే, వాటిని కూడా మీ వ్యక్తిగత ప్రమాద బీమా పరిధిలోకి తేవాలి.



## ప్రయాణ బీమా

మీరు అద్దెక్యాబ్‌లో గనుక ప్రయాణిస్తున్నట్లయితే మీరు తప్పనిసరిగా దేశీయ ప్రయాణ బీమాను కలిగిఉండాలి. ఆ వాహనంలో ప్రయాణిస్తున్నప్పుడు మీకు ఏదైనా ఆపదకలిగితే... ఈ బీమా మీకు వర్తిస్తుంది. ఒకవేళ మీరు మీ వాహనంలో క్రాస్ కంట్రీ రోడ్ ట్రిప్ కోసం వెళుతుంటే ప్రయాణ బీమా మీ బ్యాగేజీ పోయినా పరిహారం ఇస్తుంది. అంతేకాదు... మెడికల్ కవరేజ్ ఉంటుంది. వైద్యసేవలకోసం తరలించాల్సి వస్తే అందుకు అయ్యే వ్యయాలకు వర్తిస్తుంది. అత్యవసర నగదు అడ్వాన్స్ సదుపాయం కల్పిస్తుంది. మీ ప్రయాణ అవసరాలను బట్టి మీరు మీ ప్రయాణ బీమాను ఎంచుకోండి. అవసరమైన వాహనపత్రాలు, అత్యవసర రోడ్ సైడ్ కిట్‌తో పాటు తగిన బీమా పాలసీలతో ప్రయాణానికి సిద్ధం కండి. సురక్షితంగా డ్రైవ్ చేయండి. సరదాగా రోడ్ ట్రిప్ చేయండి.

**శశికుమార్.ఎ, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్**
**బజాజ్ అలియెంజ్ జనరల్ ఇన్సూరెన్స్**

# గృహ అమ్మకాల్లో 25 శాతం తగ్గుదల

## ప్రాప్‌టైగర్ నివేదికలో వెల్లడి

ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో భారతదేశంలోని ప్రధాన మార్కెట్లలో ప్రాజెక్ట్ లాంచ్‌లు తగ్గుతూ వచ్చాయి. అదే సమయంలో గృహ అమ్మకాలలో ముందుకు వెళ్లడానికి రియల్ ఎస్టేట్ డెవలపర్లు చేసిన ప్రయత్నం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. ఎలారా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో భాగమైన ప్రాప్‌టైగర్.కామ్ ఈ నివేదికను వెల్లడించింది. ఇదే సైట్ హౌసింగ్.కామ్, మకాన్.కామ్ ను కూడా కలిగి ఉంది. ప్రాప్‌టైగర్ డేటా లాబ్స్ చేసిన భారతదేశపు తొమ్మిది కీలక ఆస్తి మార్కెట్ల త్రైమాసిక విశ్లేషణ రియల్ ఇన్‌సైట్ ప్రకారం.. 2019 నుంచి 20 ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై 20) జూలై - సెప్టెంబర్ త్రైమాసికంలో దేశంలో కొత్త ప్రాజెక్టు ప్రారంభాలు 45 శాతం వరకు క్షీణించాయి. గత ఏడాది ఇదే త్రైమాసికం ఇదే కాలంలో (జూలై -సెప్టెంబర్), గత ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంతో పోలిస్తే గృహ అమ్మకాలు కూడా 25 శాతం తగ్గాయి. క్వార్టర్ ఆన్ క్వార్టర్ పోలికలు అమ్మకాలు లాంచ్‌లను పరిశీలిస్తే రెండింటిలోనూ క్షీణతను చూపించాయి. ఇందులో కొత్త లాంచ్‌లు 32 శాతం పడిపోయాయి. గృహ అమ్మకాలు 23 శాతం వరకు తగ్గాయి.

ఎఫ్‌వై19, ఎఫ్‌వై20 మొదటి సగం మధ్య సంఖ్యల పోలిక కూడా గృహ అమ్మకాలు, కొత్త ప్రయోగాలు కిందికి కదిలినట్లు చూపించాయి. గత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 170,715 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే ప్రస్తుతం 151,764 యూనిట్లు మాత్రమే అమ్ముడయ్యాయి.11 శాతం పతనం నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో 137,146 తాజా యూనిట్లను ప్రారంభించగా, భారతదేశంలో తొమ్మిది మార్కెట్లలో కేవలం 83,662 యూనిట్లు మాత్రమే ప్రారంభించబడ్డాయి. ఇది మొదటి ఆరు నెలల్లో 39 శాతం పడిపోయింది. సెప్టెంబరు త్రైమాసికంలో కొత్త లాంచ్‌లు దిగజారుతున్న ధోరణిని చూపిస్తూనే, కొనసాగుతున్న ఎన్‌ఎఫ్‌బిసి సమస్యకు పరిష్కారం వైపు ప్రభుత్వం కదులుతూనే ఉంది. ఈ సమస్యతో భారతదేశంలో రియల్ ఎస్టేట్ డెవలపర్‌లకు ఆర్థిక వనరుల లభ్యత తగ్గింది. పండుగ సీజన్‌లో కొనుగోలు నిర్ణయాలను వాయిదా వేయడంతో త్రైమాసికంలో అమ్మకాల సంఖ్య పడిపోయింది. లిక్విడిటీ క్రంచ్ కారణంగా రాబోయే త్రైమాసికంలో కొత్త ప్రయోగ సంఖ్యలు తగ్గుతూనే ఉండవచ్చు.

తరువాతి త్రైమాసికంలో గృహ అమ్మకాల సంఖ్య మెరుగుపడుతుందనే ఆశాభావం ఉందని ఎలారా టెక్నాలజీస్ గ్రూప్ సీఈఓ ధ్రువ్ అగర్వాల్ తెలిపారు. జూలై సెప్టెంబర్ గత సంవత్సరంలో ప్రారంభించిన 61,679 తాజా యూనిట్లతో పోలిస్తే, ఈ ఏడాది రెండవ త్రైమాసికంలో కేవలం 33,883 కొత్త గృహాలను మాత్రమే ప్రారంభించారని పేర్కొన్నారు. వీటిలో 41 శాతం యూనిట్లు సరసమైన కేటగిరీలో ఉన్నాయని, అంటే రూ .45 లక్షలు లేదా అంతకంటే తక్కువ ధర గల యూనిట్లు అని తెలిపారు. ఈ త్రైమాసికంలో పుణెలో అత్యధిక సంఖ్యలో యూనిట్లు ప్రారంభించబడ్డాయన్నారు. తరువాత భారతదేశ ఆర్థిక రాజధాని ముంబైలో 8,132 గృహాలు ఉన్నాయని పేర్కొన్నారు. గురుగ్రామ్ కాకుండా ఇతర నగరాల్లో కొత్త ప్రయోగాలు క్షీణించాయన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో మొత్తం 65,799 యూనిట్లు అమ్ముడయ్యాయన్నారు. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో 88,078 యూనిట్లు అన్నారు. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన అమ్మకాలతో పోల్చినప్పుడు, ఈ సంవత్సరం నివేదికలో ఉన్న నగరాల్లో ఈ సంఖ్య తగ్గిందన్నారు.

ఆసక్తికరంగా ఈ త్రైమాసికంలో విక్రయించిన దాదాపు సగం యూనిట్లు సరసమైన గృహాలు అన్నారు. 21,985 వద్ద, ముంబై మార్కెట్లో అత్యధిక సంఖ్యలో యూనిట్లు అమ్ముడయ్యాయన్నారు. తరువాత పూణేలో 13,644 గృహాల అమ్మకాలు జరిగాయని తెలిపారు.



# ఆరోగ్య రంగంపై అమెరికా-ఇండియా వాణిజ్య యుద్ధ ప్రభావం

వాతావరణం నేపథ్యంతో పాటుగా భారతదేశం సుంకం స్థాయి కారణంగా అలా జరగలేదు. భారత దేశం ఇలాంటి అవకాశాలను వియత్నాం, బంగ్లాదేశ్ లకు కోల్పోవడానికి మరొక కారణం, తయారీ రంగానికి బలం చేకూర్చగల మౌలిక సదుపాయాలలో దాని బలహీనత.

2017 లో కొరోనరీ స్టెంట్లు, మోకాలి ఇంప్లాంట్లపై భారతదేశం ధరల పరిమితిని విధించింది. ఇది యుఎస్ కంపెనీలను ప్రతికూలంగా ప్రభావితం చేసింది. 2018 లో యుఎస్ తయారీదారులు 1.6 బిలియన్ డాలర్ల విలువైన వైద్య పరికరాలను భారతదేశానికి ఎగుమతి చేశారు. ధరల పరిమితులు విధించడం భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపింది. భారతదేశ వైద్య సాంకేతిక డిమాండ్లో దాదాపు 75 శాతం అవసరాలను తీర్చే ప్రపంచ పరిశోధన ఆధారిత వైద్య పరికర పరిశ్రమకు మార్కెట్ ప్రాప్యతను అది ప్రభావితం చేసింది. వైద్య పరికరాల్లోని ధరల పరిమితులు రెండు దేశాల మధ్య చిచ్చు రగిలేందుకు కేంద్ర బిందువుగా మారాయి. భారతదేశంలోని యుఎస్ పరిశోధన ఆధారిత వైద్య పరికరాల కంపెనీల మార్కెట్ యాక్సెస్ సమస్యలను పరిష్కరించడానికి యుఎస్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నాయి.

అమెరికా వైద్య పరికరాల తయారీదారులు మోడీ ప్రభుత్వానికి కొన్ని ప్రతిపాదనలు చేశారు, ప్రాప్యత , స్థోమత గురించి భారతదేశ ఆందోళనలను పరిష్కరించడానికి ప్రత్యామ్నాయాలను సూచిస్తూ, వినూత్న ఉత్పత్తులను భారత మార్కెట్లోకి తీసుకురావడానికి ప్రతిపాదించారు. దేశీయ డిమాండ్ మరియు అంతర్జాతీయ మార్కెట్ల కోసం భారత దేశాన్ని ఉత్పాదక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రపంచ పరిశోధన ఆధారిత వైద్య పరికర సంస్థలను భారత ప్రభుత్వం అనుమతించడం ముఖ్యం. ఇది పెట్టుబడులకు ఒక వేదికను అందించడమే కాకుండా ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆవిష్కరణలను కూడా అందిస్తుంది. యుఎస్ చైనా వాణిజ్య యుద్ధం తీవ్రతరం కావడంతో, వైద్య పరికరాల్లో యుఎస్ ఇండియా ప్రతిష్టంభన లో ఏదైనా పరిష్కారం లభించే అవకాశం ఉంది. భారత మార్కెట్‌ను మరింత తెరవాలన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్లతో ప్రధాన మంత్రి మోడీ మేక్ ఇన్ ఇండియా కలను సమతుల్యం చేయడం ఇక్కడ కీలకాంశం.



ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కీలక దశకు చేరుకున్న సమయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన చోటు చేసుకుంది. మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్ లో కెమెరాలకు పోజులిస్తుండగా, మరో వైపున వాణిజ్య ప్రతిష్టంభన ముగింపుపై తీవ్రమైన చర్చలు జరిగాయి. రెండు దేశాలూ మరోసారి చర్చలకు సిద్ధపడుతున్నాయి. అమెరికా వ్యవసాయ వస్తువులు, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసిటి) ఉత్పత్తులు, వైద్య పరికరాలను భారతీయ మార్కెట్లలోకి ప్రవేశించడాన్ని సులభతరం చేసే వాణిజ్య ప్యాకేజీని ఈ సందర్భంగా ప్రకటిస్తారనే ఊహాగానాలు చెలరేగాయి.

చైనా విషయంలో ఇప్పటికే ఆందోళన చెందుతున్న ట్రంప్ పాలనాయంత్రాంగం ఇప్పుడు భారత్‌తో కొత్త ఒప్పందాన్ని ప్రకటించే దిశగా తీవ్రంగా కృషి చేస్తోంది. మోడీ ప్రభుత్వం కూడా కొన్ని భారీ రాయితీలకు సి ద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది, మరీ ముఖ్యంగా ఎంతో కాలంగా రక్షించుకుంటూ వచ్చిన వ్యవసాయ రంగంలో తమ దేశానికి ఎగుమతి చేయడాన్ని సులభతరం చేయడానికి భారత దేశం అంగీకరించడాన్ని సొమ్ము చేసుకోవాలని అమెరికా భావిస్తోంది. వ్యవసాయ ఉత్పత్తులు, వైద్య పరికరాలు, ఐసిటి ఉత్పత్తులపై భారత్ సుంకాలను తగ్గించాలని అమెరికా కోరుకుం టున్నది. ఈ మూడు అంశాలు కూడా గత కొంతకాలంగా ఈ రెం డు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బతీసేవిగా ఉంటున్నాయి.

'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్స్' కార్యక్రమం కింద భారతదేశానికి ఇచ్చిన వాణిజ్య ప్రయోజనాలను ట్రంప్ పాలనాయంత్రాంగం ఉపసంహరించుకోవడంతో ఈ ఏడాది మేలో రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ పథకం కింద రవాణా చేయబడుతున్న 6 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ వస్తువుల ఎగుమతులపై ఈ చర్య నేరుగా ప్రభావాన్ని కనబర్చింది. భారతదేశం కూడా ఈ విషయంలో తీవ్రస్థాయిలో స్పందించింది. జూన్ లో అమెరికాకు చెందిన 28 ఉత్పత్తులపై సుంకాలను పెంచడం ద్వారా ప్రతీకారం తీర్చుకుంది. అధిక సాంకేతిక ఉత్పత్తుల దిగుమతిపై వివక్ష చూపే మరియు యుఎస్ ఉత్పత్తిదారులను భారతదేశంలో నష్టానికి విక్రయించేలా ఒత్తిడి చేసే ధరల నియంత్రణ వంటి భారత ప్రభుత్వ చర్యలను ప్రస్తావిస్తూ యుఎస్ ప్రభుత్వం ఇప్పుడు జి ఎస్పి ప్రయోజనాలను తాను ఉపసంహరించుకోవడాన్ని మరింత సమర్థించుకుంది.

అమెరికా చైనా వాణిజ్య యుద్ధం కారణంగా లభించిన అవకాశాలను ఉపయోగించుకోలేకపోయినందుకు గాను చాలా మంది భారతదేశాన్ని విమర్శించారు. కొన్ని కఠినమైన చైనా నియంత్రణలను వదిలి వేయడానికి ఉత్పాదక రంగం ప్రయత్నిస్తున్నందున ఈ పెట్టుబడి భారతదేశానికి వస్తుందని స్థానికంగా కొంత అంచనా ఉంది. కార్మిక చట్టాలు, బ్యూరోక్రసీ, మౌలిక సదుపాయాలు తదితరాల్లో ఎన్నో సవాళ్లతో ఉన్న

**- డాక్టర్ అమీర్ ఉల్లా ఖాన్.**

# ఆరోగ్య బీమా ప్రీమియం ఇక వాయిదాల్లో...



ఆరోగ్య బీమా పథకాల సరళీకరణకు, వాటి విస్తరణకు వీలుగా ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (ఇర్డాయి) ఇటీవల కొన్ని మార్గదర్శకాలను, స్వల్ప మార్పులు ప్రకటించింది. ఈ మార్గదర్శకాల ప్రకారం నెలవారీ, త్రైమాసిక, అర్ధ వార్షిక వాయిదాలలో ప్రీమియం చెల్లించే వెసులుబాటు కస్టమర్లకు కలుగుతుంది. గతంలో ఏడాదికి ఒకేసారి ఏకమొత్తంగా ప్రీమియం మొత్తం చెల్లించాల్సి వచ్చేది. ఇది కస్టమర్లకు భారంగా కూడా ఉండేది. తాజా మార్పుతో మరింత మంది కస్టమర్లను ఆకర్శించవచ్చునని అనుకుంటున్నారు. అదేవిధంగా, పాలసీ డాక్యుమెంట్‌లో సరళమైన పదాలు ఉపయోగించే అవకాశాన్ని కూడా బీమా సంస్థలకు కల్పించింది. కాకపోతే, పాలసీ కవరేజీ షరతుల విషయంలో ఎలాంటి మార్పులు ఉండవు. సరళమైన పదాలను ఉపయోగించడం వలన కస్టమర్‌కు పాలసీని అర్థం చేసుకోవడం సులభమవుతుంది. పాలసీలోని అంశాలు మరింత స్పష్టంగా తెలుస్తాయి. దీంతో తాను తీసుకోబోయే పాలసీపై వినియోగదారుడికి సంపూర్ణ అవగాహన ఉంటుంది. ఆరోగ్య బీమా పాలసీల విస్తరణ కోసం బీమా సంస్థలకు మరికొన్ని అవకాశాలు కల్పించింది. మరిన్ని డిస్ట్రిబ్యూషన్ చానల్స్ ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది. దీంతో ఆరోగ్య బీమా పాలసీలు అవసరమైన వారందరికీ అందుబాటులోకి వస్తాయి. కస్టమర్లకు మెరుగైన సేవలు అందించే అవకాశం కూడా బీమా సంస్థలకు లభిస్తుంది. ఇప్పటివరకు ఆరోగ్య బీమా పాలసీలకు 65 ఏళ్ల గరిష్ట వయోపరిమితి ఉంది. అయితే, తాజా మార్గదర్శకాలలో ఈ పరిమితిని కొంత సడలించింది. బీమా సంస్థ గనుక ఈ వయోపరిమితి పెంచాలని అనుకుంటే పెంచవచ్చు. దీనివల్ల బీమీ సంస్థలకు 65 ఏళ్లు పైబడిన వారికి కూడా పాలసీలు ఇచ్చే అవకాశం లభిస్తుంది. దీంతో మరింత మంది వయోవృద్ధులకు ఆరోగ్య బీమా సదుపాయం లబిస్తుంది. లాస్-రేషియా ప్రాతిపదికన ప్రీమియం మొత్తాన్ని 15 శాతం వరకు పెంచే లేదా తగ్గించే అవకాశాన్ని కూడా బీమా సంస్థలకు కల్పించింది. అయితే, ఈ విషయాన్ని ముందుగా రెగ్యులేటర్ సంస్థకు తెలియజేసి, ఆ మేరకు మార్కెటింగ్ చానల్స్ ద్వారా ప్రచారం చేయాల్సి ఉంటుంది. మొత్తం మీద ఈ మార్గదర్శకాలు హర్షించదగ్గవే. ఎందుకంటే ఇవి బీమా ఉత్పత్తుల పంపిణీని మెరుగుపర్చడంలో సహాయపడతాయి . ఉత్పత్తి సమర్పణలో పారదర్శకతను పెంచుతాయి. రెగ్యులేటరీ సంస్థ తన మునుపటి అనుభవాలతో అటు బీమా సంస్థలకు ఇటు వినియోగదారులకు ప్రయోజనం చేకూర్చే మార్పులకు అనుమతించింది. గతంలో బీమా కంపెనీలకు ఫైలింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా ఉండేది. తాజా మార్గదర్శకాలవల్ల ఈ భారం తగ్గి వేగంగా మెరుగైన సేవలు అందించే అవకాశం లభించింది.

**డాక్టర్ రశ్మి నందర్గి, హెడ్- రిటైల్ హెల్త్, ట్రావెల్ అండ్ పిఎ అండర్‌రైటింగ్, బజాజ్ అలియెంజ్ జనరల్ ఇన్సూరెన్స్.**



# ఈ కాన్సెప్ట్ ఆసక్తికరంగా అనిపించింది

**- మహేష్‌బాబు**

ఈ కాంబినేషన్, అలాగే ఈ చిత్రం కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. విజయ్ దేవరకొండ నిర్మాత, తరుణ్‌భాస్కర్ హీరో అని వినగానే మంచి అనుభూతి కలిగింది అని ప్రముఖ హీరో మహేష్‌బాబు అన్నారు. తరుణ్‌భాస్కర్, అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రధారులుగా షమ్మీర్ సుల్తాన్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ చిత్ర నిర్మాణ సంస్థ కింగ్ ఆఫ్ ద హిల్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రూపుదిద్దుకుంటున్న మీకు మాత్రమే చెప్తా చిత్రం ట్రైలర్‌ను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో హీరో మహేష్‌బాబు విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైవిధంగా అన్నారు. ఇంకా ఆయన కొనసాగిస్తూ....పెళ్లిచూపులు నాకు బాగా నచ్చిన సినిమా. విజయ్ చేస్తున్న ప్రయత్నం విజయవంతం కావాలని కోరుకుంటున్నా ట్రైలర్‌తో పాటు కాన్సెప్ట్ ఆసక్తికరంగా ఉంది అన్నారు. నిర్మాత విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, ఈ కాన్సెప్ట్ నచ్చి నేనే నిర్మాతగా ఈ చిత్రం తీస్తున్నాను. నిర్మాత బాధ్యతలు మా నాన్న వర్ధన్ దేవరకొండ తీసుకున్నారు. నా అభిమాన హీరో మహేష్‌బాబు ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా నా మనసుకు నచ్చింది. ట్రైలర్ కూడా మీకు నచ్చుతుందని అనుకుంటున్నాను అని అన్నారు. హీరో తరుణ్‌భాస్కర్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో నన్ను హీరో అంటున్నారు. కానీ నేను ఓ ఆర్టిస్టుగానే అనుకుంటున్నాను. అందరికీ దగ్గరయ్యే కాన్సెప్ట్‌ని దర్శకుడు సమర్థవంతంగా మలిచారు. కథ, కథనాలు సూపర్ ఫన్‌గా ఉంటాయి. విజయ్ చిత్ర నిర్మాణసంస్థలో చేస్తున్నాననే బాధ్యతతో పనిచేశాను అని అన్నారు. నటి అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ, ఈ సినిమా చేయడానికి నన్ను బాగా ఆకట్టుకుంది కథ. తరుణ్ హీరో అనగానే నాకు చాలా ఆసక్తిగా అనిపించింది. తన పాత్రలో అతను చాలాబాగా ఒదిగిపోయారు. చిత్ర నిర్మాణ సంస్థ కూడా మొదటి సినిమా అనే ఫీలింగ్ ఎప్పుడూ కలిగించలేదు. ఒక యంగ్ టీమ్ అందరికీ కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తప్పకుండా అందరినీ ఆహ్లాదపరిచే చిత్రమవుతుందని అనుకుంటున్నాం అని అన్నారు. దర్శకుడు షమ్మీర్ సుల్తాన్ మాట్లాడుతూ, ఈ చిత్రం ఒక సంఘటన నేపథ్యంలో ఉంటుంది. అందరికీ కనెక్ట్ అయ్యే పాయింట్‌తో అలరించబోతున్నాం అని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో నటీనటులు అభినవ్ గోమటం, వాణీభోజన్, నవీన్ జార్జ్‌థామస్ తదితరులు పాల్గొన్నారు.



కీర్తిసురేష్



( ఫైల్ ఫోటో) మంచు మనోజ్ , ప్రణతి రెడ్డి

# మనస్పర్థలు తలెత్తాయి... విడాకులు తీసుకున్నాం

**- మంచు మనోజ్**

హీరో మంచు మనోజ్ తన భార్య ప్రణతిరెడ్డితో విడాకులు తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా తెలిపారు. అందుకు సంబంధించిన ఓ ప్రకటనను గురువారం విడుదలచేశారు. 2015లో వారి వివాహం జరిగింది. లోగడ వారు విడాకులు తీసుకున్నట్లు వార్తలు రాగా...వాటిని ఆయన కొట్టిపారేశారు.ఇక మనోజ్ విడుదల చేసిన ప్రకటనలో... నా వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలకు సంబంధించిన కొన్ని విషయాలను పంచుకోవాలనుకుంటున్నాను. నేను నా భార్యతో విడాకులు తీసుకున్నాను. మా ఇద్దరి మధ్య ఉన్న బంధం ముగిసింది. ఈ విషయాన్ని చెప్పడానికి నేను చాలా బాధపడుతున్నాను. మేము కలిసి ఉన్నంతకాలం మా ప్రయాణం ఆనందభరితంగా సాగింది. మా ఇద్దరి మధ్య కొన్ని సందర్భాలలో మనస్పర్థలు వచ్చిన నేపథ్యంలో మేము విడిపోవాలని నిర్ణయించుకున్నాం. విడిపోతున్నా ఒకరంటే ఒకరికి పూర్తి గౌరవం ఉంది. వ్యక్తిగత కారణాల వల్ల నేను గత కొంతకాలంగా సినిమాలపై దృష్టిపెట్టలేకపోయాను. నా కుటుంబంతో పాటు స్నేహితులు, అభిమానులు నాకు ఎంతో సపోర్ట్‌గా నిలిచారు. నేను ఈ స్థాయిలో ఉన్నానంటే అభిమానుల వల్లే. నాకు అండగా నిలిచిన ప్రతీఒక్కరికీ నా కృతజ్ఞతలు. మళ్లీ నేను సినిమాల్లో నటించబోతున్నాను. నా చివరి శ్వాస వరకు సినిమాల్లో కొనసాగుతా అని తెలిపారు.

# తల్లి సెంటిమెంట్‌తో ఎర్రచీర



శ్రీకాంత్, సాయి తేజస్విని, సి.హెచ్.సుమన్‌బాబు, కారుణ్య, సంజనాశెట్టి, కమల్ కామరాజు తదితరులు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కుతున్న చిత్రం ఎర్రచీర. సి.హెచ్.సుమన్‌బాబు స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం లిరికల్ వీడియో పాటను హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలచేశారు. రాజమండ్రి రైలెక్కి చెక్కేస్తారు...అంటూ సాగే ఈ పాటను ముఖ్యఅతిథిగా విచ్చేసిన దర్శకుడు బాబి విడుదలచేశారు. నటుడు సత్యప్రకాష్ పాటను, ఢమరి మ్యూజిక్ కంపెనీ లోగోను ఆవిష్కరించారు. సినిమా విడుదల పోస్టర్‌ను నిర్మాత తుమ్మపల్లి రామసత్యనారాయణ, బిగ్ సీడీని వక్తలంతా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ, ఐటమ్ సాంగ్ బావుంది. ఈ సినిమా విజయం సాధించి అందరికీ పేరు తీసుకుని రావాలి అని ఆకాంక్షించారు. రామసత్యనారాయణ మాట్లాడుతూ, సినిమాలో కొన్ని సన్నివేశాలు చూశాను. చాలా బావున్నాయి. సినిమాకు టైటిలే హీరో అని అన్నారు. చిత్ర దర్శక, నిర్మాత సుమన్‌బాబు మాట్లాడుతూ, ఇందులో శ్రీకాంత్‌గారు అఘోర పాత్రలో కనిపిస్తారు. ఇది ఆయనకు కొత్త పాత్ర. డిసెంబర్ 27న సినిమాను విడుదలచేస్తాం అని చెప్పారు. సంగీత దర్శకుడు ప్రమోద్ మాట్లాడుతూ, ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పుష్పలీల, నిర్మాత గురురాజ్, రచయిత గోపి, నటి సంజనాశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడా నేపథ్యంలో...

నేను శైలజ, మహానటి చిత్రాల తర్వాత కీర్తిసురేష్‌కు ఎనలేని గుర్తింపు లభించింది. ముఖ్యంగా మహానటి చిత్రంలో సావిత్రి పాత్రలో ఆమె ఒదిగిపోయిన విధానం ఆమె పేరును దశదిశలా వ్యాపించింది. ఉత్తమ నటిగా జాతీయ అవార్డును సొంతం చేసుకున్న ఆమెకు ఇప్పుడు వివిధ భాషలలో అవకాశాలపై అవకాశాలొస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె బాలీవుడ్‌లోకి తొలిసారి అడుగుపెట్టింది. ప్రస్తుతం తెలుగులో మిస్ ఇండియా, రంగ్‌దే చిత్రాలతో పాటు నగేష్ కుకునూర్ దర్శకత్వంలో రూపొందుతున్న వేరొక చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. మరోవైపు హిందీలో అజయ్‌దేవ్‌గన్ ప్రధాన పాత్రలో బోనీకపూర్ నిర్మిస్తున్న మైదాన్ చిత్రంలోనూ, ఇంకా మలయాళంలో మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న మరక్కార్ చిత్రంలోనూ కీర్తి నటిస్తోంది. మైదాన్ చిత్రం కూడా క్రీడా నేపథ్య చిత్రం కావడం గమనార్హం. ఇదిలావుండగా...గురువారం కీర్తి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె టైటిల్ పాత్రలో నగేష్ కుకునూర్ దర్శకత్వంలో సుధీర్‌చంద్ర నిర్మిస్తున్న చిత్రంలోని లుక్‌ను విడుదలచేశారు. దిల్‌రాజ్ సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం క్రీడా నేపథ్యంలో ఉంటుందని చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రం చివరి షెడ్యూల్ నవంబర్ 11 నుంచి హైదరాబాద్‌లో మొదలుకానున్నదని, దీపావళికి ఫస్ట్‌లుక్, చిత్రం టైటిల్‌ను విడుదల చేస్తామని బృందం వివరించింది. దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని సమకూరుస్తుండగా...తనూ వెడ్స్ మను ఫేమ్ చిరంతన్‌దాస్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. ఇంకా ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, జగపతిబాబు, రాహుల్ రామకృష్ణ తదితరులు తారాగణం. ఈ చిత్రానికి సహ నిర్మాత: శ్రావ్యవర్మ.



నుర్సాత్ బరూచా



# రమేష్‌ప్రసాద్‌కు సతీ వియోగం

ప్రముఖ నిర్మాత, ప్రసాద్ గ్రూప్ (ఐమ్యాక్స్, ప్రసాద్ ల్యాబ్స్) ఛైర్మన్ అక్కినేని రమేష్‌ప్రసాద్ సతీమణి, ఎల్. వి. ప్రసాద్ కోడలు అక్కినేని విజయలక్ష్మి గురువారం ఉదయం కన్నుమూశారు. గుండెపోటు కారణంగా రాత్రి నిద్రలో ఆమె తుదిశ్వాస విడిచినట్లు తెలిసింది. ఆమె వయసు 77 సంవత్సరాలు. మద్రాస్‌లో జన్మించిన ఆమె వివాహం రమేష్‌ప్రసాద్‌తో 1963లో జరిగింది. ఈ దంపతులకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు జూబ్లీహిల్స్, ఫిలింనగర్ సమీపంలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. విజయలక్ష్మి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.



యామీ గౌతమ్

# టిక్ టాక్ స్టార్‌గా..

వరుస అవకాశాలతో నటిగా వేగాన్ని పెంచింది బాలీవుడ్ సుందరి యామీ గౌతమ్. ఆమె నాయికగా నటించిన బాల సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో బట్టతల సమస్యను ఇతివృత్తంగా చూపిస్తున్నారు. ఆయుశ్మాన్ ఖురానా హీరోగా నటిస్తున్నారు. యామీ బాల చిత్రంలో టిక్ టాక్ స్టార్‌గా కనిపించనుంది. యామీ మాటల్లో చూస్తే...ఈ చిత్రంలో చిన్న పట్టణంలో ఉండే యువతిగా నటిస్తున్నాను. మోడల్‌గా ఎదగాలని తను ప్రయత్నాలు చేస్తుంటుంది. ఈ ప్రయత్నాల్లో టిక్ టాక్ యాప్‌లో తన వీడియోలు పోస్టు చేస్తుంటుంది. అలా స్థానికంగా పేరు తెచ్చుకుంటుంది. ఈ పాత్ర కోసం నేను టిక్ టాక్‌లో చేరి, అనేక మంది అమ్మాయిలు చేస్తున్న వీడియోలు చూశాను. చిన్న చిన్న నగరాల్లోని మోడల్స్ ఎలా ఉంటారో పరిశీలించాను. ఏ పాత్ర చేసేప్పుడైనా నేను ఇలా పూర్తి మనసుతో పనిచేస్తా. అని చెప్పింది. ఇటీవల యురీ విజయంతో పేరు తెచ్చుకుంది యామీ...తన చిత్రాలకు దక్కే ఆదరణ నటిగా ఆత్మవిశ్వాసం నింపుతోందన్నది ఆమె మాట. విజయాల్లో ఉన్నప్పుడే ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు యామీ తెలిపింది. ఈ విషయంలో ఆమె స్పందన చూస్తే..నాయికగా సంతోషంగా ఉన్నాను. సినిమాల ఎంపికలో ప్రయోగాలు చేసేందుకు ఇదే సరైన సమయం అనుకుంటున్నాను. పరిశ్రమలో స్థిరంగా ఉంటేనే ఉన్నత స్థాయికి వెళ్తాం. అని చెప్పింది.

# నా ప్రతిభ ఎలా తెలుస్తుంది..?

టైప్ కాస్టింగ్‌లో పడటం తనకిష్టం లేదంటోంది యువ తార నుర్సాత్ బరూచా. ఒకే తరహా పాత్రల్లో నటించడాన్ని టైప్ కాస్టింగ్‌గా చెప్పుకుంటారు. ఇమేజ్‌గా మాట్లాడుకునే ఈ పరిస్థితికి దూరంగా ఉండాలని ప్రయత్నిస్తున్నట్లు నర్సాత్ చెప్పింది. ప్యార్‌కా పంచనామా రెండు భాగాల సినిమాలతో తనకు వచ్చే చిత్రాలన్నీ అలాంటివే వస్తున్నాయని ఆమె చెబుతోంది. ఈ రొమాంటిక్ ఇమేజ్‌ను తప్పుకునేందుకు విభిన్న కథల కోసం ఎదురుచూస్తోందట. నుర్సాత్ మాట్లాడుతూ...ప్యార్‌కా పంచనామా సినిమాలు నాకు రొమాంటిక్ గర్ల్ ఇమేజ్ తెచ్చాయి. ఈ సినిమాల తర్వాత అలాంటి అవకాశాలకే అడుగుతున్నారు. ఒకే తరహా పాత్రలు పోషిస్తే...నటిగా నా ప్రతిభ ఎలా తెలుస్తుంది, కొత్తదనం ఎలా వస్తుంది. అయితే అన్ని సినిమాలు ఇలాంటివే కాదు, డ్రీమ్ గర్ల్, తుర్రమ్ ఖాన్, హర్‌దంగ్ లాంటి చిత్రాల్లో వేటికవి భిన్నమైన పాత్రలు పోషించే అవకాశం దక్కింది. అని చెప్పింది. సోనూ కె టీనూ కి స్వీటీ చిత్రంతో నాయికగా పేరు తెచ్చుకుంది నుర్శాత్. నటించింది ప్రతినాయిక పాత్రే అయినా ప్రేక్షకులను మెప్పించింది. ప్రశంసలతో పాటు పురస్కారాలు అందుకుంది. ఆయుశ్మాన్ ఖురానా సరసన డ్రీమ్ గర్ల్, రాజ్ కుమార్‌రావు హీరోగా నటించిన తుర్రమ్ ఖాన్ సినిమాల్లో తారగా మెప్పించింది.


